ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్



# యుగశక్తి  గాయత్రి



ప్రఖర ప్రజ్ఞ

ఓం వందే భగవతీం దేవీం శ్రీరామంచ జగద్గురుం
పాదపద్మే తయోః శ్రిత్వా ప్రణమామి ముహుర్ముహుః

సజల శ్రద్ధ


**సంకల్పం - సంరక్షణ**

వేదమూర్తి, తపోనిష్ఠ, పండిత
**శ్రీరామ శర్మ ఆచార్య**

శక్తి స్వరూపిణి
**మాతా భగవతీ దేవి శర్మ**

ప్రధాన సంపాదకులు
**డాక్టర్ ప్రణవ్ పండ్యా**

సంపాదక వర్గం
**డా॥ యం.రామకృష్ణ**
**డా॥ తుమ్మూరి**
**కందర్ప రామచంద్ర రావు**
**కె.బి.సోమయాజులు**
**జి.సత్యవాణి**
**అశ్విని సుబ్బారావు**

**సంపుటి 4 సంచిక 11**

**ఫిబ్రవరి 2004**

**విడిప్రతి రూ॥ 8.00**
**సం॥ చందా రూ॥ 85**
**3సం॥ చందా రూ॥ 250**
**10 సం॥ చందా రూ॥ 750**


## సత్యం కోసం సంఘర్షించు

నేలను బ్రద్దలు చేస్తుంది. రాళ్లను ఢీకొంటుంది. అప్పుడే నది ముందుకు పోతుంది. తన అస్తిత్వాన్ని కాపాడుకోగలుగుతుంది. మెత్తని మట్టిలోపల ఉన్న విత్తనం తనపైన ఉన్న మట్టి పెళ్ళలను విదిలించే ధైర్యం చేయకపోతే - మహావృక్షంగా ఎదిగే గౌరవం దానికి ఎలా దక్కుతుంది? ముందంజ వేసిన జాతుల చరిత్ర చెప్పే గుణపాఠం ఒక్కటే - శిఖరాగ్రాన్ని చేరడానికై అవి సంఘర్షణ జరపవలసి వచ్చింది. ప్రగతి పథాన్ని స్వయంగా నిర్మించుకోవలసి వచ్చింది. ఆపదలూ, ఆటంకాలూ తమ సాహసాన్ని జయించజాలవని రుజువు చేయవలసి వచ్చింది. సాఫల్యం అనే సింహాసనం వాటికి అప్పుడే లభించింది.

అత్యాచారాలను ప్రతిఘటించగలిగినవాడే, అన్యాయాన్నీ, అవినీతినీ ఎదురొడ్డగలిగినవాడే, వాటిపై తిరగబడగలిగినవాడే నిజంగా ప్రాణం ఉన్న వ్యక్తి. తన కళ్ల ఎదుట అవినీతి తాండవిస్తూ ఉంటే నిమ్మకు నీరెత్తినట్లు కూర్చున్నవాడు పిరికిపంద. వీరత్వంతో జీవించడంలోనే దాగిఉంది మానవ ప్రగతికి మూలాధారం. మనం ప్రపంచంలో తల ఎత్తుకుని సగర్వంగా నిలబడాలంటే, మన ప్రత్యేకతను నిలిపి ఉంచుకోవాలంటే - లోపలా బయటా ఉన్న చెడుగులతో వీరజవాన్‌లా ప్రతి రంగంలో తెగబడి పోరాడాలి. అవినీతిని శాశ్వతంగా సమాధి చేయాలి.

పురోగమించే ఆకాంక్షకూ పునర్జన్మకూ తేడా లేదు. ఉన్నతి పొందాలని అంతరాత్మ పిలుపు ఇస్తే నీ జీవశక్తి అజేయమైన సాహసంతో, విశ్వాసంతో పొంగిపొరలుతూన్నదని అర్థం. ఇక మిగిలిందల్లా - లేచి నిలబడడమే. అడ్డంకులను చీల్చుకుంటూ ముందుకు ఉరకడమే. గమ్యాన్ని చేరేవరకూ సంఘర్షణను కొనసాగించడమే. వీరుడుగా, విజేతగా నిలిచిపోవడమే.

సాహసవంతులు శక్తిని ఎరువు అడగరు. వారి అంతరాత్మయే వారికి బలాన్ని ప్రసాదిస్తుంది. నీతి పథంలో నడిచేవారికి దైవ విశ్వాసం, దైవ అనుగ్రహం చాలు. అలాంటి వ్యక్తి దుర్మార్గాలనూ, గ్రుడ్డి నమ్మకాలనూ, సాంఘిక దురాచారాలనూ అణగద్రొక్కుతూ ముందుకుపోతూ ఉంటే - అతడిని అనుసరించేవారు తమకు తాముగా ఉదయిస్తారు. ఇక ప్రపంచంలోని ఏ శక్తీ అతడిని ఓడించజాలదు.

వాస్తవానికి - నీతి నిజాయితీలు అండగా జరిపే సంఘర్షణయే శాశ్వత ప్రగతికి ఆధారం. వట్టి సంఘర్షణ చాలదు. అది సత్యంతో కలసినప్పుడే లోపలి శక్తి ఆశీస్సు దానికి లభిస్తుంది.

అన్యాయం మనిషిలోని మానవత్వానికి సవాలు. పిరికిపంద ఆ సవాలును ఎదుర్కొనజాలడు. అతడికి తన స్వార్థంనుండీ, తన ప్రలోభాలనుండీ విముక్తి ఎలా కలుగుతుంది? అయితే, మానవత్వం ఇంకా మిగిలి ఉన్నవారు అవినీతినీ, అన్యాయాన్నీ ప్రతిఘటించడానికి ప్రాణాలు ఒడ్డుతారు. మానవ జీవితానికి శోభ ఇచ్చేది అదే.

**తనపై విజయం సాధించినవాడే నిజమైన విజేత.**

# విషయ సూచిక

**ముఖ చిత్రం : పరమ శివుడు**

మహాశివరాత్రి ఫిబ్రవరి 19


1. **సంపాదకీయం :**
సత్యంకోసం సంఘర్షించు 1
2. **విషయ సూచిక** 2
3. **వేదమంత్రం** 3
4. **ముఖచిత్ర కథనం :**
శివ సంకల్పానికి శుభముహూర్తం శివరాత్రి 4
5. **వందే మాతరం :**
సమన్వయ సంస్కృతికి స్థావరం భారతవర్షం 6
6. **బోధ కథ :**
బ్రహ్మచర్యంలో బ్రహ్మవిద్యా రహస్యం 8
7. **కుటుంబ నిర్మాణం :**
ఉమ్మడి కుటుంబానికి కొత్త నమూనా 11
8. **మనం - మన ఆరోగ్యం :**
ఆరోగ్యానికి తారకమంత్రం ప్రాకృతిక జీవనం 13
9. **ధారావాహికం: దివ్యజీవన దర్శనం - 2**
జోక్యం చేసుకున్న దివ్యచేతన 16
10. **మాతాజీ దివ్య జీవనం : 4**
ఆరాధ్యునితో కలిసే భావ భూమిక 20
11. **బోధ కథ :**
దుష్కర్మకు ఫలితం 23
12. **గాయత్రి విజ్ఞానం :**
గాయత్రి సాకార ప్రతిమ యజ్ఞోపవీతం 25
13. **శతసూత్ర కార్యక్రమం : 31-40**
ధర్మదీక్షను రగిలించే పథకం 30
14. **యుగ గీత :**
యజ్ఞాల ద్వారా పాపనాశనం 32
15. **బోధ కథ :**
లోభగుణమే గ్రుడ్డితనం 34
16. **కృష్ణావతారం - 15 :**
శ్రీకృష్ణుని దినచర్య 36
17. **సాధుసంత్‌ల జీవితాలు :**
మహాభక్తురాలు కాన్హోపాత్ర 39
18. **వ్యక్తి నిర్మాణం :**
సాఫల్యానికి పదకొండు సూత్రాలు 41
19. **నావారితో నా మాట :**
ఇక పురోగమించు జీవన సాధన పథంలో
మహాకాలుని సంతానమా! జాగుచేయకు! లే! మేలుకో! 43
20. **శాంతికుంజ్ సమాచారం**
గ్రామతీర్థయోజన అమలుకు సృజనవాహిని యాత్ర 46
21. **వార్తలు** 46
రాష్ట్రంలో దిగ్విజయంగా
భారతీయ సంస్కృతి జ్ఞానపరీక్షలు 48


## గమనిక

వార్తలు పంపే పరిజనులకు రెండు సూచనలు :

ఫోటోల వెనుకవైపున వాటి వివరం తప్పక ఉండాలి.

అక్షరాలు స్పష్టంగా ఉండాలి.

## ఫిబ్రవరి మార్చి నెలలలో పర్వదినాలు

**ఫిబ్రవరి :**

2 భీష్మ ఏకాదశి.

9 శృంగేరి శారదాంబ రథోత్సవం.

19 మహాశివరాత్రి.

22 రామకృష్ణ పరమహంస జయంతి.

**మార్చి :**

6 చైతన్య మహాప్రభు జయంతి.

7 హోలీ.

21 తెలుగు సంవత్సరాది.

30 శ్రీరామనవమి.

**కఠోర పరిశ్రమవల్ల వ్యక్తిత్వం శోభిస్తుంది.**

# వేద మంత్రం

**యేన దేవాః పవిత్రేణాత్మానం పునతే సదా ।**
**తేన సహస్రధారేణ పావమానీః పునన్తు నః ॥**

- సామవేదం 1302

**భావార్థం :** ఆత్మిక, మానసిక దోషాలను త్యజించి నిర్మలము, పవిత్ర మగుటలోనే మనుష్య జీవన సాఫల్యము ఉన్నది. ఆత్మ మలవిక్షేప, ఆవరణ రహితమగుటకు వేదములలో అనేక ఉపాయములు వర్ణించబడినవి. అందువలన అవి పఠనీయములు.

**సందేశం :** ఈ మానవ జీవనము ఎన్ని పుణ్యకర్మముల ఫల స్వరూపముగా ప్రాప్తించినదో మనకు తెలియదు. దీనిని సత్కర్మలలో ఉపయోగించినపుడే మనుష్యుడు శాశ్వత ఆనందాన్ని పొందగల్గుతాడు. వేదాలలో అనేక నీతి వాక్యా లున్నవి, వాటి బోధ ఏమిటంటే జీవితంలో మనుష్యుడు ఎల్లప్పుడూ ఎదగాలని. అత డెన్నడూ పతనోన్ముఖుడు కాకుండుగాక అని. ప్రతి మనుష్యుని కర్తవ్యమేమిటంటే అతడు అన్ని దుర్గుణాలను త్యజించ గలగాలి. స్వార్థము, లోభము, మోహము, అహంకారము మొదలైన దానవులు ఆత్మను చుట్టుముట్టి ఉంటారు. వీటి నుండి విముక్తి పొందుటకు దృఢ ఇచ్ఛా శక్తి ఆవశ్యకత ఉన్నది. అప్పుడు మాత్రమే ఆత్మ నిర్మలము, పవిత్రము కాగల్గుతుంది.

వేద మంత్రాలలో ఇచ్ఛాశక్తి దృఢత్వము గురించి అత్యధికంగా నొక్కి చెప్పబడింది. తపస్సు, సాధన, కఠిన పరిశ్రమ, మనస్సు లగ్నము చేయుట ద్వారానే మనుష్యుడు తన సమస్త ఇచ్ఛాశక్తులను పూర్తి చేసుకోగల్గుతాడు. గొప్ప ఆకాంక్ష మనుష్యుని ప్రాణ శక్తిని తెలియచేస్తుంది. దానితోపాటు త్యాగము, బలిదానముల భావన ఆవశ్యకము. తపస్సు, సాధన ద్వారా మనుష్యుడు ఇటువంటి తన ఇచ్ఛను పూర్తి చేసుకొన్నప్పుడు పరోపకార కార్యములు చేసి తన జీవితాన్ని సఫలం చేసుకోగల్గుతాడు. ఏ వ్యక్తి జీవన సాఫల్యమైనా అతని ఇచ్ఛాశక్తి వికాసము నిష్పత్తిలోనే ఉంటుంది. ప్రకృతి శక్తులు కూడా మానవీయ ఇచ్ఛాశక్తి ముందు ఓడిపోతాయి. ప్రపంచములోని సభ్యతా వికాసము, మనుష్యుని సమస్త కార్యకలాపాలు, భౌతిక సాఫల్యాలు మానవీయ ఇచ్ఛ యొక్క ప్రకటీకరణ.

మనుష్యుని ఈ ఇచ్ఛాశక్తి శీలము నుండి ఉత్పన్నమవుతుంది. ఆ శీలము కర్మల నుండి రూపొందుతుంది. అందువలన ఎటువంటి కర్మలు చేస్తామో, ఇచ్ఛాశక్తి వ్యక్తీకరణ కూడా అటువంటిదే అవుతుంది. నైతిక జీవనం జీవించుట లాభదాయకమని మనకందరకు తెలుసు. కానీ మనం పాపకర్మలు చేస్తున్నాము. తరువాత దాని దుఃఖఫలం మనం అనుభవించవలసి వస్తున్నది. కర్మఫలం నుండి తప్పించుకొనే మార్గమే లేదు. మన రోజువారీ జీవితంలోని మూలభూతమైన ఆపదలకు మూలము ఏదో ఒక తప్పనిసరి దుష్కర్మ కాక మన సంకల్ప అసఫలతయని, అది చెడును వదిలివేయకుండా నిరోధిస్తున్నదనేది నిర్వివాదము. ఏ వ్యక్తి చెడు ఆలోచనలను జయిస్తాడో అతడు తప్పక తన అమోఘ ఇచ్ఛాశక్తికి యజమాని అవుతాడు.

దారి తప్పి తిరుగుతున్న ప్రాణి తాను ఆత్మయని, శరీరం కాదని తెలుసుకున్నప్పుడు అతడు శక్తిశాలి అవుతాడు. తన ఆత్మలో ఈశ్వరుడు నివసిస్తున్నాడని తెలుసుకొన్నప్పుడు ఆత్మలో అద్భుత ప్రచండ శక్తి ఉత్పన్నమవుతుంది. ఈ శక్తే మానసిక దోషాలను వదలివేయుటకు కావలసిన సామర్థ్యాన్ని ఉత్పన్నం చేస్తుంది. దుర్గుణాలు దుష్ప్రవృత్తుల నుండి ముక్తి పొందిన మనుష్యునిలో సాత్విక, దివ్య భావ ధార ప్రవహించి, చెడుతో సంఘర్షించుటకు ఉత్సాహాన్ని ఇస్తుంది.

చెడును మూలంతో సహా పెరికి వేయి, మంచిని పోషించు అనే వేదాల ఈ ఆదేశమును ఎప్పుడు గుర్తుంచుకో.

☆ ☆ ☆

**జ్ఞానయోగిలా ఆలోచించు; కర్మయోగిలా కృషిచెయ్యి; భక్తియోగిలా ఆర్ద్రత పెంచుకో.**

## ముఖచిత్ర కథనం

# శివ సంకల్పానికి శుభముహూర్తం శివరాత్రి

**హర హర మహాదేవ! జయ శివ శంభో! బమ్ బమ్ భోలే!** - అనే పవిత్ర ధ్వానాలు నేడు శివరాత్రి అని చెపుతున్నాయి. భారత ప్రజలందరికీ ప్రేరణ ఇచ్చే మహాపర్వం శివరాత్రి.

పర్వాలు మన సాంస్కృతిక చైతన్యపు జ్యోతి కిరణాలు. పర్వాలు జీవితంలో, జగత్తులో ఉల్లాసాన్నీ, ప్రసన్నతనూ, గతినీ, ఏకతనూ, నవ ప్రేరణ వెలుగునూ వ్యాప్తి చేస్తాయి. తద్వారా మన జీవన చేతన మేలుకొంటుంది.

శివరాత్రి ఉద్దేశ్యంకూడ మన జీవన చేతనను మేలుకొలపడమే. దేవాధి దేవుడైన మహాదేవుని ఉపాసన ద్వారా, వ్రతంద్వారా, సంకల్పం ద్వారా మనం ఈరోజున ఆత్మబోధను పొందవలసి ఉంది. ఈ పండుగలో ఇమిడి ఉన్న ప్రేరణలకు అన్ని మత విశ్వాసాలవారూ ఏదో ఒక రూపంలో ప్రాముఖ్యం ఇస్తారు. వారి విధానాలూ, పద్ధతులూ స్పష్టంగా ఉండవచ్చు, అస్పష్టంగా ఉండవచ్చు. వాస్తవం ఏమంటే - జీవన బోధ జరగనిదే జీవితంలోని చీకటి తొలగిపోదు.

శివరాత్రి బోధ ఉత్సవం. ఆత్మచింతనకూ, ఆత్మ పరీక్షకూ సదవకాశం. జీవితంలో శ్రేష్ఠమూ, శుభకరమూ అయిన వ్రతాలనూ, సంకల్పాలనూ, ఆలోచనలనూ చేపట్టడానికి ప్రేరణ ఇచ్చే పర్వం శివరాత్రి. నేటి భౌతికవాదపు భోగవాదపు హడావుడులలో మన ఆత్మచేతన మరణిస్తోంది. అలాంటి జీవితాలలో చైతన్యాన్ని నింపడానికీ, దానిలో ఇమిడి ఉన్న సత్యాన్ని బోధించడానికీ ప్రతి సంవత్సరం శివరాత్రి వస్తుంది. భారతీయ జీవన ప్రవాహంలో ఆత్మబోధ ఎప్పుడూ వినిపిస్తూనే ఉంది. **'ఆత్మానం విద్ధిః'** - అని బోధించాయి ఉపనిషత్తులు. అనగా - ప్రపంచాన్ని గురించి తెలుసుకోవడంతోపాటు ఆత్మనుకూడ తెలుసుకో. ఆత్మజ్ఞానం లేనిదే మనిషి జీవితం సార్థకం కాదు.

ఆది శంకరులు తమ కఠోర తపస్సు, తీక్షణమైన ఆత్మసాధనల సారాన్ని ఒకే సూత్రంలో ప్రతిపాదించారు-**'న ఋతే జ్ఞానేన ముక్తిః'** అనగా - ఆత్మజ్ఞానం, సత్యజ్ఞానం లేనిదే మనిషి బంధనాలనుండి విముక్తి పొందడు. బంధనమే జీవితంలో దుఃఖానికి కారణం. ఈ బంధనాలన్నీ అజ్ఞానంనుండి జనిస్తాయి. కళ్యాణకారకం అయిన శివతత్వంవైపు మళ్ళనంత వరకు, జీవితం దుఃఖంనుండి, చింతనుండి, పీడనుండి, అశాంతినుండి విముక్తి పొందదు. **'నాన్యః పంథా విద్యతే అయనాయ'** - అని వేదం ఈ భావాన్ని బలపరుస్తూ చెప్పింది. అనగా- మరో మార్గం లేదు. మార్గం ఒక్కటే. మనను మనం తెలుసుకుని, పరమేశ్వర సాన్నిధ్యాన్ని పొందడం. ఆయన శరణు పొందడం. ఆయన ఆజ్ఞను పాలించడం. ఆయన సత్తాను కణ కణంలో, అణువు అణువులో అనుభూతి పొందడం. జీవితాన్ని అధర్మంనుండి, పాపంనుండి, అసత్యంనుండి దూరంచేసి, దానిని సన్మార్గంలో పెట్టడం. జీవితంలోనికి వచ్చిన దుర్గుణాలకూ, దుర్వ్యసనాలకూ, దుఃఖాలకూ మూల కారణాలను గుర్తించడం. వాటిని తొలగిస్తానని సంకల్పం చేయడం. నిద్రపోతూన్న ఆత్మను మేలుకొలిపే వ్రతాన్ని స్వీకరించడం. నేడు శివరాత్రి చెపుతూన్నది ఇదే.

లే! మేలుకో! నీ జీవితాన్ని, జగత్తునూ చక్కదిద్దుకో. ఈ జీవితం ఎంతో అమూల్యమైనది. దీని విలువను తగ్గించవద్దు. ప్రకృతి పరమేశ్వరుల, శరీరం ఆత్మల, భౌతికత ఆధ్యాత్మికతల, భోగ యోగముల సమన్వయాన్ని సాధించి పురోగమించు. ఫలితంగా జీవితంలో, జగత్తులో సామరస్యం, ఏకగ్రీవత ఏర్పడతాయి. భారతీయ జీవన విధానానికి ఆధారం ఇదే. **'అతి సర్వత్ర వర్జయేత్'** అనే సూత్రంకూడ ఇదే చెపుతోంది. నేడు జాతిలోనూ, విశ్వంలోనూ భౌతికవాదం హద్దు మీరిపోయింది. మనిషి భౌతికవాదిగా, భోగవాదిగా, దేహవాదిగా, ప్రకృతివాదిగా తయారైనాడు. ఫలితంగా అంతటా అశాంతి, కలహం, హింస, పాపం, అధర్మం, దుఃఖ దైన్యాలు విలయతాండవం చేస్తున్నాయి.

మానవత్వం ఖండితమై, గాయపడి, ఆర్తనాదం చేస్తోంది. మనిషి ఆకారంలో మాత్రమే మనిషిగా మిగిలిపోయాడు. అతడి ప్రవృత్తి రాక్షస ప్రవృత్తి అయిపోయింది. నలువైపులా అవినీతి, రోగం, అరాచకత్వం, క్రమశిక్షణారాహిత్యం విజృంభిస్తున్నాయి. వ్యక్తి, కుటుంబం, సమాజం, జాతి, ప్రతిచోటా చీలికలే చీలికలు. అంతటా విచ్ఛిన్నత, విఘటన, చెదరుబాటు. మానవతా దృక్పథం, జీవన విలువలు కాగడా పెట్టి వెదికినా కానరావడం లేదు. ఈ దుష్పరిణామాలన్నింటికీ మూల కారణం ఆత్మపక్షాన్ని మరచిపోవడం. శారీరిక సుఖ సాధనాలూ, భౌతిక ఉన్నతీ మాత్రమే జీవితానికి పరమ లక్ష్యములుగా మనం పరిగణిస్తున్నాం. మదంతో, స్వార్థంతో గ్రుడ్డిగా

**వ్యక్తివాదాన్నికన్న సముదాయవాదాన్ని మన్నించే వ్యక్తులున్న సమాజం ఉన్నతి పొందుతుంది.**

పరుగులు పెడుతున్నాం. ఎక్కడికి వెళ్లాలో, దేన్ని చేరుకోవాలో ఎవరికీ తెలియడం లేదు.

అంతటా మూర్ఛావస్థ. అంతటా మత్తు. ఆత్మ ఏనాడో ఆకలితో స్పృహతప్పి పడిపోయింది. నిజమే. అది ఆకలితో ఉంది. అది భోజనం కావాలని అడుగుతోంది. అది తన మూల స్థానం అయిన శివునివద్దకు వెళ్లాలని కోరుతోంది. పిల్లవాడు తన తల్లిదండ్రుల ఒడిని చేరి నిర్భయతనూ, శాంతినీ పొందుతాడు. అలాగే, ఆత్మ పరమశివుని ఒడికి చేరి, భయంనుండీ తాపంనుండీ విముక్తి పొందాలని కోరుతోంది. మనిషి బయటి ప్రపంచంలో ఎంతగా ఉరుకుతూ పరుగులు పెడతాడో అంతగా ఆత్మానందానికి దూరం అవుతూ ఉంటాడు. డబ్బుతో కొనగలిగేవి దేహానికీ, ఇంద్రియాలకూ, సంసారానికీ కావలసిన సుఖ సాధనాలు మాత్రమే. కనుకనే నేటి ప్రపంచం మేడిపండులా తయారయింది. బోలుగా తయారయింది. ఈ వెలితిని పూడ్చడానికై మద్యం, జూదం, సినిమాలు, క్లబ్బులు, పార్టీలు - వీటివైపు పరుగుల వేగం పెరిగిపోతోంది.

కానీ, వాసనలవెంట, వాంఛలవెంట అంతంలేకుండా పరుగు తీస్తున్నకొద్దీ భోగ దాహం మరింతగా రెచ్చిపోతుంది, మరింతగా పెరిగి పోతుంది. జీవితం ఎండమావిగా మిగిలిపోతుంది. జీవితం గురించిన అవగాహన చేస్తే పరుగంతా వృధాయే అని జీవితాంతంతో మనిషికి తెలిసివస్తుంది. 'ఎంతో కోల్పోయావు. ఎంతకాలమో నిద్రపోయావు. ఇక కోల్పోవద్దు. ఇక నిద్రించవద్దు. నీ జీవితాన్ని పవిత్రంగా మలచుకుంటానని, దానిని ఉన్నతోన్నతం చేస్తానని నేడు సంకల్పం చెయ్యి. ఆత్మజ్ఞానాన్ని మేలుకొలుపుతానని, ఆచరణను, ఆలోచనను సంస్కరించుకుంటానని నేడే ఇపుడే సంకల్పం చెయ్యి. ఈ శరీరంలోని సత్యం, అమూల్య తత్వం ఆత్మ. దానిని తెలుసుకుంటానని సంకల్పం చెయ్యి.' - అని మనందరికీ బోధించడానికి వచ్చింది శివరాత్రి.

శివుని సనాతన తత్వమైన ఆ ఆత్మ వెలికిరాగానే శరీరం శవంగా మిగిలిపోతుంది. ఆత్మ శరీరంలోపల ఉన్నంతవరకే, శరీరానికి గతి, సౌందర్యం, ఆకర్షణ ఉంటాయి. సంబంధాలలో మాధుర్యం ఉంటుంది. ఆ చేతన ఆత్మ తన ఆరాధ్యుడు, తన సర్వస్వమూ అయిన శివుణ్ణి కలుసుకోవాలి. శివుని రూపంలో ఉన్న పరమేశ్వరునినుండి అది విడిపోయి ఎన్ని యుగాలు గడచిపోయాయో. ఎంత విచిత్రమైన పరిస్థితి. యుగ యుగాలుగా ఒకే ఇంటిలో కలసి నివసిస్తున్నా వారి మధ్య సంభాషణ జరగలేదు, వారి కలయిక జరగలేదు. శరీరమనే ఈ ఇంటిలో ఆత్మ, పరమాత్మ రెండూ ఉంటున్నాయి. ఈ శరీరంలో ఇద్దరూ ఉన్నారు. కలసి ఉంటున్నప్పటికీ, ఆత్మ తన ప్రియుడైన శివునితో మాట్లాడలేకపోయింది. శివుణ్ణి కలియలేకపోయింది. ఎందుకంటే, కలుసుకోవాలనే కోరిక లేదు. కలుసుకోవాలనే ఆతురత లేదు. కలుసుకోవాలనే తపన లేదు. విడిగా ఉన్నాననే బాధ, అశాంతి లేవు. ఎలా ఉంటాయి? అజ్ఞానం, జడత్వం అనే అంధకారంలో ఆత్మ తన స్వరూపాన్ని మరచిపోయింది. ఇప్పుడు దానికి నాటకాలపై, బూటకాలపై, విషయ భోగాలపై చర్చ జరపడం, ఆలోచన చేయడం ఇష్టంగా ఉంది. ఈ ఆత్మ తన శివునికి పెడమోము అయింది. ఇప్పుడు దానికి శివునిపట్ల ప్రేమ లేదు, శివుని అవసరం లేదు. అది శివుణ్ణి జీవితంనుండి తొలగించివేసింది.

శివరాత్రి శివుణ్ణి కలిసే రాత్రి. శివరాత్రి రోజున ఆత్మ మంగళకరుడైన శివునితో కలుస్తుంది. లోతైన ఈ కలయికలో పరస్పర సంభాషణ జరుగుతుంది. విడిపోయిన వారు ఏకమవుతారు. ఇక నిద్ర ఎలా వస్తుంది? మొదట ఆత్మ తనకు పరమప్రియుడైన శివుణ్ణి కలుసుకోడానికి సన్నాహాలు చేస్తుంది. శుభ్రంగా, స్వచ్ఛంగా, నిర్మలంగా తయారవుతుంది. ఈ కలయిక కోసం వేచి చూడడంలో రోజంతా గడిచిపోతుంది. నామ సంకీర్తనలో, పూజలో, స్తోత్ర పఠనంలో రోజంతా గడిచిపోతుంది. ఆత్మ ప్రాయశ్చిత్తంతో తన పాపాలను క్షాళన చేస్తుంది. ఏడుస్తుంది. ఆతర్వాతనే రాత్రి పూట శివునితో కలయిక జరుగుతుంది.

ఈ భావనయే శివరాత్రిలోని సాంస్కృతిక, ధార్మిక, ఆధ్యాత్మిక చైతన్యం. ఈ భావనతోనే జీవితంలో చైతన్యం వెల్లివిరుస్తుంది. కానీ, నేడీ భావన ఎక్కడా కానరావడం లేదు. శివరాత్రి పర్వం వెనుక ఉన్న మౌలిక దృష్టి, సిద్ధాంతం, ఆలోచనలను మనం కోల్పోయాం, కోల్పోతున్నాం. శివరాత్రిలో ఇమిడి ఉన్న ఆత్మనిర్మాణం, ఆత్మసంస్కరణ, ఆత్మోద్ధరణ అనే చైతన్యం నేటి కోలాహలంలో, ఉరుకులు పరుగులలో, తిరణాల సందడిలో ఎక్కడా కానరావడం లేదు. ఇది శివభక్తికికాక, శివునినుండి విభక్తికి, వేర్పాటుకు చిహ్నం. తన ఆంతరిక చేతనలో నేడు శివ సంకల్పాన్ని, శుభ సంకల్పాన్ని నింపుకున్న వ్యక్తియే నిజమైన శివభక్తుడు. నేడు శివునితో కలయికకై తన ఆత్మసంస్కరణలో ఒక కొత్త అడుగు ముందుకు వేసినవాడే నిజమైన శివభక్తుడు. పాపాన్నీ, అధర్మాన్నీ, చెడుగునూ పూర్తిగా వదులుకోవాలనే తపన, ఆరాటం, తహతహ, ఉద్వేగం ఎవరిలో తీవ్రం, తీవ్రతరం, తీవ్రతమం అవుతున్నవో అతడే నిజమైన శివభక్తుడు.

నేడు శివరాత్రి పావనపర్వం రోజున పరమశివుని స్మరించి, మనం మన శివభక్తిని పరీక్షించుకుందాం. మహేశ్వరుడు మనకు వరం ఇవ్వడానికి ఉవ్విళ్లూరేటట్లు ఏదైనా ఒక పని చేసిచూపుదాం.

★★★

**పరిస్థితిని మార్చే శక్తి కార్యశూరతకు ఉంది.**

వందే మాతరం

# సమన్వయ సంస్కృతికి స్థావరం భారతవర్షం

ఇది వైజ్ఞానిక యుగం. సంచార విప్లవం (కమ్యూనికేషన్ విప్లవం) అనే చరిత్రాత్మక సంఘటన ప్రపంచమంతటినీ ఒక గ్రామంగా మార్చివేసింది. అందువల్ల మనిషికీ మనిషికీ మధ్య భౌగోళికమైన దూరం తగ్గిపోయింది. అయితే, హృదయాలమధ్య అంతరం తగ్గలేదు. విశ్వగ్రామ సిద్ధాంతానికి సజీవ రూపం ఇవ్వడానికై సమన్వయాన్ని సాధించే ఒక రసాయనం నేడు అవసరం అవుతోంది. గుండెనూ, గుండెనూ జోడించే పనిని, ప్రపంచంలోని వివిధ మతాలు, సంప్రదాయాలు, సమాజాల మధ్య ఉన్న అంతరాలను అంతం చేసి వాటిని ఒకే సూత్రంలో బంధించే పనిని ఆ రసాయనం నెరవేర్చాలి. ఈ గురుతర బాధ్యతను భారతీయ సంస్కృతి సమర్థవంతంగా నిర్వహించగలుగుతుంది. ఎందుకంటే ఆ సాంస్కృతిక సంవేదనలో ఉదారత,సహనం,సమన్వయశీలతలను మేళవించిన దివ్య రసాయనం ఉన్నది. అది ఈ యుగంలోని అంతరాలను తొలగించి మానవాళిని కుటుంబ సూత్రంలో బంధించగలుగుతుంది.

ప్రతి జాతికీ తనదైన ఒక జీవన లక్ష్యం ఉంటుంది. రోమ్ జీవన లక్ష్యం సామ్రాజ్యాన్ని, శక్తిని విస్తరించడం. గ్రీకు జాతి లక్ష్యం జ్ఞాన సంపాదన. అరబ్బు జాతుల ఆవిర్భావానికి పూర్వం ఈజిప్టు చనిపోయిన వ్యక్తులను పిరమిడ్‌లలో సజీవంగా ఉంచాలనే అమరత్వ భావనను లక్ష్యంగా ఏర్పరచుకున్నది. అలాగే భారత్‌కు కూడా ఒక జీవన లక్ష్యం ఉన్నది - సామాజిక సామరస్యాన్ని, సమన్వయాన్ని సాధించడం. భిన్నత్వంలో ఏకత్వం, వైవిధ్యంలో సమత - ఇదే భారతీయ సంస్కృతిలో అనాదిగా ఉన్న ప్రత్యేకత. దర్శనంలో కాని సాహిత్యంలో కాని వాస్తుశిల్పంలో కాని కళలో కాని - అంతటా వైవిధ్యం ఉన్నది. అయితే ఈ భిన్నత్వంలో ఏకత్వాన్ని చూడడం భారతీయ మనీషుల ఆకాంక్షగా ఉంటూ వచ్చింది. నేడు సైతం భారత జాతి ఈ ఆకాంక్షను హృదయంలో పదిలపరచుకున్నది.

జాతి నిర్మాణంలో భాష,మతం,తెగ మున్నగునవి ప్రధాన అంశాలుగా పరిగణించబడతాయి. యూరప్‌లో ఒకే క్రైస్తవ మతం ఉంది. అయినా డజను జాతులు ఉన్నాయి. మధ్య ప్రాచ్యంలోను, దక్షిణ ఆసియాలోను ఒకే ఇస్లాం మతం ఉంది. అయితే 40కి పైగా జాతులున్నాయి. ఒకే బౌద్ధ మతాన్ని అనుసరించే జాతులు అనేకం ఉన్నాయి. కానీ - భారత్‌లో వైదిక, ఇస్లాం, క్రైస్తవ, బౌద్ధ, జైన, సిక్కు, పారసీ మున్నగు కనీసం అరడజను మతాలను అనుసరించే ప్రజలు శతాబ్దాలుగా నివసిస్తున్నారు. భాష ప్రాతిపదికపై పాకిస్తాన్ రెండు ముక్కలైంది. ఇటీవల కెనడాలో జరిగిన ప్రజాభిప్రాయ సేకరణ ఆధారంగా దేశ విభజన దగ్గర పడింది. మరోప్రక్క భారత్‌లో రాజ్యాంగ పరంగా గుర్తింపు పొందిన జాతీయ భాషలు 18 ఉన్నాయి. ఇక మాండలికాలు వేయికి పైగా ఉన్నాయి. తెగలు సైతం అనేకం ఉన్నాయి. ఉత్తర భారతంలో ఆర్యులు, దక్షిణంలో ద్రవిడులు, ఈశాన్య భారతంలో మంగోలులు - అంతా కలసి ఉంటున్నారు. అలాగే ఆహార విహారాలు, వేష భూషలు, పండుగలు, సంగీతం, సాహిత్యములలో వైవిధ్యం స్పష్టంగా కానవస్తోంది.

వాస్తవానికి భిన్నత్వంలో ఏకత్వం మన సంస్కృతి,మన నియతి. భారత్‌లోని ఏకేశ్వర వాదంలో ఒక ప్రత్యేకత ఉంది. పరమ సత్యం ఒక్కటే. జనం దానికి రకరకాల పేర్లు పెడతారు. **'ఏకం సద్ విప్రా బహుధా వదంతి'.** తత్వం ఒక్కటే. కల్పనలు అనేకం. దాన్ని కొందరు బ్రహ్మ అంటారు. కొందరు ఇంద్రుడని అంటారు. కొందరు వరుణుడని అంటారు. దాన్ని ఖుదా అనీ, గాడ్ అనీ కూడా పిలుస్తారని ఆధునిక నేపథ్యంలో మనం చెప్పవచ్చు. 'ఈశ్వర అల్లా తేరే నామ్'. అంతేకాదు. మన శృతులలోని దేవ కల్పన ఏకేశ్వర వాదాన్ని దాటి 'అద్వైతం' వరకు వెళ్లింది. 'ఏకమేవాద్వితీయమ్, ఏకోహం ద్వితీయో నాస్తి'. సగుణ నిర్గుణాలకు అతీతమైన తత్వం ఇది. అంతే కాదు. అది ఆత్మ, అనాత్మ, జగత్ కర్త,అకర్త మున్నగు కల్పనలకు అతీతమైనది. ఉపనిషత్తు దానిని 'నేతి - నేతి' అన్నది. ఎందుకంటే - అది శబ్దానికే కాక మనసుకూ, వచనానికీ, కల్పనకూ కూడా అతీతమైనది.

దర్శన రంగంలో కూడా ఈ వైవిధ్యాన్ని చూడవచ్చు. వైశేషికం, జైనం,మీమాంసలలో అనేకత్వం ప్రతిష్ఠించబడింది. సాంఖ్యంలో పురుషుడు, ప్రకృతి అనే ద్వైతం ఉంది. చివరికి అద్వైత దర్శనం వస్తుంది. అయితే వైశేషికంలోని పంచభూతాలు, సాంఖ్యంలోని పురుషుడు, ప్రకృతి ద్వైతం - ఇవి అద్వైతంలోని జగత్‌వ్యాఖ్యలో ఇముడ్చబడ్డాయి. **'సర్వఖల్విదం బ్రహ్మ', 'ఈశావాశ్యమిదం'** అనడంతోనే అన్నీ అందులో కలిసిపోతాయి.

మత సమన్వయ సాధన మన సాంస్కృతిక వారసత్వం. నాస్తికులూ, ఆస్తికులూ అందరూ సనాతన ధర్మంలో స్థానం పొందుతారు. వేదాలను నమ్మినా నమ్మకపోయినా - ఏ ఒక్కరినీ బహిష్కరించే సంప్రదాయం మనకు లేదు. అలాగే, శైవం, వైష్ణవం, శాక్తేయం, ఉదాసీనం మున్నగు మతాలన్నీ వైదిక ధర్మంలో అంతర్భాగాలే. ఇందులో కనీసం 300 - 400 మత సంప్రదాయాలు చేరి ఉన్నాయి. వాస్తవానికి భారతీయ మనీషులు మతాన్ని ఏదో ఒక ప్రత్యేక సంప్రదాయానికీ, పంథ్‌కూ పరిమితం చేయలేదు. అన్ని మతాల, అందరు మత ప్రవక్తల, అన్ని తీర్థస్థలాల పట్ల ఆదరం, పూజ్య భావం భారతీయ మతంలోని ప్రత్యేకత. కనుకనే విశ్వమత మహాసభలో స్వామి వివేకానంద 'విశ్వమతం' అనే సిద్ధాంతాన్ని ప్రతిపాదించి, దానిద్వారా అన్ని మతాల ప్రత్యేక లక్షణాలతో

**సర్వవ్యాపి అయిన పరమేశ్వరుని దృష్టినుండి ఏ పనీ, ఏ ఆలోచనా తప్పించుకోలేదు.**

మానవజాతి ప్రయోజనం పొందాలని నిర్దేశించారు. హిందూ మతంలోని ఆధ్యాత్మికత, సాత్వికతలూ, ఇస్లాంలోని సోదరత్వ సమానతలూ, క్రైస్తవంలోని సేవా ప్రేమ భావనలూ - ఇదంతా మానవజాతికి చెందిన ఉమ్మడి సంపద. "మతతత్వానికి రోజులు చెల్లిపోయాయి. అధ్యాత్మ విజ్ఞానాల మధ్య సమన్వయాన్ని సాధించే యుగం వచ్చింది'' అని ప్రకటించారు వినోబాజీ.

అలాగే - రాజనీతి విషయంలో చూస్తే - మన శాస్త్రాలలో ఎనిమిది రకాల రాజ్యాల వర్ణన ఉంది - స్వరాజ్యం, వైరాజ్యం, మహారాజ్యం, సామ్రాజ్యం మున్నగునవి. రాజసూయ యజ్ఞం, అశ్వమేధ యజ్ఞం, చక్రవర్తి రాజ్యం అనే ప్రక్రియలలో, సిద్ధాంతాలలో భిన్నత్వంలోని ఏకత్వం కానవస్తోంది. జాతి అనే సంకుచిత పరిధిలో ఉండిపోవడం మన ప్రవృత్తి కాదు. కనుకనే, మన పెద్దలు **'వసుధైవ కుటుంబకమ్'** అనే సూత్రాన్ని ప్రతిపాదించారు. రాజ్యం అనే భౌగోళిక పరిధిని దాటిన 'మాతృభూమి' అనే సిద్ధాంతం మన విశ్వవిస్తృతిని పరిచయం చేస్తోంది. వినోబాజీ జైహింద్‌ను అధిగమించి జై జగత్ అనే నినాదం ఇచ్చారు. 1978లో విశ్వరాజ్యంకోసం ప్రయత్నించాలని హెచ్.వి.కామత్ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని భారత పార్లమెంటు ఆమోదించింది. 'భారత్-పాక్ ఫెడరేషన్', 'దక్షిణాశియా సౌభ్రాతృత్వం', వినోబాజీ ప్రతిపాదించిన 'ఎ.బి.సి' (ఆఫ్‌గనిస్తాన్, బర్మా, శ్రీలంక) విశ్వరాజ్యంవైపు నడిపించే సిద్ధాంతాలు. భారత్ 50 సంవత్సరాలుగా అలీనోద్యమంలో సక్రియంగా పాల్గొంటోంది. నూతన ప్రపంచ వ్యవస్థ నిర్మాణానికి ఒక సమర్థవంతమైన చర్యగా దీన్ని పరిగణించవచ్చు. చైనా వెన్నుపోటు పొడిచినప్పటికీ - పంచశీల, సహజీవనం అనే సిద్ధాంతాలు రాజకీయ రంగంలో సమన్వయ దృక్పథానికి సంకేతాలు.

సాహిత్య, కళారంగాలలో వైవిధ్యం సహజమే. ఈ రంగాలలోని వ్యక్తులకు తమతమ ప్రత్యేక ప్రతిభలు ఉంటాయి. మన దేశపు భాషా సాహిత్యాలు ఒక ప్రత్యేక మతంతో ముడిపడి లేవు. ఉత్తర భారతంలో హిందీ భాష సూత్రధారులలో అమీర్ ఖుస్రో మరువలేని వ్యక్తి. ఎందరెందరో ముస్లిం కవులు హిందీ భాషను సుసంపన్నం చేశారు. రామ భక్తిలో, కృష్ణ భక్తిలో ఎవరికీ తీసిపోని ముస్లిం కవులు ఎందరో ఉన్నారు. కృష్ణ మందిరంలో మక్కాలోని నూర్‌ను చూచిన, వ్రజ భూమి ధూళిలో పొర్లాడి తన్మయులైన ముస్లిం భక్త కవులు ఉన్నారు. రసఖాన్ ఆయన బృందం కృష్ణభక్తిలో మునిగిపోయారు. యారీ, దరియా సాహెబ్‌లు రామభక్తిలో ఓలలాడారు. రహీన్‌ఖాన్‌ఖానా సంత్ కబీర్ రచించిన రామచరితమానస్‌ను ఖురాన్‌గా పరిగణించాడు. పలువురు హిందూ రచయితలు ఉర్దూ, ఫారసీలలో రచనలు చేశారు. ఫిరాక్ గోరఖ్‌పురీ, ప్రేమ్‌చంద్, కృష్ణచందర్ మున్నగు రచయితలు ఉర్దూలో రచనలు చేశారు.

మోక్ష సాధనలోకూడ మన దేశంలో అనేక మార్గాలు ఉన్నాయి. జ్ఞానమార్గం, భక్తిమార్గం, కర్మయోగం, ధ్యానయోగం అన్నీ ఇందుకు ఉపయోగపడతాయి. అయితే వీటిమధ్య విరోధం లేదు. వీటిమధ్య సమన్వయం కూడా జరుగుతూ వచ్చింది. శ్రీ అరవిందుల పూర్ణయోగం ఈ సమన్వయాన్ని ప్రకటిస్తోంది. భగవద్గీతలో ఇలా చెప్పబడింది -

**యథా నదీనాం బహవోఽ మ్బువేగాః**
**సముద్రమేవాభిముఖా ద్రవన్తి ।**

మన దేశంలో హిందువులు, బౌద్ధులు,జైనులు సూఫీ సంత్‌ల దర్గాలను, మజార్‌లను భక్తితో పూజిస్తారు. ఇస్లాంలోని సూఫీ సంప్రదాయంలో అపారమైన ఉదారత ఉంది.

ఈ సమన్వయ సాధన మన బలహీనత కాదా? ఇందువల్ల మనకు నష్టం జరగలేదా? సమన్వయ సాధనకు వ్యతిరేకమైన దృక్పథం కలిగిన సంస్కృతులు నామరూపాలు లేకుండా పోయాయని చరిత్ర చెపుతోంది. విశ్వవిజేత కావాలని ఆరాటపడిన జూలియస్ సీజర్, అలెగ్జాండర్‌లు చరిత్ర చెత్తబుట్టలోకి పోయారు. నిప్పుతో, కత్తితో మతాన్ని వ్యాప్తి చేయాలని ప్రయత్నించినవారి వేగం తగ్గిపోయింది. వారి ప్రతిష్ఠ దిగజారిపోయింది. ప్రపంచమంతటా విస్తరించాలని కోరుకునే క్రైస్తవ మతం గురువు రోమ్‌లో 'మత సమన్వయ' కార్యాలయాన్ని స్థాపించవలసి వచ్చింది. నేడు మనం మత రంగంలో సహజీవన సంస్కృతిని స్థాపించలేకపోతే మతం మనుగడే ప్రమాదంలో పడుతుంది.

ఈ సమన్వయ సంస్కృతిని పోషించిన కారణంగా భారత్‌ను జగద్గురువుగా పరిగణించవచ్చు. వైవిధ్యాన్ని నాశనం చేయడం వల్ల జాతీయ సమైక్యత బలపడదు. వైవిధ్యంలో ఏకత్వాన్ని సాధించడం మన కర్తవ్యం. వాస్తవానికి - వైవిధ్యంలో ఏకత్వమే మన నియతి. ఇందువల్ల వైవిధ్యంలోని వైభవమూ లభిస్తుంది, ఏకతా సూత్రమూ లభిస్తుంది. పూల దండలో రంగు రంగుల పువ్వులను గుచ్చుతారు. అలాగే, వివిధ మతాలు ఏకత్వమనే అదృశ్య సూత్రంతో బంధించబడి ఉంటాయి. హెగెల్ తన తాత్విక సిద్ధాంతంలో ఈవిధంగా వైవిధ్యాన్ని సమన్వయంచేసి చూపాడు. ఆ సిద్ధాంతంలో వైరుధ్యాల సమాగమం ఉంది. అయితే, భారతీయ మనీషులు వైవిధ్యాలను విరుద్ధతత్వాలుగా కాక పరస్పర పూరకాలుగా, పరస్పర పోషకాలుగా పరిగణించారు. ఈ సమన్వయ సాధనలో ఆరంభానికీ, అంతానికీ వైరుధ్యం లేదు. భిన్నత్వం వైరుధ్యం కాదు. మన శరీరంలో చేతులు, కాళ్లు, ముక్కు, చెవుల వంటివి వేర్వేరు అవయవాలు. అయితే వాటిమధ్య సమన్వయం ఉంది. భారత్‌లో హిందువులు, ముస్లింలు, సిక్కులు, క్రైస్తవులు, పార్శీలు మున్నగువారి గుణాలు వేర్వేరు. అయినా వారి సమన్వయంవల్ల మన సమృద్ధి పెరుగుతుంది. కనుకనే - భారత్‌లో ముస్లిం శరీరానికీ, వేదాంత మస్తిష్కానికీ సమన్వయం అవసరమని స్వామి వివేకానంద ప్రబోధించారు. నేడు యుగం విసురుతున్న పెను సవాళ్లను ఎదుర్కొనడానికై 'సామాజిక సామరస్య సాధన' అనే మన జాతీయ జీవనలక్ష్యాన్ని మనం మన హృదయాలలో సజీవంగా నిలుపుకోవడం అత్యవసరం.

★★★

**సౌశీల్యం, శిష్టాచారం దైవీ గుణాలు.**

## బోధకథ

# బ్రహ్మచర్యంలో బ్రహ్మవిద్యా రహస్యం

అష్టావక్రునికి బ్రహ్మవిద్యను తెలుసుకోవలెనని ఎంతో కోరిక కలిగింది. '**అయమాత్మా బ్రహ్మ**' అన్న మహావాక్యంలోని రహస్యమును గ్రహించాలన్న తీవ్రమైన కోరికతో అతని అంతఃకరణ ఎంతో వ్యాకుల పడుతోంది. తన వ్యాకులతను సంబాళించుకుంటూ ఆయన జగమెరిగిన బ్రహ్మవేత్త వదాన్య మహర్షి ఆశ్రమానికి వెళ్లాడు. తనముందు బ్రహ్మవిద్యయందు నిజమైన జిజ్ఞాస గలవానిని చూడగానే మహర్షి కళ్లలో ఒక అపూర్వమైన కాంతి వెల్లుబికింది. తన హృదయంలో మెదిలిన సున్నిత భావములు తన ముఖంలో ప్రతిబింబించడానికి ముందే వాటిని తన అంతఃకరణలోనే అణుచుకుంటూ ఆయన "నాయనా! నీ మనసులో కలిగిన కోరికను నేను తెలుసుకున్నాను. కానీ నీ కోరికను తీర్చవలెనంటే, నిన్ను గట్టి బ్రహ్మవేత్తను చేయాలంటే మొట్టమొదట నీవు నా ఆజ్ఞను పాటించవలసి ఉంటుంది'' - అని సెలవిచ్చారు.

అష్టావక్రుడు నిజమైన శిష్యునికి ఉండే వినయాన్ని చూపిస్తూ, "అదేమిటి మహర్షీ?'' అని ప్రశ్నించాడు.

వదాన్య మహర్షి, "నీవు ఉత్తరపు దిక్కుకు వెళ్లవలసి ఉంటుంది. అలకాపురి హిమాలయ పర్వతాలకు పైన నీకు కైలాస పర్వతం కనబడుతుంది. అక్కడ మహదేవుడు అనేక మంది సిద్ధులు, చారణులు, భూత, పిశాచగణాలతో విహరిస్తూ ఉంటారు. దానికి తూర్పు, ఉత్తర దిక్కులలో మాసాలు, ఋతువులు, కాలములు, రాత్రింబగళ్లు, దేవతలు, మనుష్యులు భూతభావనుడైన మహేశ్వరుని ఉపాసిస్తూ ఉంటారు. ఆచోటు దాటిన తరువాత నీకు మేఘసమానమైన ఒక నీలవనం కనబడుతుంది. అక్కడ ఒక ముసలి తపస్విని ఉంటుంది. నీవు ఆమె దర్శనం చేసుకుని తిరిగిరావాలి. నీవు వచ్చిన మరుక్షణంలో 'అయమాత్మా బ్రహ్మ'కు సంబంధించిన తత్వాన్ని బోధిస్తాను - అని తెలియజేశారు.

అష్టావక్రుడు నిజమైన జిజ్ఞాస కలవాడు. జిజ్ఞాస అన్న ప్రచండమైన నిప్పు అతని అంతఃకరణను దహింపజేస్తోంది. వదాన్య మహర్షి మాటలు మలయపర్వతం నుంచి వచ్చిన మందమలయానిలం వలె వీచి చల్లని వర్షపుజల్లు కురిపించినట్లయింది. అపరిమితమైన ఆనందంతోను, శ్రద్ధతోను శిరసు వంచి వారి ఆదేశాన్ని అమలు పరచడానికి బయలుదేరాడు అష్టావక్రుడు. మొదట హిమాలయ పర్వతం మీదికి చేరుకున్నాడు. అక్కడ ధర్మదాయినియైన బాహుదానది పవిత్ర జలాలలో స్నానంచేసి, దేవతలకు తర్పణం విడిచి, దాని పవిత్ర తీరంలో కుశాసనం వేసుకుని దానిమీద విశ్రాంతి తీసుకోవడం ప్రారంభించాడు. ఆ రాత్రంతా అక్కడే సుఖంగా నిద్రపోయాడు. మరునాటి ఉదయం అక్కడే అగ్నిని ప్రజ్వలింపచేసి యజ్ఞం చేశాడు. దాని దగ్గరలోనే ఒక సరోవరం ఉంది. అక్కడ శివ పార్వతుల విగ్రహాలున్నాయి. అష్టావక్రుడు వాటిని దర్శించి మరల ప్రయాణం ప్రారంభించాడు.

అతను కైలాస పర్వతాన్ని, మందర పర్వతాన్ని, సుమేరు పర్వతాన్ని, అనేక ఇతర పర్వతాలను దాటి కిరాత రూపంలో ఉన్న మహాదేవుని స్థానానికి ప్రదక్షిణం చేసి ఉత్తర దిక్కుకు బయలుదేరాడు. కొద్ది దూరం వెళ్ళేసరికి ఆయనకు ఒక అందమైన వనం కన్పించింది. ఆ వనంలో ఒక దివ్య ఆశ్రమం కలదు. ఆ ఆశ్రమానికి దగ్గరలో అనేక రత్నాలతో అలంకరింపబడిన పర్వతం, అందమైన ఒక చెరువు, అనేక సుందర పదార్థాలు గోచరించాయి. అవి కుబేరుని నగరం కన్నా మిక్కిలి శోభాయమానంగా ప్రకాశిస్తున్నాయి. అక్కడే అనేక విధాలైన బంగారు కొండలు, మణులతో కూడిన కొండలు కనబడ్డాయి. వాటిపైన ఒక సువర్ణ విమానం ఉంది. మందర పర్వతం మీద పూసిన పూలతో అలంకరింపబడిన మందాకినీ నది కలకల నినాదంచేస్తూ ప్రవహిస్తోంది. నాలుగు దిక్కులలో మణుల తళతళలతో ఆ దివ్యవనం వెలిగిపోతోంది.

అష్టావక్రుడు ఆ వనాన్ని చూచి ఆశ్చర్యచకితుడై అక్కడే నిలబడిపోయాడు. కొంతసేపు అక్కడే ఉండి ఆనంద మనుభవించాలనిపించిందతనికి. ఇంతకన్న సుఖకరము, అందమైన స్థాన మింకెక్కడ దొరుకుతుంది? అక్కడ తనకు పనికివచ్చే చోటుకోసం వెతకడం ప్రారంభించాడు. ఇంకాస్త ముందుకు వెళ్లేసరికి అక్కడ ఒక పెద్ద నగరమే కనబడింది. ఆ నగర ద్వారం వద్దకు వెళ్లి నిలబడి, "నేను అతిథిని, నగరంలో నివసించేవారు నాకు స్వాగతం పలకాలి.'' అని గట్టిగా అరిచాడు.

అప్పుడు ద్వారంలోపలనుంచి ఏడుగురు పరమ సౌందర్యవతులైన కన్యలు ఆయనకు స్వాగతం పలకడానికి వచ్చారు. వాళ్లెంత సౌందర్యవతులంటే వాళ్లను చూడగానే అష్టావక్రుడు కళ్లార్పకుండా నిలబడిపోయాడు. ఈ విధంగా కొంతసేపు అతని అంతరంగంలో కోలాహలం నిండిపోయింది. అప్పుడు తాను బ్రహ్మవిద్యను సంపాదించుకోవలెనన్న విషయం గుర్తుకు వచ్చి సంయమం తెచ్చుకొని అతడు మనసును స్థిరం చేసుకున్నాడు.

ఆ సుందరీమణులు, "రండి స్వామీ! దయచేయండి, మీకు స్వాగతం పలుకుతున్నాము దయచేయం''డంటూ అతడిని స్వాగతించారు.

అతడు ఒక అందమైన భవనంలోనికి ప్రవేశించాడు. అక్కడ

**కటుత్వాన్నీ, శత్రుత్వాన్నీ హరించివేసే అమృతం శిష్టాచారం.**

ఒక వృద్ధురాలు కూర్చునిఉంది. ఆమె చక్కని బట్టలు కట్టుకుని ఉంది. ఆమె ఒంటిమీద అనేక ఆభరణా లున్నాయి. అష్టావక్రుని చూడగానే ఆమె లేచి నిలబడి ఆయనకు స్వాగతం చెప్పి కూర్చుంది. ఆయన కూడా అక్కడే కూర్చున్నాడు. ఆమె ఆసుందరీమణుల వద్దకు వెళ్లి, "మీలో బుద్ధిమంతురాలు, ధైర్యవంతురాలు ఎవరేనా ఉంటే వాళ్లిక్కడుండి మిగిలినవాళ్లు వెళ్లిపొండి." అని ఆజ్ఞాపించింది.

ఒక్క కన్యమినహా అందరూ అక్కడనుంచి వెళ్లిపోయారు. ఆవృద్ధురాలు అక్కడే కూర్చుంది. రాత్రికాగానే అష్టావక్రుడికి అక్కడే పక్క ఏర్పాటు చేయబడింది.

రాత్రి ఒక గంట గడిచిందో లేదో ఆ వృద్ధురాలు చలిగా ఉన్నదన్న వంకతో వణుకుతూ అష్టావక్రుని పక్కమీదకు వచ్చి పడుకుంది. అష్టావక్రుడు ఆమెను ఎంతో ఆదరంతో తన ప్రక్కన పడుకోనిచ్చాడు. కొంతసేపయేసరికి ఆ ముసలిది చేసే వికారపు పనులకు ఆశ్చర్యపడ్డాడు. ఐనా అతను ఏవిధమైన చలనం లేకుండా కేవలం ఒక మొద్దువలె పడిఉన్నాడు.

ఆ వృద్ధురాలు అష్టావక్రునితో, "ఓ రుషీ! నేను జీవితాంతము నీకు కృతజ్ఞురాలుగా ఉంటాను. ఇదే నీ తపస్సుకు ఫలం. నాయీ సంపద అంతా నీకే. నా దగ్గరే ఉండండి. ఇక్కడ మనం లౌకిక, అలౌకిక సుఖాలనన్నిటినీ అనుభవిస్తూ ఉందాము." - అని తెలిపింది.

వృద్ధురాలి మాటలు విని అష్టావక్రుడు, "ఓ దేవీ! నేనొక తపస్విని. చిన్నప్పటినుంచి నేటివరకు సంపూర్ణ బ్రహ్మచారిగా ఉన్నాను. ఇంద్రియ భోగములయందు ఆసక్తి ఆత్మతేజస్సును పాడు చేస్తుంది. వివేకులు ఇంద్రియములను అదుపులో పెట్టుకుని ఆత్మజ్ఞానాన్ని, బ్రహ్మవిద్యను సాధించడానికి ప్రయత్నిస్తారు. నేను కూడా ఆత్మవిద్యను సాధించాలన్న జిజ్ఞాసతో ఉన్న వాడిని. నా గురుదేవులు వదాన్య మహర్షి ఆదేశంతో మిమ్మల్ని దర్శించడానికి వచ్చాను. మీరు నన్ను నా లక్ష్యం వైపు కొనసాగునట్లు ఆశీర్వదించండి" - అని ప్రార్థించాడు.

అతని మాటలు విని ఆ వృద్ధురాలు "మహర్షీ! మీరే బ్రహ్మవిద్యను గురించి మాట్లాడుతున్నారో అది వట్టి భ్రమ. లోకం కళ్లకు ప్రత్యక్షంగా కనబడుతోంది. దానికి సంబంధించిన భోగం కూడా స్పష్టము. వాటి రుచి ప్రపంచంలోని ప్రతి ప్రాణి మనసునూ ఆకర్షిస్తుంది. ఇంద్రియాలకు సంబంధించిన అనేకరకాల భోగాలను అనుభవించడం కోసం సృష్టిలోని జీవులన్నీ నిరంతరం శ్రమ చేస్తూ ఉంటాయి. శాస్త్రాలు కూడా తపస్సు లక్ష్యం స్వర్గమని చెప్పాయి. స్వర్గమంటే ఇంద్రియ భోగాలను నిరంతరం అనుభవించే చోటే గదా! మీరు నాతోనే ఉండి జీవించండి. ఇక్కడనే స్వర్గసుఖాల ననుభవించండి" - అని చెప్పింది.

మహర్షికి ఆ వృద్ధురాలి మాటలు అద్భుతము లనిపించాయి. తన గురుదేవులు వదన్య మహర్షి తనను ఆమెవద్దకు ఎందుకు పంపించారా? అని ఆలోచించడ మారంభించాడు. ఆసమయంలో అతని మనసులో ఆ భవనానికి యజమానురాలయిన ఆమె కొంతకాలమునకు ముందు ఒక యువతియై ఉంటుందని, ఏదో శాపవశంగా ఆమె వృద్ధురాలయి ఉంటుందన్న అనుమానం కలిగింది. ఆ సంశయం కలిగిన వెంటనే ఆమెను అడిగి తన అనుమాన నివృత్తి చేసుకోవా లనిపించిందిగాని అందుకు సాహసించలేకపోయాడు.

ఒక రోజు గడిచిపోయింది. సంధ్యాకాలం రాగానే ఆమె వచ్చి, "ఓ మహర్షీ! చూడండి సూర్యు డస్తమిస్తున్నాడు. ఇప్పుడు మీ ఆజ్ఞ ఏమిటి?" అని ప్రశ్నించింది.

ఆ వృద్ధురాలు వెళ్లి నీళ్లు తెచ్చింది. నీళ్లతోబాటు మంచివాసన నూనె, బట్టలు తీసుకువచ్చింది. మహర్షి ఆజ్ఞ తీసుకుని ఆమె ఆనూనెతో ఆయన వంటికి మర్దన చేయడ మారంభించింది. తన చేతులతో అతని శరీరం రుద్ది స్నానం చేయించింది. మహర్షి ఎంతో ఆనందంతో స్నానం చేస్తున్నాడు. స్నానం చేస్తూ చేస్తూ ఉండగానే తెల్లవారిపోయింది. ప్రాతఃకాలంలో సూర్యకిరణాలు నీళ్ల గదిలోకి ప్రసరించి లోపల వెలుగులు నింపేసరికి మహర్షి ఆశ్చర్యపడుతూ అదేదో మాయ అని భావించి ఆ వృద్ధురాలితో, "ఏమమ్మా! అప్పుడే తెల్లవారిందా? లేక ఇదికూడా ఒక మాయా?" - అని ప్రశ్నించాడు.

అందుకా వృద్ధురాలు, "అయ్యా! నిజంగా తెల్లవారింది. చూడండి సూర్యుడు తూర్పున కనబడుతున్నాడు." అని చూపించింది.

మహర్షి స్నానం పూర్తయింది. అప్పు డామె "ఇప్పుడు నేనేమి చేయాలో చెప్పండి మహర్షీ" అని అడిగింది.

అష్టావక్రుడు ఏమీ జవాబు చెప్పలేకపోయాడు. గడిచిన రోజున జరిగిన విచిత్ర లీలలను గురించిన ఆలోచనలలో మునిగిపోయాడు. తన ప్రశ్నకు ఆయన జవాబుకు ఎదురు చూడకుండా వృద్ధురాలు లేచి లోపలనుంచి ఒక పళ్లెంలో రుచికరమైన భోజనం తీసుకువచ్చింది. మహర్షి భోజనం చేస్తున్నాడు. ఆవిధంగా తింటూ రోజంతా గడిపివేశాడు. మళ్లీ రాత్రి వచ్చింది. వృద్ధురాలు వేరు వేరు పక్కల నేర్పాటు చేయించింది. మహర్షి తన మంచం మీద పడుకున్నాడు. కొద్ది సేపటికి నిద్రపట్టింది. అర్ధరాత్రి వేళ మరల వృద్ధురాలు చలి వంకతో ఆయన మంచం మీదికి చేరింది.

మహర్షి వెంటనే మేలుకొని, ఆమెతో "ఏమమ్మా! నీవు వ్యర్థ ప్రయత్నం చేయకు. శాస్త్రకారులు పరస్త్రీని తాకడం మహాపాప మన్నారు. ఈపని నాకు ధర్మ విరుద్ధ మనిపిస్తోంది. కావున దీనిని త్యాజ్యంగా భావిస్తున్నాను. నేనెప్పుడూ ఈ పని చేయను." అన్నాడు.

అప్పుడా వృద్ధురాలికి పెద్ద దెబ్బ తగిలింది. ఐనా ఆమె ధైర్యం విడనాడలేదు. ఆమె ఎంతో ఆశతో అష్టావక్రునితో, "మహర్షీ! నన్ను

**త్యాగ, సమర్పణ, వివేక, సత్యములపట్ల అక్షయ శ్రద్ధయే వైరాగ్యం.**

మీరు పరస్త్రీ అని భావిస్తే వెంటనే మీదానిని చేసుకోండి. నేనందు కెంతో సంతోషంతో సిద్ధంగా ఉన్నాను. నేనిప్పటివరకూ కన్యగానే ఉన్నాను. నమ్మండి.'' అని బ్రతిమాలింది.

ఇప్పుడు అష్టావక్రుడు పెద్ద సమస్యలో పడ్డాడు. అతనికి వెంటనే జవాబేమీ తట్టలేదు. చింతాభారంతో తలవంచుకు కూర్చున్నాడు. కొద్ది క్షణాల తరువాత తలపైకెత్తి చూచేసరికి అత్యంత ఆశ్చర్యాన్ని కలిగించే దృశ్య మాతని కండ్ల బడింది. ఆ వృద్ధురాలు పదహారేళ్ల బాలామణిగా మారిపోయింది. అతని కెదురుగా కూర్చుని చిరునవ్వులు చిందిస్తోంది.

అష్టావక్రుడు ఆశ్చర్యంతో, "దేవీ! ఈ రూపమేమిటి? నాకు అర్థం కావడం లేదు. నీవెవరవో తెలియకుండా పోయింది. నీ వెవరివైనా సరే! నేను మాత్రం మారను. నాకు బ్రహ్మవిద్య కావాలి. సాంసారిక భోగాలు నాకు వద్దు. దేవీ! నేను మనిషిని. మనసును జయించినవాడు మనిషనబడుతాడు. ఐతే నీవెవరవో తెలుసుకోవలెనన్న తహతహలో ఉన్నాను. చెప్పు, నీవెవరో చెప్పు.'' - అని ప్రార్థించాడు.

ఆ కన్య ముసిముసి నవ్వులు కురిపిస్తూ, "ఓ అష్టావక్ర మహర్షీ! స్వర్గ, మర్త్యాది సమస్త లోకాలకు చెందిన స్త్రీ, పురుషులలో విషయ వాసన లుంటాయి. నేను మీ మనస్సును చలింపజేసి పరీక్షిస్తూ వచ్చాను. ఐతే మీరు కఠినమైన సంయమనంతో మీ ధర్మాన్ని, మర్యాదను విడనాడలేదు. కావున మీరెప్పుడూ ఎట్టి కష్టాలకు గురికారని నేను నమ్ముతున్నాను.'' - అంది.

"నేను ఉత్తర దిక్కును. నేనీ వృద్ధరూపాన్ని ధరించినది మీకు యీజగత్తులో వృద్ధాప్యం వచ్చిన స్త్రీ పురుషులను కూడా కామం బాధిస్తుందని తెలియబరచడానికే. కావుననే వివేకవంతుడైనవాడు సంయమనం సాధించడానికి వార్ధక్యం రావాలని ఎదురుచూడడు. చిన్నతనంనుంచే బ్రహ్మచర్యపాలనకు పూనుకుంటాడు. బ్రహ్మవిద్యా రహస్యం బ్రహ్మచర్యంలోనే దాగి ఉంది. నీవు బ్రహ్మచర్యవ్రతాన్ని వదలనందుకు నేనెంతో సంతోషిస్తున్నాను. బ్రహ్మ, ఇంద్రాది దేవతలు నీయందు మిక్కిలి ప్రసన్నులయారు. వదాన్య మహాత్ముడు ఏపనికి మిమ్మిక్కడికి పంపించారో ఆపని పూర్తి అవుతుంది'' - అని తెలిపింది.

అష్టావక్రుడు ఆమె మాటలు విని ఎంతో సంతోషించాడు. అక్కడనుంచి వెళ్లడానికి ఆమె అనుమతిని అర్థించాడు. ఉత్తరదిక్కు మిక్కిలి ఆదరంతో ఆతనికి వీడ్కో లిచ్చింది.

అష్టావక్రుడు వదాన్య మహర్షి వద్దకు తిరిగిరాగానే, ఆయన ఎంతో ప్రసన్నులై అతడిని ఆశీర్వదించారు. ఆయన తన దివ్య దృష్టితో తన శిష్యునికి జరిగిన సంఘటనలన్నిటినీ గమనిస్తూనే ఉన్నారు. గురు కృపవలన శిష్యుడు బ్రహ్మవిద్యా రహస్యాన్ని గ్రహించాడు. శ్రేష్ఠతమ బ్రహ్మవేత్తగా కీర్తి సంపాదించాడు.

✧✧✧

## సంఘర్షణలో కీర్తి

లోట్లు, కష్టాలు కలిగితే అనవసరంగా నిందిస్తారు గాని, అవే అనేక పర్యాయాలు మానవునిలో అణగారిన పౌరుషాన్ని మేలుకొల్పడానికి సహాయపడతాయి. దుర్బలమనస్కులు మాత్రమే వీటికి లొంగి ధైర్యాన్ని కోల్పోతూ ఉంటారు.

నెపోలియన్ చాలా పొట్టివాడు. పేద కుటుంబంలో పుట్టినవాడు. ఈ రెండు కారణాలవల్ల అతని ప్రారంభ జీవితం అవమానాలు, తిరస్కారాలతో గడిచింది. ఈ పరిస్థితులపై ఆయన ఉద్భవించిన తిరుగుబాటు ఆయనచేత ఎన్ని యుద్ధాలు గెల్పించిందో అందరకూ తెలిసినదే. ఒక రాజకుమార్తెను వివాహమాడిన తరువాత పొట్టివాడిననే ఆత్మన్యూనతాభావం పోయి ఈయన మనస్సుకు శాంతి లభించింది.

బ్రిటిష్ ప్రధానమంత్రి చర్చిల్ నత్తిగా మాట్లాడేవాడు. వాక్కుమీద అధికారాన్ని, ఉచ్చారణలో పొందికను సంపాదించటానికి ఆయన విపరీతంగా కృషిచేసి మహావక్తగా తయారైనాడు. అమెరికా రాష్ట్రపతి థియోడర్ రూజ్ వెల్ట్‌కు ఒక కన్ను పాడైంది. దానివలన పొందిన అవమానాన్ని విజయంగా మార్చుకోవటానికి ఆయన తుపాకీని పేల్చే విద్యలో నైపుణ్యాన్ని సంపాదించేడు. ఆయన పెట్టిన గురి తప్పటానికి వీలులేదని పెద్ద పేరు ప్రఖ్యాతులు సంపాదించేడు. లార్డ్ బైరన్ కుంటివాడు. తన మిత్రులు పర్వతారోహణం చేయటం చూచి ఆయన వ్యథ చెందాడు. కాలులేకపోయినా మనస్సు ఓటమిని అంగీకరించలేదు. ఏదో విధంగా కీర్తివంతుడుగా జీవించాలని సంకల్పించుకొన్నాడు. వేదాంత శాస్త్రాన్ని కార్యక్షేత్రంగా ఎంచుకొని విశ్వ విఖ్యాతి చెందిన వేదాంతిగా ఉత్కృష్ట పదవిని అధిరోహించాడు.

కీర్తి ప్రాప్తికి అన్నీ సౌకర్యంగా అందుబాటులో ఉన్నాయా లేదా అనేది అవసరం లేదు. పరిపూర్ణమైన సంఘర్షణ వలననే వాస్తవికమైన యశస్సు లభిస్తుంది. నిజం చెప్పాలంటే సాహసం చివరికి సంఘర్షణే. ఆ స్థితిలో హాని జరుగుతుందన్నా ఏ మాత్రము జంకక సన్నద్ధుడై ఉండటం వ్యక్తికి చాలా అవసరం.

- ప్రజ్ఞాపురాణం నుండి

**దేవుడు తాను ప్రేమించేవారిని అగ్నిపరీక్షలకు గురిచేస్తాడు.**

## కుటుంబ నిర్మాణం

# ఉమ్మడి కుటుంబానికి కొత్త నమూనా

శరవేగంతో మార్పులు జరుగుతున్న కాలంలో మనం జీవిస్తున్నాం. పాత ఆచారాలూ, కట్టుబాట్లూ, ఆలోచనల గోడలు కూలిపోతున్నాయి. కొత్త ప్రమాణాలూ, కొత్త ఆలోచనలూ, కొత్త పద్ధతులూ వాటి స్థానంలోకి రావడానికి ఆతురత చెందుతున్నాయి. రెండింటి సంగమంతో సమాజానికీ, సంస్కృతికీ కొత్తరూపు వస్తోంది. పాత కొత్తల మేలికలయిక ద్వారానే ఆ రూపం నిర్ణయం అవుతుంది. కుటుంబ వ్యవస్థ విషయంలో కూడ ఇది అక్షరాలా వర్తిస్తుంది. ఉమ్మడి కుటుంబం విచ్ఛిన్నమై వేరు కుటుంబాల ఏర్పాటు ప్రారంభమయింది. అయితే ఈ వేరు కుటుంబం పద్ధతిలో ఎన్నో మౌలికమైన లోపాలు కానవచ్చాయి. కనుక ఉమ్మడి కుటుంబం గురించి ఆలోచించడం తప్పనిసరి అవుతోంది. కానీ, పాత తరహా ఉమ్మడి కుటుంబాన్ని యథాతథంగా స్వీకరించలేము. దానిలో కూడ మౌలిక లోపాలు ఉన్నాయి. కనుక అది నేడు ఆమోదయోగ్యం కాదు. కనుక-21వ శతాబ్దపు సవాళ్లకూ, మారిన పరిస్థితులకూ అనుగుణంగా కుటుంబ స్వరూపం ఎలా ఉండాలో ఆలోచించవలసి ఉంది.

నేడు మన సమాజంలోని హెచ్చుమంది ఉమ్మడి కుటుంబం ఒడిలో కళ్లు తెరచి, ఆ తర్వాత వేరు కుటుంబం పెట్టుకున్న తరానికి చెందినవారు. సమాజంలో వ్యక్తి ఆలోచనలకు స్వతంత్ర ప్రతిపత్తి లభించే ధోరణి ప్రారంభం కావడంతో, ఆ తరంవారు ఉమ్మడి కుటుంబాలనుండి వేరుపడి స్వంత కుటుంబాలు ఏర్పాటు చేసుకున్నారు. అది ఆ తరంవారికి ఎంతో సంతోషం కలిగించిన సమయం. ఎందుకంటే, వారు తమకోసం తమకు నచ్చిన ఇల్లు ఏర్పరచుకుంటున్నారు. ఉమ్మడి కుటుంబం ఏర్పరచుకున్న ఆచారాల బంధనాలను ఈ వేరు కుటుంబం త్రెంచుకున్నది. కుటుంబాలలో వయసు వచ్చిన పిల్లలు తమ తల్లి తండ్రులతో విభేదించసాగారు. పిల్లలు తమకోసం వేరే ఇల్లు ఏర్పాటు చేసుకున్నారు. ఆ విధంగా సమాజంలో వేరు కుటుంబాలు వేగంగా పెరగసాగాయి. ఇలా కుటుంబం విచ్ఛిన్నమై, విలువలు దెబ్బతినడంతో పాత తరంవారు విచారించారు. అయితే వేరు కుటుంబాలు ఏర్పడడం మామూలు విషయం అయిపోవడంతో, పాత తరంవారు ఆ ధోరణిని క్రమంగా అంగీకరించసాగారు. వాస్తవాలను గుర్తించి మెలగడం ప్రారంభించారు.

వేరు కుటుంబాలు ఏర్పడడానికీ, పెరగడానికీ ఒక ప్రముఖ కారణం పారిశ్రామికీకరణ. పారిశ్రామిక విప్లవం ఫలితంగా పట్టణాలలో ఉపాధి అవకాశాలు పెరగసాగాయి. స్త్రీ పురుషులు తమ ఇళ్లూ వాకిళ్లూ వదిలి పట్టణ ప్రాంతాలకు వెళ్లి పనులలో ప్రవేశించసాగారు. వారి తల్లి దండ్రులు మాత్రం తాము పుట్టి పెరిగిన స్థలాలలోనే ఉండిపోయారు.

స్వేచ్ఛా స్వాంతంత్ర్యాల కోసం ఉమ్మడి కుటుంబాలనుండి వేరయిన తరం నేడు తనను తాను ఒక ప్రశ్న వేసుకోవలసి వస్తోంది-స్వేచ్ఛను పొందడానికి ప్రతిఫలంగా తాము ఏమీ కోల్పోలేదా అని. వేరు కుటుంబంలో ఉన్న ప్రత్యేకత ఏమంటే- తన స్వంత వ్యక్తిత్వాన్ని వికసింపజేసుకోవడానికీ, తన శక్తి సామర్థ్యాలను ఋజువు చేయడానికీ వ్యక్తికి దానివల్ల అవకాశం లభిస్తోంది. అయితే, దానితో పాటు వేరు కుటుంబంలో ఉన్న ఎన్నెన్నో లోపాలు కూడ వెలికివచ్చాయి. తన బాధలనూ, వ్యథలనూ, సమస్యలనూ పంచుకోవడానికి వేరు కుటుంబంలో తన భర్త / భార్య తప్ప మరెవరూ ఉండరు. ఒక పరిధి దాటిన తర్వాత వాటిని వ్యక్తి ఒంటరిగానే భరించవలసివస్తుంది. ఫలితంగా మున్నెన్నడూ లేని సమస్యలు అనేకం సమాజంలో పుట్టుకువస్తున్నాయి. టెన్షన్, దానివల్ల వచ్చే రోగాలు, డిప్రెషన్, ఆత్మహత్య ఇందుకు ఉదాహరణలు.

'కంటికి దూరమైతే మనసుకు దూరం' అనే మాట ఈ విషయంలో వర్తిస్తుంది. కుటుంబ సభ్యులకు దూరం కావడంవల్ల వ్యక్తి ఆత్మీయుల మనసులకూ, హృదయాలకూ దూరం అవుతాడు. అంతే కాదు. వేరు కుటుంబం వలన సంప్రదాయాలతో తనను కలిపిఉంచే ఉత్సవాలకూ, పండుగ పబ్బాలకూ దూరం కావడమూ కద్దు. ఒంటరితనం వేరు కుంటుంబాన్ని పట్టి పీడిస్తుంది. వేరు కుటుంబంలో అందరికన్న హెచ్చుగా నష్టపోయేవారు పిల్లలు. వేరు కుటుంబంలో పిల్లలకు తన సాంస్కృతిక విలువలను వారసత్వంగా అందించడం చాలా కష్టం అయిపోతుంది. పిల్లలు తాతలద్వారా, నాయనమ్మలద్వారా, కుటుంబంలోని ఇతర పెద్దల ద్వారా సాంస్కృతిక విలువలను సహజంగా గ్రహిస్తారు. వాటిని జీర్ణించుకుంటారు. వాటిని ప్రత్యేకంగా నేర్పవలసిన అవసరం ఉండదు.

వేరు కుటుంబంలో చిన్నపిల్లలను పెంచే బరువు బాధ్యతలను భార్యా భర్తలు మాత్రమే మోయవలసివస్తుంది. లేదా వారిని శిశు సంరక్షణ కేంద్రాలకు అప్పగించవలసి వస్తుంది. చిన్న చిన్న పట్టణాలలో ఇలాంటి కేంద్రాలు ఉండవు.

వేరు కుటుంబాలలో ఉన్న పైవిధమైన ఇబ్బందుల దృష్ట్యా, కొత్త తరహా ఉమ్మడి కుటుంబాలకు పునాదులు వేయడం అత్యవసరం అవుతోంది. ఉమ్మడి కుటుంబాల కొత్త వ్యవస్థకు మూలాధారం పాతదే కావాలి. అయితే, కుటుంబ సభ్యులమధ్య పరస్పర చర్చలు జరిగే

**ఇతరులపట్ల నమ్రంగా, మధురంగా, ఉదారంగా వ్యవహరించు.**

పద్ధతిని కొత్తగా ఏర్పరచడం అవసరం. ఉమ్మడి కుటుంబానికి మూలాధారం ఇది: కుటుంబ సభ్యులంతా ఒకే ఇంటిలో ఉంటారు. పరస్పర అవగాహనతో, పరస్పర సహకారంతో జీవిస్తారు. అయితే, కొత్త తరహా ఉమ్మడి కుటుంబంలో పలు కుటుంబాలవారు కూడ కలిసి ఉండవచ్చు. మిత్ర కుటుంబాలను ఒకే ఇంటిలో ఉంచి ఈ కొత్త తరహా ఉమ్మడి కుటుంబాలను ఏర్పాటుచేయవచ్చు. పరమపూజ్య గురుదేవులు దీనికి 'విశాల కుటుంబం' అని పేరు పెట్టారు.

అయితే, ఈ విశాల కుటుంబాన్ని ఏర్పరచే సమయంలో పాత ఉమ్మడి కుటుంబంలోని లోపాలను తొలగించవలసి ఉంటుంది. ఎందుకంటే, ఆ లోపాలు కారణంగానే కొత్త తరానికి దానిపట్ల తిరుగుబాటు ధోరణి ఏర్పడింది. ఈ తిరుగుబాటు ధోరణికి ముఖ్యకారణం పాత తరంవారి వైఖరి. తమ మాటే చెల్లుబడి కావాలనే పట్టుదల. ఇతరుల మాటలను ఖాతరు చెయ్యని మనస్తత్వం. ఉమ్మడి కుటుంబాలలో సాధారణంగా కుటుంబ పెద్ద లేదా తండ్రి మాటకు తిరుగు ఉండేది కాదు. ఆయన మాటకు ఎవరూ ఎదురు చెప్పేవారు కారు. అలాంటి స్థితిలో ఇంటిలో అశాంతి, కుటుంబ సభ్యులు మూగనోముపట్టడం సహజంగా జరుగుతాయి. కొత్త తరహా ఉమ్మడి కుటుంబంలో ఈ లోపం ఉండకూడదు. కుటుంబ సభ్యులమధ్య నిస్వార్థమైన ప్రేమ, గౌరవాలు దానికి మూలాధారాలు కావాలి. అపుడు ఆ కుటుంబాల వ్యవస్థ సఫలం అయితీరుతుంది. ప్రేమ, స్నేహం, గౌరవం హృదయంలో నిలచి ఉంటే, ఎవరూ ఎవరిమీదా పెత్తనం చెలాయించరు. పిల్లలకు ప్రేమనూ, గౌరవాన్ని పంచినపుడే వారినుండి వాటిని తిరిగి పొందగలుగుతారు. పెద్దలు పిల్లలపట్ల సదవగాహనను, ప్రేమను, గౌరవాన్ని చూపకపోతే, పిల్లవాడుకాని పిల్లకాని వారి ఆలోచనలను, సలహాలను గౌరవిస్తారని ఆశించడం వ్యర్థం.

కుటుంబ సభ్యులు తమలో తాము నిజాయితీగా మనసిచ్చి మాట్లాడుకోవడానికీ, నిస్సంకోచంగా తమ భావాలను ఇచ్చిపుచ్చుకోవడానికీ, కలబోసుకోవడానికీ పూర్తి అవకాశం ఉండాలి. కుటుంబంలో అందుకు అనుకూలమైన వాతావరణం ఉండాలి. పిల్లలు తమ అభిప్రాయాలను వ్యక్తం చేసేందుకు పెద్దలు వారిని ప్రోత్సహించాలి. ఇలాంటి వాతావరణం లేని పక్షంలో, తమ భావాలు అణగిపోయాయనే అభిప్రాయం పిల్లలలో ఏర్పడుతుంది. ఇందువల్ల పెద్దలపట్ల వారిలో ఏకీభావం లోపిస్తుంది. ముందుగానే ఒక అభిప్రాయం ఏర్పరచుకోకుండా పిల్లలు చెప్పేది వినడం, పెద్దలూ పిన్నలూ పరస్పర విశ్వాసాన్ని వ్యక్తపరచడం అన్నవి కుటుంబ సభ్యులను తప్పకుండా దగ్గరకు చేర్చుతాయి. ఇలాంటి వాతావరణం లోపించడం పాత ఉమ్మడి కుటుంబంలోని ఒక పెద్ద దోషం. కొత్త తరహా ఉమ్మడి కుటుంబంలో ఈ దోషాన్ని తప్పక పరిహరించాలి.

తన సభ్యులను వారు ఎలా ఉంటే అలా స్వీకరించడం కుటుంబానికి అవసరం అవుతుంది. వారిమీద అకారణమైన ఆశలు పెట్టుకోవడం తగదు. కుటుంబానికి తన ప్రతి సభ్యుని సామర్థ్యాలూ, పరిమితులూ తెలిసి ఉండాలి. వాటితోపాటు, తన బలహీనతలుకూడ తెలిసి ఉండాలి. ఇలాంటి అవగాహన ఉంటే, ఏ కుటుంబ సభ్యునిపైనా లేనిపోని ఆశలు పెట్టుకోవడం జరగదు. ఎవరిమీద అయినా మితిమీరి ఆశలు పెట్టుకోవడం దుఃఖాన్నీ, మనస్తాపాన్నీ కొనితెచ్చుకోవడమే అవుతుంది.

ఒకటికన్న హెచ్చు కుటుంబాలు కలసి విశాల కుటుంబంగా జీవిస్తే, వివిధ శక్తియుక్తులు కలిగిన వ్యక్తులు ఒకే ఇంటిలో ఉండడం, ఆ శక్తి యుక్తులు అందరికీ ఉపయోగపడడం జరుగుతుంది. వీరిలో ఒక్కొక్కరిలో ఒక్కొక్క ప్రతిభా విశేషం ఉంటుంది. ఇలా ఇన్ని ప్రతిభలు కలియడంవల్ల అన్ని పనులూ నిరాటంకంగా జరిగిపోతాయి. అందరూ సదవగాహనతో వ్యవహరిస్తే, ఒకరికి ఒకరు పూరకాలుగా పనిచేస్తారు. ఈ విధంగా పాత ఉమ్మడి కుటుంబాన్ని తగువిధంగా సంస్కరించి, ఒక కొత్త నమూనాను రూపొందించవచ్చు. సభ్యులందరి విజ్ఞతలకూ తగు స్థానం, గౌరవం ఇచ్చే అలాంటి కొత్త తరహా ఉమ్మడి కుటుంబానికి రూపురేఖలను దిద్దవచ్చు.

ఉమ్మడి కుటుంబపు ఈ కొత్త నమూనా కొత్త తరాలకు శిక్షణ కేంద్రంగా రూపొందుతుంది. సమాజంలో సద్భావనతో మెలగడం ఎలాగో వారీ కుటుంబంలో నేర్చుకుంటారు. నేటి కుటుంబం మన స్వార్థంపై ఆధారపడి నడుస్తోంది. మనం మరొకరి అభిప్రాయాలను సహించలేకపోతున్నాము. అటువంటపుడు మనం సమాజంలోని ఇతరులకు ప్రయోజనకారులుగా ఎలా ఉండగలం? ఇతరుల ఆలోచనలనూ, అభిప్రాయభేదాలనూ గౌరవిస్తూ, పరస్పరం ప్రేమతో సహకారంతో జీవించే పౌరులు కలిగిన సమాజాన్ని నిర్మించడానికి ఈ కొత్త నమూనా దోహదం చేస్తుంది.

ఈ విధంగా ఉమ్మడి కుటుంబంలో, వేరు కుటుంబంలో ఉన్న ప్రయోజనాలు రెంటినీ సాధించే కొత్త నమూనాను మనం రూపొందించవచ్చు. మన సాధన సంపత్తి నానాటికీ తరిగిపోతున్నది. కాలం మరింత వేగంగా పరుగులు తీస్తున్నది. కనుక, ఈ నమూనా మరింతగా అవసరం అవుతోంది. కాలపు సవాలును ఎదుర్కొనడానికి, మన అస్తిత్వాన్ని నిలిపి ఉంచుకోవడానికీ ఉమ్మడి కుటుంబపు కొత్త నమూనాను చేపట్టడం అత్యవసరం అవుతోంది.

విశాల కుటుంబంగా తాము ప్రతిపాదించిన ఈ కొత్త ఉమ్మడి కుటుంబం కృతయుగ సమాజానికి ఆధారమని పరమపూజ్య గురుదేవులు భావించారు. దాని స్వరూపానికి అవసరమైన సిద్ధాంత భూమిక శరవేగంతో తయారవుతోంది. ఇది రూపుదిద్దుకోవడంలో హృదయపూర్వకమైన సహకారాన్ని అందించడం ఆలోచనాపరులైన పరిజనులందరి ముందున్న పరమ కర్తవ్యం.

☆ ☆ ☆

**కార్యశూరత, ఆత్మనిర్మాణముల సంగమమే అదృష్టం.**

## మనం-మన ఆరోగ్యం

# ఆరోగ్యానికి తారకమంత్రం ప్రాకృతిక జీవనం

### ప్రకృతివైపు మరలండి

మనిషి తప్ప మిగతా ప్రాణులన్నీ ఆరోగ్యంతో, రోగాలు లేకుండా జీవిస్తున్నాయి. సృష్టిలోని సమస్త జీవజంతువుల శరీర స్థితిని పరిశీలిస్తే ఈ వాస్తవం వెలికివస్తుంది. ఆకాశంలో విహరించే పక్షులు, గడ్డిలో దాగి ఉండే క్రిమికీటకాలు, అడవులలో తిరిగే శాకాహారులూ మాంసాహారులూ అయిన పశువులు- ఇలా అని తరహాల ప్రాణులూ ఆరోగ్యంతో బ్రతుకుతున్నాయి. వాటికి వైద్యులు అవసరం లేదు. మందు బిళ్లల, లేహ్యాల అవసరం లేదు. లోషన్‌ల, సూదిమందుల, శస్త్రచికిత్సల అవసరం లేదు. ఈ ప్రాణులు అల్పబుద్ధి కలిగినవి. ఆయుర్వేదం గురించీ, డాక్టర్ల గురించీ వాటికి తెలియదు. అవి మనిషికన్న ఆరోగ్యంగా ఉంటాయి. సృష్టిలోని ప్రాణులన్నీ పరమేశ్వరుని ఆనందమయ సామ్రాజ్యంలో హాయిగా జీవిస్తున్నాయి. పుట్టినది మొదలు చనిపోయేవరకు తమ శరీరం తమను ఇబ్బంది పెడుతోందనే అనుభవం వీటికి ఎన్నడూ కలగదు. ఇతర కష్టాల నివారణ కోసం శరీరమనే ఆయుధం లభించింది. ఆ ఆయుధమే కష్టం కలిగిస్తే, దానివల్ల జీవన యాత్రలో ఆనందం ఎలా కలుగుతుంది?

పరమేశ్వరుని ఆనందమయ సామ్రాజ్యంలో అన్ని ప్రాణులూ రోగగ్రస్తులు కానప్పుడు - మానవజాతి రోగాలకు నిలయంగా ఎలా తయారయింది? ఇది చాలా ప్రముఖమైన ప్రశ్న. దీన్ని గురించి తీవ్రంగా ఆలోచించాలి. మనుషులలో నూటికి 99మంది ఏదో ఒక తీవ్ర రోగంతో, జీర్ణ రోగంతో సతమతం అవుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో ఉన్న ఆ రోగాల నివేదికలు చదవండి. చిత్ర విచిత్రమైన రోగాలతో బాధపడుతున్న రోగులు లెక్కలేనంతమంది గురించిన వివరాలు మీకు తెలుస్తాయి. ఆసుపత్రులలో, మందుల దుకాణాలలో జనం వరుసలు కట్టి నిలవడం మీరు చూస్తారు. ఔషధాలు తయారుచేసే సంస్థలు, అమ్మే సంస్థలు మేడలమీద మేడలు కడుతున్నాయి. అంతే కాదు. సిగ్గువల్ల, సంకోచంవల్ల, పేదరికంవల్ల, అజ్ఞానంవల్ల, సాధనాల కొరత వల్ల తమ రోగాలు దాచుకునే వ్యక్తులు మరెందరో కనిపిస్తారు. అజాగ్రత్తవల్ల, ఉపేక్షవల్ల, అసౌకర్యంవల్ల పలువురు తమ రోగాలను లోలోపలే అణచిపెట్టుకుని ఉంటున్నారు. వందమందిలో 35 మంది రోగాలు బయటికి కనిపిస్తాయి. 65 మంది పైకి రోగం లేనివారుగా కనిపిస్తారు. కాని రోగాలు లోపల లోపల వారిని పీడిస్తూఉంటాయి. అజీర్ణం, మందాగ్ని, మలబద్ధం, స్వప్న దోషం, మంట, అవయవాలలో లోపాలు మున్నగు రోగాలతో హెచ్చుమంది బాధపడుతున్నారు.

### ప్రకృతికి దూరమైతే జంతువులకూ రోగాలు

ఇలా రోగాలు మనుషులను చుట్టుముట్టాయి. మనుషులే రోగాలను ఆహ్వానించారని చెప్పడం మరించ సముచితంగా ఉంటుంది. మనిషి సంపర్కంలోకి వచ్చిన జంతువులకు సైతం రోగాలు పట్టుకుంటున్నాయి. మనిషి కొన్ని జంతువులను పెంచాడు. పెంపుడు జంతువులుగా చేసుకున్నాడు. తనకు నచ్చిన విధంగా జీవించేటట్లు, పని చేసేటట్లు వాటిని అదుపు చేశాడు. అలాంటి పెంపుడు జంతువులకు రోగాలు వచ్చాయి. ఆ రోగాలతో కొద్ది సమయంలో అనేక పశువులు చనిపోతున్నాయి. ఆవులు, ఎద్దులు, గేదెలు, గొర్రెలు, మేకలవంటి పశువులలో ఒక్కోసారి మహమ్మారులు వ్యాపిస్తాయి. కుక్కలు, గుర్రాలు, ఒంటెలు, ఏనుగులు, చిలుకల వంటి వాటికికూడ రోగాలు వస్తున్నాయి. వీటికోసం పశువైద్యశాలలు స్థాపించే అవసరం ఏర్పడుతోంది. ఇదంతా మనిషితో సంపర్కం ఏర్పడడంవల్ల కలిగిన ఫలితం. మనిషి తన రోగాలను ఈ పెంపుడు జంతువులకు బహూకరించాడు. మనుషులకు దూరంగా ఉంటూ, తమ ఆహార విహారాలలో, అలవాట్లలో స్వతంత్రంగా ఉన్న జంతువులకు ఈ బహుమతులు అందడం లేదు. అవి రోగాల బారిన పడడం లేదు.

చాలా ఆశ్చర్యకరమైన విషయం ఇది. బుద్ధీ, సాధనాలూ లేని పశువులు రోగాలు లేకుండా బ్రతుకున్నాయి. రోగాలతో యాతనలు అనుభవిస్తున్నది ఒక్క మనిషే. మనిషి తన సంపర్కంలోకి తెచ్చుకున్న జంతువులకుకూడ రోగాలను తెచ్చిపెట్టాడు.

### మిథ్యా నాగరికతా, రోగమూ

మనిషి బుద్ధి చాలా తీవ్రమైనది. అతడు తన బుద్ధిబలంతో ఆశ్చర్యకరమైన ఆవిష్కరణలు ఎన్నింటినో వెలికి తెచ్చాడు. పెద్ద పెద్ద యంత్రాలను నిర్మించాడు. జ్ఞాన విజ్ఞానాలలో ఎన్నెన్నో పరిశోధనలు జరిపాడు. మనిషి బుద్ధి చేసిన అద్భుతాలు ఎటు చూసినా కనిపిస్తాయి. మరి- జీవితంలోని ఒక మౌలిక సమస్య అయిన ఆరోగ్యం విషయంలో మనిషి బుద్ధి ఏ గంగలో కలిసింది? భోగ విలాసాలకూ, వినోద విహారాలకూ అవసరమయ్యే అద్భుతమైన, అపూర్వమైన వస్తువులను ఒకదానిని మించి మరొకదానిని మనిషి తయారు చేశాడు. రోగ రాహిత్యానికీ, దీర్ఘ జీవనానికీ సంబంధించి చెప్పుకోదగిన ఫలితాలను అతడు సాధించలేదు. ఈ రంగంలో అతడు చేసిన ప్రయత్నాలు ప్రయోజనం కలిగించడానికి బదులు హానికరములుగా పరిణమించాయి.

మరి - దీనికి మూల కారణం ఏమిటి? ప్రాణుల జీవితం

**జ్ఞానానికీ, ఆచరణకూ సామరస్యాన్ని సాధించేది విద్య.**

ప్రకృతి నియమాలతో విడదీయరాని విధంగా బంధించబడి ఉంది. జీవితాన్ని నిర్మించిన సత్తా అది సవ్యంగా సాగడంకోసం ఒక నియమావళిని కూడ రూపొందించింది. ఈ నియమ నిబంధనలు ఏ ప్రాణి ఏమేరకు పాటిస్తే అది ఆ మేరకు రోగరహితంగా జీవిస్తుంది. ఏమేరకు వాటిని ఉల్లంఘిస్తే ఆ మేరకు రోగాల వలలో చిక్కుకుంటుంది. మనిషి ఎత్తులూ జిత్తులూ, అతడు వేసే నాటకాలూ, చేసే బూటకాలూ ప్రకృతిమాత ముందు పనిచేయవు. ప్రకృతిమాత ఎంత దయాళువో అంత కఠినురాలు. ఆమె నియమాలను పాటించేవారు ఆనందమయ జీవితాన్ని బహుమతిగా పొందుతారు. వాటిని ఉల్లంఘించేవారు దండనను అనుభవిస్తారు. ప్రభుత్వ చట్టాలను ఉల్లంఘించే వ్యక్తి ఏవో ఉపాయాలతో ఒకోసారి శిక్షనుంచి తప్పించుకోవచ్చు. కానీ, ప్రకృతిని వంచించడం మరింత కష్టమైన పని.

## ప్రాకృతిక జీవితం సహజసిద్ధం

ప్రకృతి నియమాలు స్పష్టమైనవి. బహిరంగమైనవి. అందరికీ తెలిసినవి. సహజమైనవి. కనుక వాటిని తెలుసుకోడానికి గ్రంథాలు చదవ నవసరం లేదు. పరిశోధనాలయాలకు వెళ్ల నవసరం లేదు. పది ఇంద్రియాలూ, పదకొండవది వివేక బుద్ధీ ఆ నియమాలకు గీటురాళ్లు. శరీరాన్ని సవ్యంగా ఉంచడానికి ఏవి సరైనవో, ఏవి కావో అవి ఒక్క క్షణంలో చెప్పివేస్తాయి. అసలు సరుకునూ, నకిలీ సరుకునూ వేరుచేసే పనికి వాటికి సమయం పట్టదు. ఏది ఉపయోగకరమో, ఏది పనికిరానిదో అవి వెంటనే తేల్చి చెపుతాయి. ఇంద్రియాల చైతన్య జ్ఞాన సూత్రాలను సహజంగా, స్వేచ్ఛగా, మోసగించకుండా పనిచేయనిస్తే- అక్షయమైన ఆరోగ్యం పొందడానికి అవి మనకు చక్కగా దారి చూపుతాయి.

తమ ఇంద్రియాలకు ప్రకృతి ప్రసాదించిన జ్ఞానంపై సృష్టిలోని ఇతర ప్రాణులు పూర్తిగా ఆధారపడతాయి. ఆరోగ్య భాగ్యాన్ని పొందుతాయి. తమ ఇంద్రియాలు స్వీకరించిన ఆహారాన్నే తీసుకుంటాయి. ఇతర వస్తువులను అసలు తాకనే తాకవు. మేక జిల్లేడు ఆకులను తింటుంది. ఆ ఆకులను ఆవుకు పెడితే, అది ఆకలితో చనిపోవలసివచ్చినా వాటిని తినదు. గొర్రెలు మాంసం తింటాయి. గేదెకు మాంసం పెడితే, అది దానిని ముట్టనే ముట్టదు. చిలుక మిరపకాయ తింటుంది. పావురం దాన్ని ఎట్టి పరిస్థితిలోనూ తినదు.

ప్రకృతి నోటి గుమ్మంవద్ద నాలుక అనే కాపలాదారును కూర్చొనబెట్టింది. దేన్ని లోపలకు వెళ్లనివ్వాలో, దేన్ని వెళ్లనివ్వకూడదో అది పరీక్షిస్తూ ఉంటుంది. తన గీటురాయి ఎన్నడూ పొరపడని వైద్యుడు, శాస్త్రవేత్త-నాలుక. కానీ, ఈ కాపలాదారును మోసగించడానికీ, భ్రమలో ఉంచడానికీ, నిద్రలో ఉంచడానికీ, స్పృహతప్పి అసమర్థంగా ఉండేటట్లు చేయడానికీ మనిషి తన ఎత్తులనూ, జిత్తులనూ ప్రయోగిస్తున్నాడు. నిరంతరం అత్యాచారాలను సహిస్తూ సహిస్తూ వస్తున్న ఇంద్రియాలుకూడ ఆ మూసలో ఇమిడిపోవడం మొదలుపెడతాయి. హాని కలిగించే ఆహారాన్ని వ్యతిరేకించవలసినంతగా వ్యతిరేకించవు. పసిపిల్లవాడికి రుచి పూర్తిగా తెలియదు. అతడిముందు ఆహార పదార్థాలను ఉంచండి. వాటిలోని తగిన పదార్థాలనే తీసుకుంటాడు. పాలు, పండ్లు, ఎండుపండ్లు వంటివాటిని అతడు తృప్తిగా తింటాడు. మిరపకాయలు, మసాలా, మాంసం, నూనెవంటివాటిని తీసుకోడు. ప్రతిరోజూ అత్యాచారాలు జరిపి చెడుఅలవాటు చేసినప్పటికీ నాలుక మిరపకాయ తినేటప్పుడు మండుతుంది.

మనిషి అనేక వస్తువులను వాటి అసలు స్థితిలో తినలేడు. కానీ, మనిషి వాటిని రకరకాలుగా మార్చుతున్నాడు. వాటిలో మిర్చిమసాలా, పంచదార కలుపుతున్నాడు. నాలుక వాటి అసలు రూపం గుర్తుపట్టకుండా చేస్తున్నాడు. మాంసాన్ని అలాగే నోటిలో పెడితే, దాన్ని ఎవ్వరూ తినరు. దాన్ని రకరకాలుగా ఉడికించి, వేయించి, ఎండబెట్టి, నేయి మసాలాలు దానితో కలిపి, ఇంకా రకరకాలుగా మసిపూసి మారేడుకాయ చేసి, దాన్ని పూర్తిగా మార్చివేస్తారు. అపుడు అది ఎలాగో గొంతు దిగుతుంది. పొగాకు, నల్లమందు, మద్యం, మాంసం, గంజాయివంటి మత్తు పదార్థాలను తినేటపుడు నాలుకకు అవి రుచించవు. కానీ, మనిషి అలవాటు చేసుకుని వాటిని బలవంతాన కడుపులోకి పంపుతున్నాడు. ఇదంతా నాలుకపై జరుగుతూన్న అత్యాచారం. ప్రకృతి నియమించిన కాపలాదారుపై అత్యాచారం చేసేవాడు శిక్షనుండి తప్పించుకోలేడు. రోగం రూపంలో అతడికి ఆ శిక్ష పడుతుంది.

చెడువాసన వస్తూన్న స్థలం చేరగానే మన ముక్కు అది హానికరమనీ, అక్కడనుండి పారిపొమ్మనీ మనకు ఆదేశం ఇస్తుంది. ఉద్యానవనంలోని సుగంధం, స్వచ్ఛమైన గాలి ముక్కుకు సంతోషం కలిగిస్తాయి. ఆ గాలి ఉపయోగకరమైనదని ఆ విధంగా అది మనకు చెపుతోంది. అందవికారంగా, మురికిగా, వికృతంగా, అసహ్యంగా, బీభత్సంగా ఉన్న వస్తువులను కన్ను ద్వేషిస్తుంది. అందంగా, చైతన్యవంతంగా, సరసంగా, పద్ధతిగా, తేజోవంతంగా, ముచ్చటగా ఉన్న వస్తువులపట్ల అనురాగం ప్రకటిస్తుంది. దానికి ఉన్న ఈ విచక్షణాజ్ఞానం మనకు లాభ నష్టాలను స్పష్టంగా సూచిస్తుంది. హానికరం, భయంకరం, కర్కశం, కటువు అయిన శబ్దాలను విని చెవి అయిష్టాన్ని ప్రకటిస్తుంది. పరీక్ష చేసే ఈ శక్తి ప్రతి ఇంద్రియానికీ ఉంది. అయితే, ప్రతి రోజూ అభ్యాసం చేయించడంవల్ల ఇంద్రియాలు ఆ చెడుకు అలవాటుపడిపోతాయి. ఇలా ప్రతి ఇంద్రియాన్నీ దుర్వినియోగపరుస్తున్నాం. తినకూడనివి తింటున్నాం. దుర్వాసన కలిగిన గాలి పీల్చుతున్నాం. మురికి వస్తువులను, వికారమైన వస్తువులను చూస్తున్నాం. కటువైన, కర్కశమైన, అశాంతి కలిగించేవి

**ధనాభావం కాక - పిసినారితనమే దారిద్ర్యం.**

అయిన శబ్దాలనూ, ధ్వనులనూ వింటున్నాం. హద్దుమీరి, అతిగా లైంగిక క్రియలు జరుపుతున్నాం. ఇలా ఇంద్రియాలకు ఉన్న హద్దులను మీరుతున్నాం. ఇలాంటి జీవితం రోగరహితంగా ఎలా ఉంటుంది.

**ప్రకృతికి దూరమైన అలవాట్లు**

పగటి నిద్ర, రాత్రిపూట మేలుకోవడం, తీక్షణమైన విద్యుద్దీపాల కాంతిలో చదవడం, దుమ్ము, వేడి, మురికి నిండిన వాతావరణంలో నివసించడం- ఇదంతా ప్రకృతి నియమాలను అతిక్రమించడం. శరీరాన్ని వేడినుండి చలినుండి కాపాడే శక్తి చర్మానికి సహజంగా ఉంది. చిన్నచిన్న ప్రాణులు, అత్యంత బలహీనమైన ప్రాణులుసైతం ఎలాంటి ఆచ్ఛాదనా లేకుండా వేడిలో, చలిలో తిరుగుతూ ఉంటాయి. వాటికి జలుబు చేయదు. నిమోనియా రాదు. ఫ్యాషన్‌ల మోజులో పడి మనం దుస్తులపై దుస్తులు ధరిస్తున్నాం. బనియను, కమీజు, వెయిస్ట్‌కోటు, కోటు, ఓవర్‌కోటు ఒకదానిమీద ఒకటి తొడుక్కుంటున్నాం. ఒక్కొక్కదానికి రెండుమూడు మడతలు ఉంటున్నాయి. ఇలా శరీరాన్ని అతిగా కప్పివేయడంవల్ల చర్మంలోని చైతన్యం దెబ్బతింటుంది. చర్మంనుండి వెలువడే చెడుగాలి బట్టలలో నిలచిపోయి శరీరానికి అంటుకుని ఉండిపోతుంది. స్వచ్ఛమైన బయటి గాలి చర్మంవరకు వెళ్లదు. మూసిన గదిలో మొక్క వెలుగులేక వాడిపోయి చచ్చిపోతుంది. బట్టల బరువువల్ల శరీరానికీ అదే గతి పడుతుంది. నోరు, ముక్కు, చెవులు, మెడ వంటివాటికి ఎపుడూ గాలి తగులుతూ ఉంటుంది. చలి, వేడి పెద్దగా తేడా చేయవు. ఇలా శరీరమంతా ఆచ్ఛాదన లేకుండా ఉన్నప్పటికీ నష్టం లేదు. సాధువులు, సన్యాసులు, రైతులు, గిరిజనులు చాలావరకు ఆచ్ఛాదన లేకుండానే ఉంటారు. వారికి చలి, వేడి ఇబ్బంది పెట్టవు.

ఫ్యాషన్ల మోజు, కృత్రిమత్వం, లేనిపోని సింగారింపులు, ప్రకృతివిరుద్ధమైన ఆహార విహారాలు మనిషి ఆరోగ్యాన్నీ, దీర్ఘజీవనాన్నీ దెబ్బతీశాయి. ఈ ధోరణి మారకపోతే, మనుషులు చిన్నవాళ్లుగా, అల్పజీవులుగా తయారవుతారు. ప్రకృతివిరుద్ధమైన ఆచరణ ఆరోగ్యాన్ని నశింపజేస్తుంది. ప్రకృతి నియమాలను అతిక్రమించడంలో కాక, వాటిని అక్షరాలా పాటించడంలోనే మనిషి శ్రేయస్సు ఇమిడి ఉంది. డాక్టర్లు ఇచ్చే రంగురంగుల మందులు రోగరాహిత్యాన్ని అందించలేవు. ప్రకృతిమాతను ఎదిరించడం ద్వారాకాక, దాని ఆదేశాన్ని పాటించడం ద్వారా మాత్రమే మనం దానినుండి జీవనదానాన్ని పొందగలుగుతాం.

**ప్రకృతిని శరణుపొందుదాం**

ప్రాకృతికమైన ఆహార విహారాలను పూర్తిగా పాటించడం సాధ్యమయ్యే పరిస్థితిలో మానవ జాతి నేడు లేదనే మాట నిజమే. అయితే ఫ్యాషన్ల మోజులో తెచ్చిపెట్టుకుంటున్న కృత్రిమత్వాన్ని చాలా తగ్గించుకోవడం మాత్రం పూర్తిగా సాధ్యమే. సాత్వికత, సహజత్వం, అవసరం- వీటిని దృష్టిలో పెట్టుకుని జీవన పద్ధతిని మలచుకోవడమూ సాధ్యమే. అప్పుడు బాహ్య ఆడంబరాలన్నీ నిరర్థకాలుగా, లేనిపోని బరువుగా కనిపిస్తాయి. వాటిని క్షణాలమీద వదులుకోవాలని అనిపిస్తుంది.

కాయకల్పాన్ని కోరే వ్యక్తులారా! ఆరోగ్యాన్ని కోరే వ్యక్తులారా! ప్రకృతివిరుద్ధమైన ఈ ఆహార విహారాలకు స్వస్తి చెప్పండి. పూజనీయులైన మన పూర్వీకుల మార్గాన్ని అనుసరించండి. సాదా అయిన, సరళమైన, దోషరహితమైన జీవితాన్ని గడపండి. ప్రకృతిమాత చరణాలమీద పడి మీ తప్పులకు ప్రాయశ్చిత్తం చేసుకోండి. ఆమెనుండి ఆరోగ్యం, జీవితం అనే క్షీరాన్ని అర్థించండి. దయాళువు అయిన మాత ఆ క్షీరాన్ని త్రాగిస్తుంది. ఔచిత్యం, అవసరం, జీవన రక్షణ అనే అంగాలు ఆధారంగా ఆహార విహారాలను తీర్చిదిద్దుకోండి.

**అంతా జీర్ణశక్తి మహిమ**

రోగాలనుండి విముక్తి పొందడానికి మందులూ మాకులూ, పౌష్టికాహార సలహాలు ఆశ్రయించ నవసరం లేదు. జీర్ణశక్తి దెబ్బతింటే ఖరీదైన మందులూ, బలవర్ధకాలని చెప్పబడే టానిక్‌లూ పనిచేయవు. అవి కడుపులోకి వెళ్లి మలద్వారంనుండి వెలికి వస్తాయి. అవి జీర్ణం కాకపోతే, రసంగా రక్తంగా మారకపోతే- వాటివల్ల పోషణ ఎలా జరుగుతుంది? జీర్ణశక్తి మామూలు భోజనానికి సైతం బలం ఇస్తుంది. గొర్రె పొటేలును చూడండి. అది గడ్డి తింటుంది. అయినా లావెక్కుతుంది. పంది వెన్న, మీగడ, పాలు, మిఠాయి తినదు. పౌష్టిక తత్వాలు బాగా తక్కువగా ఉన్నవాటిని తింటుంది. అయినా జీర్ణశక్తిద్వారా తన శరీరాన్ని పుష్టిగా చేసుకుంటుంది. గేదెలు, ఎద్దులు, గుర్రాలు, ఏనుగులు వంటి జంతువులు మిఠాయిలు తినవు. ధాతుపుష్టి మాత్రలు వేసుకోవు. అయినా బలంగా ఉంటాయి.

కనుక జీర్ణశక్తి చక్కగా ఉండడం ముఖ్యం. జీర్ణశక్తి లోపిస్తే, ఆకలి లేకపోతే, మలం పేరుకుపోతే - అదే బలహీనతలన్నిటికీ మూలమని గుర్తించాలి. జీర్ణశక్తిని పెంచడం ఎలా అని ఆలోచించాలి. రైతు జొన్నరొట్టెలు, ఉల్లికారం తిని దృఢంగా ఉంటాడు. పన్నెండు గంటలు శ్రమిస్తాడు. రాత్రిపూట సుఖంగా నిద్రపోతాడు. పట్టణంలోని ఆఫీసు ఉద్యోగి నెయ్యి, మిఠాయి, నిలవ పచ్చళ్లు, చిత్రవిచిత్రమైన వేపుడు కూరలు తింటాడు. రోజుకో కొత్త టానిక్ త్రాగుతాడు. అయినా ఈసురోమంటూ ఉంటాడు. ఆఫీసులో ఆరుగంటలు పనిచేసి అలసిపోతాడు. అతడికి రాత్రి సరిగా నిద్రపట్టదు. ఇదంతా జీర్ణశక్తి జరిపే క్రీడ. నోరు, ఆమ్లాశయం, హృదయం, ప్రేగులు మున్నగు అవయవాలనుండి వెలువడే జీర్ణ రసాలు భోజనంతో కలిసి శరీరానికి అవసరమైన పుష్టిని ఇస్తాయి. జీర్ణశక్తి సక్రమంగా ఉంటే, మనిషి మామూలు భోజనం నుండి బలవర్ధక తత్వాలను పొందగలుగుతాడు.

★★★

**మంచితనమనే అంకురానికి నీరు ఎరువు అందిస్తే, అది అలవాటనే వటవృక్షం అవుతుంది.**

ధారావాహికం: దివ్యజీవన దర్శనం - 2

# జోక్యం చేసుకున్న దివ్యచేతన

## భగవానుడు ఎంపికచేసిన దేశం

పైన పేర్కొన్న శ్రీఅరవిందుల అభిప్రాయాన్ని పోలిన మరో అభిప్రాయాన్ని కూడ ఇక్కడ ప్రస్తావించాలి. 1972లో జరిగిన ఒక చర్చ. గురుదేవులు హిమాలయాలలోని రహస్య స్థలాలలో సుమారు సంవత్సరంపాటు అజ్ఞాతవాసం జరిపి శాంతికుంజ్‌కు తిరిగి వచ్చారు. శాంతికుంజ్‌లోని ముఖ్య భవనం మొదటి అంతస్థులో ఇపుడు గురుదేవులు మాతాజీల పాదుకలు ఉన్న స్థలంలో గురుదేవులు కుర్చీలో కుర్చున్నారు. భారతవర్షపు విరాట్ స్వరూపాన్ని, మహిమామయ స్వరూపాన్ని మానవాళికి పరిచయం చేయడం కోసం పరిశోధన జరగవలసిన అవసరంగురించి చర్చ జరుగుతోంది. మన మహిమనూ, గరిమనూ ప్రపంచానికి తెలియజెప్పాలంటే అందుకు వాస్తవాలనూ, ప్రమాణాలనూ చూపవలసి ఉంటుంది. వాటిని సేకరించడానికై పరిశోధన అవసరం అవుతుంది. గురుదేవులు జరిపిన ఈ పరిశోధన ఆ తర్వాత "సమస్త విశ్వకో భారత్‌కా అజస్ర అనుదాన్" (ప్రపంచానికి భారతవర్షం నిరంతరం అందించిన ప్రసాదం) అనే గ్రంథంగా వెలువడింది.

భారతవర్షం దివ్యలీలలు జరిగిన భూమి అనే సిద్ధాంతం గురుదేవుల వ్యాసాలలో, ఉద్బోధనలలో బలీయంగా వెలికివస్తోంది. ఒక పరిజనుడు గురుదేవులను ఇలా అడిగాడు- 'పరమేశ్వరుడు భారతదేశంలోనే అవతారాలు ఎత్తాడుకదా. ఆయనకు భారతవర్షంపై అంత అభిమానం ఎందుకు ఉంది? మన జాతి మానవాళికి సభ్యతా సంస్కృతుల వెలుగును అందించిన అత్యంత పురాతనమైన జాతి అని మనం భావిస్తున్నాం. మనం గొప్పలు చెప్పుకోవడం లేదు కదా. శక్తిలో, జ్ఞానంలో, కౌశల్యంలో, సంఘటనాశక్తిలో మనం ఎవరికీ తీసిపోకపోతే- శతాబ్దుల తరబడి మనం బానిసత్వంలో ఎందుకు మ్రగ్గాము? మనం శక్తిశాలులం అయితే, మహావీరులం అయితే దురాక్రమణదారులు మన దేశాన్ని ఎలా జయించారు?"

ఆ పరిజనుని ప్రశ్నలో సందేహం కాని, ఆక్షేపంకాని లేదు. జిజ్ఞాస మాత్రమే ఉన్నది. గురుదేవులు అజ్ఞాతవాసం నుండి తిరిగివచ్చిన సంగతి హెచ్చుమందికి తెలియదు. రోజూ అయిదారుగురు వ్యక్తులు మాత్రమే శాంతికుంజ్‌కు వచ్చేవారు. మాతాజీ గదికి కుడివైపున ఉన్న గదిలో కూర్చుని, గురుదేవులు వ్రాసుకునేవారు, భావి కార్యక్రమాలను నిర్ణయించేవారు. పరిజనుని ప్రశ్నకు గురుదేవులు క్లుప్తంగా ఇలా సమాధానం చెప్పారు- 'భారతవర్షం భగవానుడు ఎంపికచేసిన దేశం. నీవు చూడడం లేదా. పరమేశ్వరుడు ఇక్కడ స్వయంగా అవతారాలు ధరించాడు. సత్యాన్నీ, ధర్మాన్నీ ప్రతిష్ఠించాడు. ఆయన ఇక్కడ 24 అవతారాలు ఎత్తాడు. ఇక్కడ జన్మించిన ఋషులు, మునులు, యోగులు, యతులు, సిద్ధులు, సంత్‌ల సంఖ్య ఊహకు అందనిది. ప్రపంచంలోని ఇతర దేశాలలో జన్మించిన సంత్‌లు అందరినీ లెక్కవేస్తే వారి మహిమల వివరాలను సేకరిస్తే- అదంతా భారత్‌లో జన్మించిన ఆధ్యాత్మికవేత్తలలోని ఒక భాగంతో అయినా సమానం కాదు. మన దేశంలో ఉన్నన్ని సిద్ధాంతాలు, విశ్వాసాలు, సాధనా సంప్రదాయాలు ప్రపంచంలోని ఇతర దేశాలలో ఉన్నవాటి అన్నిటికన్న హెచ్చు. ఇక్కడ ఆ విద్యలన్నిటికీ సమన్వయం ఉన్నది. ఈ విద్యలు ఇతర దేశాలలో వెలసి ఉంటే వాటి విద్వాంసులు పరస్పరం తలపడి ఉండేవారు. ఇక్కడి ప్రకృతి, ఋతువులు, నదీనదాలు, పర్వతాలు, మైదానాలు, ప్రాణి జగత్తు, నివాసులు - అన్నింటిలోనూ వైవిధ్యం ఉన్నది. ఈ వైవిధ్యాన్ని చూచినపుడు, భారత్ భగవానుడు ఎంపిక చేసిన దేశమని తెలియడం లేదా. ఆయన ఇక్కడ తన లీలలద్వారా, తన ప్రకృతిద్వారా కొత్తకొత్త ప్రయోగాలు చేస్తున్నాడు'.

కొద్ది క్షణాలు ఆగి, గురుదేవులు ఆ పరిజనుణ్ణి ధ్యాసపెట్టి చూచారు. మాటలో చెప్పినదానికన్నా ఎంతో హెచ్చయిన సందేశం, ఎన్నో రెట్లున్న సందేశం ఆ దృష్టి నిక్షేపంద్వారా, ఆ ధ్యాసను కేంద్రీకరించడం ద్వారా పంపబడింది. గురుదేవులు అలా ధ్యాసపెట్టి చూడడం చూస్తే ఒక బుద్ధిపరమైన పాఠం ఆ పరిజనునికి అందినట్లు అనిపించలేదు. ఆ పరిజనుడు అప్పటి తన అనుభూతిని వర్ణిస్తూ ఇలా వ్రాశాడు- 'నాకు బాల్యం గుర్తుకువచ్చింది. నాకు ఏదైనా జటిల ప్రశ్న ఎదురైనపుడు నేను నా తండ్రిగారి వద్దకు వెళ్లేవాణ్ణి. ఆయన నా ప్రశ్నకు ఏవో పుస్తకాల్లోనుండి సమాధానం చెప్పేవారు కారు. ఏదో సమాచారాన్నికాని, వాస్తవాన్నికాని పేర్కొనేవారు కారు. వారు సిద్ధాంత విషయాలు కొన్నిటిని బోధించేవారు. ఆ తర్వాత నావైపు చూస్తూ ఉండేవారు. నేను అడిగినదానికి సమాధానం ఏమిటనేది నేను మరచిపోయేవాణ్ణి. ఆయన మాటలు విని, అంతకు మించి ఆయన దృష్టిని ఆస్వాదించి- నేను తృప్తిపడేవాణ్ణి. తాళపుచెవి దొరికిందని నాకు అనిపించేది. పుస్తకం మూసి తాళంవేసిన ఒక పెట్టె తాళంచెవి దూర్చి పెట్టె తెరువు. పెట్టెలో బందీగా ఉన్న సమాధానాన్ని అందుకో. గురుదేవులు చేసిన సంక్షిప్తమైన ఉద్బోధనతో, కొద్దిసెకనుల దృష్టినిక్షేపంతో చిన్ననాటి ఆ అనుభూతి నా మనసులో మెదిలింది.'

**ఎదుటివారి బాధను తన బాధగా చేసుకున్నవాడు భక్తుడు. చేసుకోనివాడు విభక్తుడు.**

గురుదేవులు ఆ తర్వాత ఇలా అన్నారు- 'హేతుబద్ధమైన సమాధానం కావాలంటే అదీ ఉంది. సంసారం ఒక చక్రంవంటిది. అది గుండ్రంగా తిరుగుతూ ఉంటుంది. చక్రంలోని కొన్ని ఆకులు పైకి వస్తే, మరికొన్ని ఆకులు క్రిందకు పోతాయి. భారత్ విషయంలోనూ అదే జరిగింది. ఏ జాతి అయినా ఎల్లకాలం శిఖరాగ్రంలో ఉండదు. పైకి ఎక్కడంతోపాటు క్రిందికి దిగడంకూడ ఉంటుంది. కొన్ని వందల సంవత్సరాల బానిసత్వాన్ని పతనంగా పరిగణించవచ్చు. కానీ, ఆ బానిసత్వం భారత్‌ను నాశనం చేయలేదు. కొన్ని జాతులూ, సమాజాలూ 50-100 సంవత్సరాల అణచివేత కారణంగానే నాశనం అయినాయి. గ్రీసు, ఈజిప్టు, ఇరాన్, రోమ్‌ల ప్రాచీన సభ్యతలు తమను రక్షించుకోలేకపోయాయి. వాటి మౌలిక అస్తిత్వం ఏనాడో సమాప్తం అయిపోయింది. ఆ దేశాల ప్రజలకన్న హెచ్చుగా భారత్ అణచివేతకూ, పీడనకూ గురయింది. అయినా నేడది లేచి నిలబడింది. దీన్ని నాశనం కావడం అంటావా, విజిగీషు ప్రవృత్తికి నిదర్శనం అంటావా? వాస్తవాల వెలుగులో చూచినప్పటికీ- భారత్‌ను అజరంగా, అమరంగా, అజేయంగా నిలిపి ఉంచిన కొన్ని అంశాలు ఉన్నాయని గుర్తిస్తావు.'

భారత్‌కు తపోధనులైన దేవాత్మల, ఋషి-మునుల దివ్యశక్తుల సంరక్షణ ఉన్నదనే వాస్తవాన్ని మరెందరో మనీషులూ, తత్వవేత్తలూ తమతమ ధోరణులలో ధృవపరచారు. వారి తపోబలం ఈ దేశపు సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితిని కాపాడుతూ ఉన్నది. భారత వర్షపు ఆరోగ్యం ఎప్పుడైనా దెబ్బతిన్నప్పటికీ, అది ఒక స్థాయిని దాటి పతనం చెందదు. విజాతీయ తత్వాలూ, శక్తులూ దానిపై దురాక్రమణ జరుపుతాయి. వారు ఎంత బలీయులైనా, ఒక పరిధి దాటి దానిని వెనుకకు నెట్టలేరు. ఆ సరిహద్దు చేరగానే భారత్ ఉవ్వెత్తున లేచి నిలబడుతుంది. వ్యతిరేక పరిస్థితులను ఛేదించి సగర్వంగా విజేతగా నిలుస్తుంది. భారత్‌లో ఉన్న ఈ దిగ్విజయ శక్తి రహస్య స్థలాలలో మౌనంగా తపస్సు చేస్తూన్న యోగుల, ఋషుల దివ్యప్రభావం నుండి పెల్లుబుకుతుంది. పరమేశ్వరుడు, జగన్నియంత ప్రసాదించిన ప్రత్యేక అనుగ్రహం దానికి ఉండనే ఉన్నది.

ఋషి సత్తా వర్షించే అనుగ్రహానికి నమూనా 1971 డిసెంబర్‌లో జరిగిన ఒక గొప్ప సంఘటన. అపుడు భారత్, పాకిస్తాన్‌ల మధ్య యుద్ధం జరుగుతోంది. ఆ యుద్ధ ప్రారంభానికి పూర్వపు పరిస్థితులు అందరికీ తెలిసే ఉంటాయి. తూర్పు పాకిస్తాన్ (నేటి బంగ్లాదేశ్) నుండి వేలాదిమంది జట్లు జట్లుగా భారత్‌కు వచ్చి చేరుతున్నారు. అక్కడి పాలకులు ప్రజలను దారుణంగా పీడిస్తున్నారు. తూర్పు పాకిస్తాన్‌లోని సహజ సంపదను అక్కడికి రెండువేల కిలోమీటర్ల దూరాన ఉన్న పశ్చిమ పాకిస్తాన్ నియంతృత్వం దోచుకుంటోంది. తన దేశంలో వాడుకుంటోంది. ఉత్పత్తి చేసే భూభాగాలు దోపిడీకీ, పీడనకూ, మధ్య దళారీల దుర్మార్గాలకూ గురయినాయి. తూర్పు పాకిస్తాన్ ప్రజలు ఇరవై సంవత్సరాలు ఆ యమ యాతనలను భరించారు. తమ హక్కులకోసం, న్యాయంగా తమకు రావలసిన అధికారాలకోసం గళం విప్పుతూవచ్చారు. ఆ విజ్ఞప్తులు వినడానికి బదులు పాలకులు ఉపేక్షా వైఖరినీ, దమన నీతినీ అనుసరిస్తూ వచ్చారు. ఈ దమనకాండ, ఈ పరపీడనపరాయణత్వం అక్కడి ప్రజలకు దుర్భరం అయిపోయింది. తూర్పు పాకిస్తాన్ ప్రజలు తిరుగుబాటు చేశారు. తూర్పు పాకిస్తాన్‌ను స్వతంత్ర రాజ్యంగా ప్రకటించారు. దౌర్జన్యకాండ తీవ్రరూపం ధరించింది. దానితోపాటు ప్రతీకార జ్వాలలు, విప్లవజ్వాలలు మరింతగా రగులుకొన్నాయి.

## దివ్యచేతన జోక్యం

తూర్పు పాకిస్తాన్‌లో సాగుతూన్న సంగ్రామం ప్రభావం భారత్‌పై కూడ పడింది. దారుణ దమనకాండను ఎదిరించలేని జనం, దుర్భర పరిస్థితులను తట్టుకోలేని జనం భారత్‌కు తరలిరాసాగారు. ఇలా వస్తూన్న ప్రజల సంఖ్య వేలనుండి లక్షలవరకు, లక్షలనుండి కోట్లవరకు పెరిగి రెండు కోట్లు దాటింది. ఇంతమంది ప్రజల బాగోగులు చూచే బాధ్యత భారత్ ప్రభుత్వంపై పడుతోంది. ఆరోజుల్లో ప్రభుత్వ సాధన సంపత్తి విషయంలో విపరీతమైన కొరత ఏర్పడింది. ఆ కొరతను తట్టుకుని, ఇక్కడి ప్రజలపై అదనపు పన్నులు వేసి ప్రభుత్వం ఏదోవిధంగా ఆ శరణార్థులకు ఏర్పాట్లు చేస్తూ వచ్చింది.

తూర్పు పాకిస్తాన్ ప్రజలను నిలువు దోపిడీ చేయడంతో సంతృప్తిచెందలేదు పశ్చిమ పాకిస్తాన్. అక్కడి పాలకులు తమ రాజకీయ ఎత్తుగడలలో భాగంగా భారత్‌పై యుద్ధాన్ని రుద్దారు. 1971 జూలైనుండే మన తూర్పు, పశ్చిమ సరిహద్దులపై ఒత్తిడి పెరిగింది. కొద్దివారాలలోనే ఆ ఒత్తిడి యుద్ధంగా మారింది. ఆనాడు అగ్రరాజ్యాలు పాకిస్తాన్ పక్షాన నిలిచాయి. తూర్పు పాకిస్తాన్ ప్రజల నరకయాతనలు ఎవరికీ కానరాలేదు. భారత్‌పై పెరుగుతూన్న ఒత్తిడికూడ ఎవరికీ పట్టలేదు. యుద్ధం ప్రారంభం కావడానికి ముందు పరిస్థితిపై ప్రపంచ ప్రజాభిప్రాయం దృష్టిని ఆకర్షించడానికి భారత్ సాయశక్తులా ప్రయత్నించింది. ప్రధానమంత్రి, మంత్రివర్గంలోని సీనియర్ సభ్యులు బ్రిటన్, అమెరికా, ఫ్రాన్స్, జర్మనీ, ఇజ్రాయిల్, ఆరబ్ అమిరేట్ దేశాలలో  పర్యటనలు జరిపారు. ఆయా దేశాల పాలకులకు వాస్తవిక పరిస్థితిని వివరించారు. అయినా ప్రయోజనం లేకపోయింది. పాకిస్తాన్ పాలకులకు నచ్చజెప్పడానికి ఎవరూ ప్రయత్నించలేదు. మౌనంగా ఉండి, లేదా పాకిస్తాన్‌కు సైనిక సహాయం పంపి- ఆయా దేశాలు పాకిస్తాన్‌నే ప్రోత్సహిస్తూ వచ్చాయి.

1971 అక్టోబర్‌లో చైనా ఐక్యరాజ్యసమితి సభ్యురాలు అయింది. తూర్పు పాకిస్తాన్ పరిస్థితీ, అక్కడనుండి తండోపతండాలుగా వచ్చిపడుతూన్న శరణార్థుల బరువులో భారత్

**ధనం దాన్ని కలిగిఉన్నవాడిది కాదు, దాన్ని సద్వినియోగపరచేవాడిది.**

పరిస్థితి మరింత దయనీయంగా తయారైనాయి. భారత్ ఏకాకి అయిపోయింది. భారత్ యుద్ధచర్యలు ప్రారంభిస్తే ఆ దేశాన్ని దురాక్రమణదారుగా ప్రకటిస్తామనీ, పాకిస్తాన్‌కు మద్దతు ఇస్తామనీ అగ్రరాజ్యాలు బెదిరించాయి. అంతేకాదు. భారత్‌కు ఇస్తున్న సహాయం అంతటినీ నిలిపివేస్తామనీ ప్రకటించాయి. పొరుగు దేశం పాకిస్తాన్ దౌష్ట్యాన్ని సహించి ఊరుకోవడంతప్ప భారత్‌కు మరో దారి లేకపోయింది.

రష్యాతప్ప మరే దేశమూ భారత్ పక్షాన లేదు. అయితే, ఆ అగ్ర రాజ్యానికికూడ దాని పరిమితులు దానికి ఉన్నాయి. భౌగోళికంగా దూరంగా ఉండడంవల్ల, రాజకీయమైన పరిమితులవల్ల- మనసులో కోరిక ఉన్నప్పటికీ, ఆ దేశం చర్య తీసుకోలేకపోయింది. ఈ పరిణామాలన్నిటి ఫలితంగా భారత్ ఏకాకిగా, నిస్సహాయురాలుగా దిక్కుదోచని స్థితిలో మిగిలిపోయింది. తూర్పు సరిహద్దుల్లో పాకిస్తాన్ అప్రకటిత యుద్ధాన్ని ఏనాడో ప్రారంభించింది. డిసెంబరు మొదటి వారం ప్రారంభమవుతూనే అది పశ్చిమ సరిహద్దుల్లోకూడ దాడిచేసింది. ఆ దురాక్రమణకు జవాబు ఇవ్వడం,యుద్ధం ప్రకటించడం తప్ప భారత్‌కు గత్యంతరం లేకపోయింది.

యుద్ధ ప్రకటన జరిగింది. తూర్పు, పశ్చిమ సరిహద్దులలో భీషణ యుద్ధం ప్రారంభమయింది. రెండు మూడు రోజులలోనే పాకిస్తాన్ సైన్యం కాళ్లు తేలిపోసాగాయి. అది వెనుకంజ వేయసాగింది. తూర్పు పాకిస్తాన్ రంగంలో శత్రుసేన ఒత్తిడి తగ్గసాగింది. భారత సైన్యం ముందుకు వెళ్లడం కనిపించింది. అప్పుడు దురాక్రమణదారుకు మద్దతు ఇస్తున్న దేశాలు చర్యలు తీసుకున్నాయి. ఐక్యరాజ్య సమితి భద్రతా మండలికి ఈ వ్యవహారాన్ని తీసుకువెళ్లడానికి సన్నాహాలు ప్రారంభమైనాయి. ఒక దేశంపై నైతికమైన ఒత్తిడి తేవడానికై ఇలాంటి సన్నాహాలు జరుగుతూ ఉంటాయి.

అమెరికా ఈ సన్నాహాలతో తృప్తిపడి ఊరుకోలేదు. అది సైనిక ఒత్తిడినికూడ పెంచింది. హిందూ మహాసముద్రంవైపు పురోగమించాలని తమ సప్తమ నౌకాదళాన్ని ఆదేశించింది. సప్తమ నౌకాదళం ఆనాడు ప్రపంచంలోని అతిపెద్ద నౌకాదళం. దానిలో యుద్ధ విమానాలు, క్షిపణులు, విమాన విధ్వంసక శతఘ్నులు, వాయుతలంనుండి వాయుతలానికి వెళ్లే మిసైల్‌లు, తగినంత మందుగుండు సామాగ్రి కలిగిన సైనిక దళాలు ఉన్నాయి. భారత్-పాక్ యుద్ధ పరిస్థితిని తలక్రిందులు చేసే సైనిక సామర్థ్యం ఆ సప్తమ నౌకాదళానికి ఉన్నది. ఆ నౌకాదళాన్ని ధ్వంసంచేసే సామర్థ్యం కాని, దాన్ని హెచ్చు సమయం నిలువరించే సామర్థ్యం కాని ఆనాడు భారత నౌకాదళానికి లేదు. భారత్-పాక్ యుద్ధం తీవ్రతరం అయితే అది వారం పదిరోజులలోనే ముగిసిపోవడం ఖాయం.యుద్ధం ముగిసే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. కానీ, సప్తమ నౌకాదళం హిందూమహాసముద్రంవైపు తరలడంతో పరిస్థితులు తారుమారు అవుతున్నాయి.

ఇలా పరిస్థితి తారుమారు కావడంతో- భారత ప్రభుత్వంలోనే కాక, తూర్పు పాకిస్తాన్‌లోని ముక్తివాహినిలో, అక్కడి పౌరులలో, భారతీయ జనమానసంలో కూడ ఆందోళన ప్రారంభమయింది. విచిత్రమూ, భయావహమూ అయిన స్తబ్దత అంతటా ఆవరిస్తోంది. సప్తమ నౌకాదళం భారత సముద్ర సరిహద్దుల సమీపానికి వచ్చిందని 1971 డిసెంబర్ 5న వార్త వచ్చింది. ఈ దూరం తగ్గుతున్నట్లు తాజా సమాచారం అందింది. ప్రజల మనోబలాన్ని నిలిపి ఉంచడానికై - సప్తమనౌకాదళం కార్యకలాపాలపై వార్తలను ఆకాశవాణి కుదించి ప్రసారం చేస్తోంది. బి.బి.సి. ప్రసారాలలో నౌకాదళాన్ని గురించి మరింత సమాచారం వెలువడుతోంది. నౌకాదళం భారత సరిహద్దుకు మరింతగా దగ్గరవుతోందని డిసెంబరు 6 రాత్రి నుండి డిసెంబర్ 7 తెల్లవారుజాము వరకు వార్తలు వచ్చాయి. నౌకాదళం తన దిశను మార్చుకున్నదనీ, అది భారత సరిహద్దుకు దూరం అవుతూన్నదనీ డిసెంబర్ 7వ తేదీ సూర్యోదయం తర్వాత వచ్చిన మొదటి వార్తలో తెలిసింది.

ఏమి జరిగింది? రాత్రికి రాత్రి పరిస్థితులు ఎలా మారాయి? దౌత్యపరమైన చర్యలేవీ జరగలేదు. ప్రపంచ ప్రజాభిప్రాయపు ఒత్తిడీ లేదు. ఈ స్థాయికి చేరిన తర్వాత అమెరికా రక్షణశాఖ ముఖ్య కార్యాలయం పెంటగన్ తన నిర్ణయాన్ని మార్చదని అమెరికా ప్రభుత్వ వ్యవస్థను సూక్ష్మంగా అవగాహన చేసుకున్న నిపుణులు ప్రకటించారు. తన నౌకాదళం బయలుదేరిన తర్వాత పని పూర్తికాకుండా తిరిగివెళ్లిన సందర్భం అమెరికా చరిత్రలో లేనేలేదు. సేనలు ప్రస్థానం జరిపి, యుద్ధ ప్రకటన జరిగి, యుద్ధం ప్రారంభమైన తర్వాత- వెనువెంటనే వెనుదిరిగిన సంఘటన, విరామం ఇచ్చిన సంఘటన ఇతర దేశాలలో సైతం జరగలేదు. అమెరికా రక్షణ మంత్రిత్వశాఖ రాత్రికి రాత్రి తన నిర్ణయాన్ని ఎందుకు తారుమారు చేసింది? యుద్ధానికి విరామం ఇవ్వడం, యుద్ధాన్ని ముగించడం, ఆక్రమణను ఉపసంహరించడం వంటి కీలక నిర్ణయాలు తీసుకునే అధికారం అమెరికా అధ్యక్షునికి మాత్రమే ఉన్నది. సప్తమ నౌకాదళాన్ని ఉపసంహరించాలనే నిర్ణయం తీసుకోవలసిరావడానికి అమెరికా అధ్యక్షునిపై అకస్మాత్తుగా ఎలాంటి ఒత్తిళ్లు వచ్చాయి? అమెరికా వ్యవహారాల నిపుణులు ఈ ప్రశ్నకు ఇంతవరకు సమాధానం కనుగొనలేకపోయారు.

మరి - దైవీ శక్తి ఏదయినా జోక్యం కలిగించుకున్నదా? శ్రద్ధాళువుల మనస్సులలో అప్పుడుకూడ జిజ్ఞాస కలిగింది. ప్రస్తుత ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని రాజ్‌నంద్‌గావ్‌లో ఉన్న సాధకుడు మోహన్

**పరమాత్మ ఉపాసనతో కోర్కెలను జోడించడం తగని పని.**

దేవాంగన్‌కు 1971 డిసెంబర్ 7 తెల్లవారుజామున ఒక కల వచ్చింది. ఆ కల ఇలా ఉంది- అమెరికా నౌకాదళం హిందూమహాసముద్రాన్ని దాటి బంగాళాఖాతంలో ప్రవేశిస్తోంది. హుటాహుటిన శ్రీలంక సరిహద్దును దాటుతోంది. దాని వేగం క్షణ క్షణం పెరుగుతోంది. రామేశ్వరంవద్ద సేతువు నిర్మించబడిన స్థలానికి ఆ నౌకాదళం చేరింది. ఆ స్థలంలో కొన్ని రాళ్లు తేలుతూ కనిపించాయి. ఆ రాళ్లమీద రామనామం వ్రాసి ఉంది. రాళ్లమధ్యనుండి ఒక పెద్ద యుద్ధనౌక (అది సప్తమ నౌకాదళం అనేది స్పష్టం) ప్రయాణిస్తోంది. అకస్మాత్తుగా మెరుపు మెరిసినట్లయింది. సముద్రాన్ని చీల్చుతూ బిగించిన పిడికిలితో ఒక చేయి వెలికివచ్చింది. మొదట పిడికిలి వెలికివచ్చింది. ఆ తర్వాత ముంజేయి వెలికివచ్చింది. అనంతరం చేయి పూర్తిగా వెలికివచ్చింది. ఆ చేయి పైకివెళ్లి ఆకాశాన్ని తాకుతున్నది. ఆ పిడికిలి తెరుచుకున్నది. అరచేయి విస్తరిస్తున్నది. క్రమంగా ఆ యుద్ధనౌకను తాకుతున్నది. ఆ అరచేయి ఎంతగా విస్తరించిందంటే- ఆ యుద్ధనౌక కనబడకుండా పోయింది. మరుక్షణంలో మామూలు పరిస్థితి ఏర్పడింది. సముద్రం ప్రశాంతంగా ఉంది. ఆ చేయి "ఎర్ర కాగడా" ధరించిన చేయిలా ఉంది.

శాంతికుంజ్‌లో అఖండ దీపం ఎదుట జపం చేస్తున్న దేవకన్యలకుకూడ ఇలాంటి అనుభూతి కలిగింది. సప్తమ నౌకాదళం వెనుదిరిగిన వార్త ప్రసారం కావడానికి ముందే- వందనీయ మాతాజీ తనకు ప్రణామం చేయడానికి వచ్చిన సాధకులతో ఇలా అన్నారు - ప్రమాదం తప్పింది. ఈ యుద్ధంలో భారత్ విజయం పొందడం తథ్యం.ప్రపంచంలోని ఏ శక్తీ భారత్‌ను ఓడించజాలదు. యుద్ధం ముగిసిన తర్వాత భారత్ రోజురోజుకూ మరింతగా ప్రగతి సాధిస్తుంది. విశ్వానికి మార్గదర్శనం చేసే బాధ్యతను భారత్ నిర్వహించవలసి ఉంది. త్వరలోనే భారత్ అందుకు తగు యోగ్యతను సంపాదిస్తుంది.

పలువురు సాధకులకు కలలు కనిపించిన తర్వాత, వారు అనుభూతులు పొందిన తర్వాత పది రోజులకు యుద్ధం ముగిసింది. తాను సత్యపథంలో, న్యాయ మార్గంలో నడుస్తున్నానని భారత్ తనకుతాను ఋజువుచేసుకున్నది. భౌతిక దృష్టిలో ప్రత్యక్షంగా సమర్థురాలుగా కనిపించకపోయినా- ప్రపంచమంతటినుండి వచ్చే అనుచితమూ, అవాంఛనీయమూ అయిన వ్యతిరేకతను ఎదురొడ్డి నిలిచే శక్తి సామర్థ్యాలను భారత్ కలిగి ఉన్నది. ఇక భారత్‌ను ఓడించడం ఎవ్వరికీ సాధ్యం కాదు.

విజయం అనంతరం భారత్ శక్తి, సాధన, సిద్ధి రంగాలలో రోజురోజుకూ ప్రగతి సాధించింది. భారత వర్షపు ఈ నియతి ముందుగానే వ్రాయబడి ఉన్నది. భారత్ తొలి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ 1947 ఆగష్టు 15న ప్రసిద్ధి పొందిన తన ప్రసంగంలో 'నియతి సాక్షాత్కరించిన వేళ' అని వర్ణించిన ఆ నియతి కూడ ఎన్నో సంవత్సరాల పూర్వమే వ్రాయబడి ఉన్నది. అయితే ఆ అక్షరాలు వెలికివచ్చిన సంవత్సరం 1911.

☆ ☆ ☆

## రైతు నేర్పిన పాఠం

పర్యక్ మహారాజు తన సింహాసనాన్ని ఇతరులకు అప్పగించి దైవాన్ని వెతుకుతూ బయలుదేరాడు. సత్సంగం, ధ్యాన మననాలు, స్వాధ్యాయం మొదలయిన కార్యక్రమాలలో లీనమయ్యాడు, ఎన్నో విన్నాడు. ఎందరో మహా పురుషుల్ని దర్శించాడు. కానీ ఏమీ గొంతు దిగలేదు. ఫలితం లభించలేదు. అసంతృప్తితో ఖిన్నమనస్కుడై తీర్థయాత్రలకు బయలుదేరాడు. ఒక రోజు బాగా అలసి, ఆకలితో ఒక రైతు పొలంలోకి అడుపెట్టి చెట్టు నీడలో కూర్చుని కునికిపాట్లు పడసాగేడు. ఇది చూచి రైతు చేతిలో పనిని వదలి పెట్టివచ్చి బాటసారి ఆకలితో అలసిఉన్నాడని గ్రహించి బియ్యం కుండలో పోసి, పొయ్యి మీద పెట్టి, ఓ బాటసారీ! లేచి అన్నం వండు. ఈలోగా వదిలిపెట్టిన పనిని పూర్తిచేసి వస్తాను. ఇద్దరం కడుపు నిండా భోజనం చేద్దామని చెప్పాడు. రాజు మంత్ర ముగ్ధునిలా రైతు చెప్పినట్లు చేశాడు. అన్నం ఉడకగానే ఇద్దరూ తృప్తిగా తిన్నారు. రాజుకి నిద్ర పట్టేసింది. నిద్రలో ఒక దివ్య పురుషుడు దర్శనమిచ్చి "నేను కర్మను. నన్ను ఆశ్రయించకుండా ఎవ్వరికీ శాంతి లభించదు. ఈ రైతు వలెనే నీవు కూడా పరమార్థాన్ని, పురుషార్థాన్ని ఆశ్రయించు. లక్ష్యాన్ని చేరుకొంటా"వని చెప్పి అదృశ్యమైనాడు. నిద్ర మేల్కొన్న రాజు తన ఆలోచనలను మార్చుకొన్నాడు. దానితో కార్య పద్ధతి కూడా మారింది. జ్ఞాన చర్చలు తగ్గించి, పురుషార్థ పరాయణుడై సేవా కార్యక్రమాలలో లీనమయ్యాడు.

చెడు ఆలోచనలు చేసేవానికి లోకం చెడుగాను, సదాలోచన చేసేవానికి లోకం అతి సుందరంగానూ అనిపిస్తుంది. ఈ ఆలోచనలు ఆధారంగానే ప్రజలు మంచి చెడు రూపాలలో ప్రతిఫలాన్ని పొందుతూ ఉంటారు. ఎలాంటి ఆలోచనలకు అలాంటి ప్రతిక్రియలే సంభవించటం చాలా సహజమైన విషయం.

- ప్రజ్ఞాపురాణం నుండి

## గౌరవం సద్గుణాలకు బహుమానం

మాతాజీ దివ్య జీవనం - 4

# ఆరాధ్యునితో కలిసే భావ భూమిక

ఆరాధ్యుని చరణాలపట్ల భగవతి ప్రీతి దృఢమౌతున్నది. ఆమె హృదయంలో నిరంతరం భక్తి అంతర్ధారగా ప్రవహించుచున్నది. ధ్యానసాధనలో తన పూర్వ జన్మల కథ స్పష్టమైన తర్వాత ఆమెలో ఒక విలక్షణ భావపరివర్తన వచ్చింది. ఇంతకు ముందు కూడా ఆవిడ చాలా ప్రశాంతంగా ఉండేది. కానీ ఇప్పుడు ఈ శాంతి ఇంకా ఘనీభూతమైంది. ఈ రోజులలో ఆమె పూర్తిగా శాంతంగా, అచంచలంగా ఉండి తన దైనిక క్రియాకలాపాలలో లీనమై ఉండేది. ఆమె దినచర్యలో పెద్ద వదినకు ఇంటి పనులలో సహకరించుట, రామాయణం, మహాభారతం మొదలగు ధర్మగ్రంథముల స్వాధ్యాయం, తన నియమిత ధ్యానసాధన చేసుకొనడం ముఖ్యమైనవి. ఇంటిలో అందరికంటే చిన్నపిల్ల అయినప్పటికీ, కుటుంబంలోని అందరి సభ్యుల బాగోగులను చూసుకునేది. ఎవరికి, ఎప్పుడు, ఏది, ఎంత అవసరమో దానిని చాలా జాగ్రత్తగా గమనించేది.

ఆమె ఇరువురు అన్నలు, దీన్‌దయాళ్, సున్హరీలాల్‌లు, ఆమె గుణములతో సంతుష్టులై ఉండేవారు. వదిన ఆమెను చూసి గర్వపడేది. ఈ మధ్యకాలంలో పెద్దక్క ఓంవతికి పెళ్లి జరిగింది. ఎప్పుడో తప్ప ఆమె వచ్చేది కాదు. ఆమె తన చెల్లెలిని చాలా ప్రేమించేది. అందువల్ల వదినతో, తండ్రితో పట్టుబట్టి లాలిని కొద్దికాలం తనతో పంపించమని బలవంతం చేసేది. ఇక్కడ ఉంటే ఎక్కడికీ వెళ్లదు కదా. స్థలం మారటం వలన ఆమె మనస్సుకు కూడా ప్రశాంతత లభిస్తుంది అనేది. ఓంవతి మంకుపట్టుకు ఎలాగోలా జస్వంతరావు ఒప్పుకునేవారు. భగవతి కొద్దిరోజులు తన అక్క అత్తవారింటికి వెళ్ళివచ్చేది. అక్కడ కూడా ఆమె దినచర్య ఇలాగే ఉండేది. అక్కకి ఇంటిపనులలో సహకరించేది. తన ధ్యానసాధన క్రమం యథావిధిగా కొనసాగిస్తూ ఉండేది.

ఆ రోజులలో కుటుంబ సభ్యులు ఆమె కొరకు యోగ్యుడైన వరుడ్ని వెతకటానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. పెద్ద అన్న దీన్‌దయాళ్, తండ్రి జస్వంతరావుల మధ్య దీని గురించి విస్తారంగా చర్చలు జరుగుతూ ఉండేవి. ఈసారి లాలి అక్క ఓంవతి ఇంటి నుంచి తన ఇంటికి తిరిగి వచ్చేసరికి కుటుంబం దగ్గరి బంధువు కిషన్ ప్రసాద్‌గారు వచ్చి ఉన్నారు. అప్పుడు ఆయన ఒక వరుడి గురించి చెప్తున్నారు. పండిత్ జస్వంతరావు, ఆయన పెద్ద కొడుకు దీన్‌దయాళ్ చాలా ఓర్పుతో, ఉత్సుకతతో ఆయన మాటలు వింటున్నారు. ఆయన చెప్పే మాటలు కొన్ని భగవతి చెవిలో పడ్డాయి. ఆయన ఇలా అంటున్నారు - "జస్వంత్, ఇటువంటి పిల్లవాడు ప్రపంచం అంతా వెతికినా నీకు దొరకడు. వీరు ఆవల్‌ఖేడాలో ఉంటారు. చుట్టుపక్కల ఊళ్లలో వీరిది పెద్ద జమిందారీ. వీరు వంశపారంపర్యంగా ధనవంతులు.

ఈ మాటలకు అడ్డుపడుతూ జస్వంతరావు గారు ఇలా అన్నారు - "నా గురించి వారికి ఉన్నది ఉన్నట్లు చెప్పావు కదా?" ప్రశ్నకి జవాబుగా కిషన్ ప్రసాద్ ఇలా అన్నారు - "ఇందులో దాచడానికి ఏం ఉంది? నేను కుర్రాడు అన్న రాం ప్రసాద్‌తో మాట్లాడాను. నేను వారికి చెప్పేశాను. జస్వంతరావు పూర్వీకులు అహమద్‌పూర్ (ఖైర్, అలీగఢ్)లో ఉండేవారు. అక్కడే వారికి ఇల్లు, పంట భూములు ఉండేవి. వారి ముత్తాతల కాలంలో 12 ఊళ్లకి జమిందారుగా ఉండేవారు. వారి కుటుంబానికి మంచి పేరు ఉండేది. కానీ వారి తండ్రి శ్రీపరసాదీ లాల్ శర్మ కాలంలో పరిస్థితులు విషమించాయి. రైతుల క్లిష్ట పరిస్థితులు చూసి ఆయన శిస్తు తీసుకోలేదు. మెల్లి మెల్లిగా జమిందారీ అంతరించి పోయింది.'' కిషన్ ప్రసాద్ మాటలు అందరూ జాగ్రత్తగా వింటున్నారు. ఆయన ఇలా కొనసాగించారు - "మీరు నలుగురు అన్నదమ్ములని రాంప్రసాద్‌కి చెప్పాను. జస్వంత శర్మ, బల్వంత శర్మ, రాందయాళ్ శర్మ, వాసుదేవ ప్రసాద్. ఈ నలుగురు అన్నదమ్ముల మధ్య ఒక చెల్లెలు రామశ్రీ ఉండేది. ఆమెకి పెళ్లి అయ్యింది. ఆమె తన కుటుంబాన్ని తాను చూసుకుంటుంది - అని చెప్పాను.''

కిషన్‌ప్రసాద్ తన ధోరణిలో తాను వేగంగా చెపుతూనే ఉన్నారు. తన ధోరణిలో ఉన్న ఆయన వినేవాళ్ళు వరుడి గురించి తెలుసుకోవడానికి ఉత్సాహపడుతున్నారు అనేది గమనించలేదు. దీనదయాళ్ గుర్తు చేసినప్పుడు ఆయన మాటల ధోరణి మార్చారు. ఆయన ఇలా అన్నారు - 'అరె! వరుడు గురించి ఏమి చెప్పాలి? పండిత్ రూప్‌కిశోర్ శర్మగారి కొడుకు. ఇంక పండిత్ రూప్‌కిశోర్ పేరు చుట్టుపక్కలవాళ్లకి తెలుసు. ఆయన సుపుత్రుడే ఈయన. పేరు శ్రీరామ్. తపస్సు, సాధన, చదువు అన్నింట్లోను మొదటే ఉంటారు. కొన్నాళ్లు ఇక్కడే ఆగ్రాలో ఉండి "సైనిక్" అనే పత్రికలో పని చేశారు. ఇప్పుడు మథురలో ఉండి స్వయంగా పత్రిక నడుపుకుంటున్నారు. కాలదేవత, ఆయన మొదటి భార్యను తీసుకుపోయింది. ఆమెద్వారా ఆయనకి ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఓంప్రకాష్, దయావతి, శ్రద్ధ. కానీ మన లాలీ ఎంత గుణవంతురాలంటే - అంతా తేలికగానే నిభాయించ గలదు.''

కిషన్‌ప్రసాద్ చెప్పిన మాటల మీద ఇంటిలో చాలా రోజులు

**జీవితంలోని ప్రతి శ్వాసతో అమలుచేసే తత్వం ధర్మం.**

చర్చలు జరిగాయి. రకరకాల ఆలోచనలు, చర్చలు అనేకసార్లు జరిగాయి. మొదటి భార్య చనిపోవుట, తద్వారా ముగ్గురు పిల్లలు ఉండుట అనేది దీన్‌దయాళ్‌కి కొంచెం రుచించలేదు. ఈ విషయం మీద తండ్రి జస్వంతరావుతో చాలాసేపు మాట్లాడాడు. మాటలలోనే ఆయన ఇలాగ కూడ అడిగారు. - "దాదా! నీ జ్యోతిష్యం ఏమి చెప్తోంది?" జవాబుగా జస్వంతరావు గంభీరులై ఇలా అన్నారు - "చూడు, మొదటినుంచి నేను లాలి దేవీ అంశ అనే నమ్ముతున్నాను. ఆమె వివాహం ఒక సాధారణ వ్యక్తితో కుదరదు. అతను ఎంత పెద్ద ధనవంతుడైనా సరే. మన లాలికి యోగ్యుడైన వరుడు తపోనిష్ఠుడై, ఆధ్యాత్మిక విద్యా జ్ఞాత అవ్వాలి. నాకు ఈ కుర్రవాడు అన్నివిధాలా లాలికి తగినవాడు అనే అనిపిస్తున్నాడు. పండిట్ జస్వంతరావు మాటలు దీన్‌దయాళ్‌కు రుచించాయి. చివరికి తండ్రి, పుత్రు లిద్దరూ కలిసి లాలి వదినకు ఈ విషయాలన్నీ తెలిపి, ఆమె అభిప్రాయం తెలుసుకోమని ఆమెను అడిగారు. ఏమి జరిగినా లాలి ఇష్టంతోనే జరగాలి అని నిర్ణయించుకున్నారు.

వదిన తన భర్త, మామగార్ల ఆజ్ఞానుసారం తన ముద్దుల మరదలితో అన్ని విషయాలు చర్చించింది. ఆమె అన్ని మాటలు చాలా శాంతముగా విన్నది. మాటలు అన్నీ చెప్పడం అయిన తరవాత, ఆమె ఒక్క క్షణం తన అంతర్‌చేతనను ఏకాగ్రం చేసింది. ఈ ఏకాగ్రతలో సత్యం స్పష్టంగా గోచరించింది. ఎవరితో తన వివాహం గురించి చర్చలు జరుగుతున్నాయో, ఆయన పనిలో సహకరించడానికే తను దేహం ధారణ చేసినదని స్పష్టంగా అర్థమైంది. క్రిందటి జన్మలలో భర్తగానూ, మార్గదర్శకుడుగానూ ఉన్న తన ఆరాధ్యదైవమే ఈసారి తన భర్త కాబోతున్నాడు. తన అంతర్‌చేతనలోని విషయాలన్నీ ఆమె గోప్యంగానే ఉంచింది. ప్రత్యక్షంగా ఆవిడ ఇంతే చెప్పింది - "వదినా! దాదాకి నీవు చెప్పు. ఆయన చెప్పినది నాకు ఇష్టమే. ఆయన చేయబోతున్నదానిలో నా జీవితం మంగళమయం అవుతుంది".

లాలి అంగీకారం, స్వీకృతి తెలుసుకొని కుటుంబం మొత్తం ఆనందించింది. ఉత్సాహ తరంగాలు ఇల్లు అంతా వ్యాపించాయి. వరపక్షము నుంచి కూడా స్వీకృతి వచ్చేసింది. మంగళమయి పరిణయము కొరకు ఏర్పాట్లు మొదలు పెట్టారు. (ఫాల్గుణ శుక్ల సప్తమి, విక్రమ సంవత్సరం, 2001కి సరియైన) 18 ఫిబ్రవరి 1945నాడు వివాహం నిశ్చయింపబడింది. పెళ్లిరోజు నిర్ధారింపబడగానే పండిత జస్వంతరావు మనస్సులో ఆనందంతో పాటు ఒక బాధ కలిగింది. ఆయనకు, జగదంబ పార్వతి పితృగృహం వదిలి భగవాన్ భోలేనాథ్ (శివుడు) దగ్గర నివసించడానికి వెళ్లడానికి సంకల్పం తీసుకున్నదని అనిపించింది. తన బాధను మనస్సులోనే దాచుకుని జస్వంతరావు కూతురి వివాహ ఏర్పాట్లలో మునిగిపోయారు. అందులో గ్రామస్థులైన జ్వాలా ప్రసాద్ గారు చాలా ప్రధాన పాత్ర వహించారు. ఆయన మధ్యవర్తిత్వంలోనే ఇవన్నీ జరిగినవి.

అనుకున్న తిథిలో వివాహం జరిగింది. వివాహం చాలా సాధారణంగా ఎటువంటి ఆడంబరాలు లేకుండా జరిగింది. ఇది మానవత్వమునకు జీవన ఆదర్శాన్ని నిరూపణ చేసే ఋషియుగ్మం మంగళ పరిణయం. ఇది తపస్సు శ్రద్ధల కలయిక. జ్ఞానం, భక్తి - వీటి అద్భుత సాయుజ్యం. భగవతి, శ్రీరామ్ ఈ శుభఘడియలలో తమ ఆదర్శ మార్గాన కలిసి నడవడానికి సంకల్పితులు అయ్యారు. తన ఆరాధ్యుని చరణముల సామీప్యంలో భగవతి జీవితంలో ఒక సరికొత్త అధ్యాయం తెరుచుకుంది. 'మా'లోని మాతృత్వం అభివ్యక్తి చెందుతున్నది. మాతృత్వపు సజల భావనలు రూపుదిద్దుకొనుటకు తయారు అవుతున్నాయి.

అమ్మ మాతృత్వం ఆవల్‌ఖేడాలో కాలు పెడుతూనే పొంగి పొరలింది. అప్పగింతలయ్యాక పెళ్లివారు ఇక్కడికి తిన్నగా వచ్చారు. పూర్వికుల గడప, తన ఆరాధ్యుని జన్మస్థలం, ఆయన ప్రారంభిక తపఃస్థలంలోకి పెళ్లికూతురుగా పల్లకీ దిగారు మాతాజీ. ఎరుపురంగు జరీ అంచు గల ఎంబ్రాయడరీ చీర కట్టుకున్న, అన్ని సౌభాగ్య చిహ్నాములతో దిగుచున్న ఆమె సాక్షాత్తు జగదంబవలెనే అనిపించుచున్నది. హిమవంతుని పుత్రిక పార్వతి తన పితృగృహం వీడి భగవాన్ భోలేనాథ్‌తో పాటు తన అత్తవారింటికి వచ్చే దృశ్యం ఆ క్షణములలో సాకారమైనది. బాలమండలి శివగణముల వలె ఆమెవంక అత్యంత శ్రద్ధ, ఆశ్చర్యములతో చూచుచున్నారు. తాయిజీ (ఆమె అత్త, పూజ్య గురుదేవుల తల్లి) శుభ శకునములు గల అన్ని లోకాచారములు పూర్తి చేయుటలో నిమగ్నమై ఉన్నది. ఇది పూర్తి చేయుటకు చాలా సమయం తీసుకున్నది. ఒకదాని తర్వాత ఒకటి అన్ని రీతి రివాజులు, విధివిధానాలు పూర్తి అయిపోయాయి.

ఆ తరువాత ఆమెను ఒకచోట చాప వేసి కూర్చోపెట్టారు. పిల్లలు ఆమెను ఇంకా చుట్టబెట్టే ఉన్నారు. ఈ పిల్లలలో దగ్గర బంధువుల పిల్లలతో పాటు దయ, ఓం ప్రకాష్ కూడా ఉన్నారు. శ్రద్ధ అప్పటికి చాలా చిన్నపిల్ల. ఆమె ఈ బాలమండలిలో లేదు. కేవలం ఆశ్చర్యం మాత్రమే ఈ పిల్లల మనస్సులలో మెదులుతున్నది. దీనికి వశీభూతులై వారిలో వారు చాలా నెమ్మదిగా మాట్లాడు కుంటున్నారు. అప్పుడే దయ ముందుకు వెళ్లి దగ్గరగా నుంచుంది. అప్పుడు భగవతి ఆ చిన్నారి చేయి పట్టుకుని, తన దగ్గర కూర్చోబెట్టుకుని, చాలా ప్రేమగా ఇలా అంది - "అమ్మా! నేను నీకు అమ్మను తల్లీ. నా దగ్గర నీవు ఏవిషయంలోనూ, ఏ విధంగానూ సంకోచించవలసిన పని లేదు".

ఈ మాటలు దయకు చాలా ధైర్యాన్నిచ్చాయి. చాలా మెల్లగా తడబడుతున్న స్వరంతో దయ "అమ్మా" అని పిలిచింది. ఈ ఒక్క మాట తల్లీ, పుత్రికలు ఇరువురి అంతర్ భావనలను ఏకీకృతం చేసింది. అపరిమితమైన తీయదనం వారి జీవితంలో ఇంటిలో వెదజల్లబడింది. అమ్మ ఉన్నది అన్న భావన ఎంత ఆశ్వాసన, బలం, విశ్వాసం, నిశ్చింత,

**జ్ఞానంతో, తపస్సుతో, అనుభవంతో మాత్రమే ధర్మ ప్రచారం జరుగుతుంది.**

ఆలంబనం, చేయూత ఇస్తుందో దయ ముఖమండలం మీద స్పష్టంగా కనిపించింది. ప్రసన్నతా దీప్తి కనిపించింది. ఈ కొద్ది కాలంలోనే, ఆమె తన మనస్సులో మా! మా! అనే ఏకాక్షరీ మహామంత్రం స్మరించుచున్నది. 'మా' ప్రేమ లోని తరళత ఆమె అంతఃస్థలమును భావసిక్తం చేసింది. ఆమెను చుట్టుకుని, ముడుచుకొని దగ్గరగా కూర్చుంది.

దయ యొక్క ఈ భావముద్ర ఓంప్రకాష్‌ను ఆశ్చర్యంలో పడవేసింది. అతనికి తన చెల్లెలు అకస్మాత్తుగా ఇంత ఆనందంగా ఎందుకు కనిపించుచున్నదో అర్థం కాలేదు. కొన్ని నిమిషములలోనే ఆమె మీద ఏ మ్యాజిక్ జరిగింది? ఇలా ఆలోచించుకుంటూ అతను కూడా ధైర్యంచేసి ముందుకు వెళ్లాడు. అప్పుడు అతను నిక్కరు, చొక్కా వేసుకుని ఉన్నాడు. కొన్ని అడుగులు వేసి ఆమె దగ్గరకి వెళ్లి నుంచున్నాడు. ఇంతలో తాయిజీ అటువైపు నుంచి వెళుతోంది. తన స్వభావానుసారం ఆమె పెద్ద గొంతుకతో అన్నది - "నుంచుని ఏం చూస్తున్నావు. వంగి మీ అమ్మ కాళ్లు ముట్టుకో". తాయిజీ గొంతుక విని కొద్దిగా జంకుతూ, ఓం ప్రకాష్ వెళ్లి ఆమె పాదాలకు నమస్కరించాడు.

అతను చరణములను స్పృశిస్తున్నప్పుడే మాతాజీ, "నీవు ఏ క్లాసు చదువుతున్నావు?'' అని అడిగారు. చాలా నెమ్మదియైన గొంతుకతో ఓంప్రకాష్ ఈ ప్రశ్నకు జవాబిచ్చాడు - "నా పేరు ఓంప్రకాష్, నేను ఏడవ క్లాసు చదువుతున్నాను.'' ఈ ప్రశ్న జవాబు మాతాపుత్రులిద్దరినీ భావముల కోమల సూత్రములతో కలిపింది. తన ప్రథమ కలయిక అనుభూతులను గుర్తు చేసుకుని ఈనాడు కూడా ఓంప్రకాష్‌గారి కళ్లు చెమ్మగిల్లుతాయి. ఆయన ఏమంటారంటే - "**కుపుత్రో జాయతే క్వచిదపి కుమాతా నభవతి**'' అనే దానిని సార్థకం చేస్తూ అమ్మ తన ఈ పుత్రుని మీద ఎప్పుడూ కరుణ చూపించేది. లెక్కపెట్టలేనన్ని తప్పులను నవ్వుతూ విస్మరించేది. ఆ క్షమామయి అన్ని అపరాధాలనూ క్షణంలో క్షమించి, నిరంతరం తన స్వభావమైన కోమలత, మృదులత నాకు పంచి పెట్టేది.''

ఓంప్రకాష్, దయలతో కలసి, 'మా' శ్రద్ధను కలిసింది. తన ఈ పుత్రికకు పూర్తి ప్రేమను పంచింది. ఆమె మీద అపరిమిత ప్రేమను కురిపించింది. కొలది రోజులలోనే ఈ ముగ్గురూ 'మా'తో కలిసిపోయారు. మాతాజీ వారికి తన హృదయంలో స్థానమిచ్చింది. ఇంటి వాతావరణం ఆమె వచ్చిన కొన్ని రోజులలోనే మారిపోయింది. ఆకురాలు కాలంలోనే వసంత దేవత వచ్చిందా అనిపించింది. ఇంటి పనులు, పిల్లలను చూసుకొనుటలో ఒక విశిష్టత కనిపించేది. అన్ని వైపులా సౌందర్యం, సువ్యవస్థ కనిపించింది. ఈ మార్పు ప్రతి ఒక్కరి మనః ప్రాణాలను, అంతఃకరణాలను స్పృశించింది. ఈ స్పర్శ అనేకులలో సజల భావనలను రేకెత్తించింది.

ఆమె తన ఆరాధ్యుని అంతఃచేతన, అంతర్ భావనలతో మొదటే కలిసినది. ఆమె ధ్యానదృశ్యముల ప్రతి క్షణంలో, ప్రతి నిమిషంలో ఒక అపూర్వమైన అలౌకికత ఉన్నది. ఇది సామాన్య దంపతుల కలయిక కాదు. పతి పత్ని యొక్క సామాన్య సంసారికుల కలయికలాంటి స్థూలమగు లౌకిక దృష్టి ఇక్కడ లేదు. పరమ పురుషుడు, ప్రకృతి మాతల కలయికలాంటి అద్భుతమైన కలయిక ఇది. ఈ కలయికలో సర్వేశ్వరుడైన సదాశివుడు, భగవతి మహాశక్తి యొక్క అలౌకికత ఉన్నవి. నూతన సృష్టి బీజారోపణ ఈ కలయికలోని క్షణంలోనే జరిగినది. ఈశ్వరుని గురించి ధ్యానం, చర్చల మధ్యలో వీరిరువురు కలిసి కూర్చున్నప్పుడు భవిష్యత్తులో జరగబోవు నూతన ఘటనల గురించి చర్చించుకునే వారు. ఆమె ఆరాధ్య దైవం ఆమెను ఈ క్రొత్త భూమికకు తయారు చేస్తున్నారు.

ఇది గురుదేవుల తీవ్రసాధనా కాలం. గాయత్రీ మహా పురశ్చరణల క్రమం అంతిమ చరణములలో ఉన్నది. అఖండజ్యోతి మాసపత్రిక నియమపూర్వకంగా వెలువడుచున్నది. ఈనాటి విశాల గాయత్రి పరివారం అప్పుడు అఖండ జ్యోతి పరివారంగా అంకురించుచున్నది. దీనిని సవ్యంగా పోషించడానికి, పాలించడానికి, భరించడానికి ఒక తల్లి అవసరం. 'అమ్మ' ఒకరిద్దరు సంతానానికి జన్మనిచ్చుటకే పరిమితం కాదు. జన్మ ఇచ్చినంత మాత్రాన ఎవ్వరూ అమ్మ కాలేరు. తన సంతానాలకు శ్రేష్ఠ సంస్కారాలను ఇచ్చేదే అమ్మ. వారిలో తమ ప్రాణములు పోసి వారి భావ వికాసం చేయాలి. విశ్వఉద్యానవనంలోని శ్రేష్ఠమైన పుష్పములు గల వృక్షములుగా వారిని వికసింపచేయుటకు అవసరమైన ఎరువు, నీటి వ్యవస్థ చేయాలి.

ఈపని అంత సులువైనది కాదు. దీనికొరకు అత్యంత కఠోర సాధన, ఆధ్యాత్మిక ఆత్మశక్తి అవసరం. రాబోవు కాలానికి అనుగుణంగా మాతా భగవతి ఈ రోజులలో ఇదే చేయుచున్నది. తన ఆరాధ్యుని సంసర్గములో అనేక గోప్య మంత్రములు, బీజాక్షరాలు, యోగము యొక్క గహన ప్రక్రియల జ్ఞానం ఆమెకు ఈ కాలంలోనే ఇవ్వబడింది. ఆమె విశిష్టమైన సాధనలు తపస్యులలో ఉత్తముడైన శ్రీరామ్ అఖండ సాధనా దీప ప్రజ్వలన చేసినప్పటి నుంచే మొదలిడినవి. కానీ ఇక్కడ ఆమె సాధనాకాలం చాలా తక్కువ. అఖండజ్యోతి ప్రచురణ వల్ల పరమపూజ్య గురుదేవులు మథురలో ఉండడం అనివార్యము అయింది. మొదట కొన్ని సంచికలు ఆగ్రా నుంచి ప్రచురించిన తరవాత ఇప్పుడు అఖండజ్యోతి మథుర నుంచి ప్రచురింపబడుతోంది. సాధకులు, జిజ్ఞాసువులు, ఆగంతకుల రాక పెరిగింది. మథురలో ముందు తీసుకున్న అద్దె ఇల్లు ఇరుకైనది. నూతన పరిస్థితులకు అనుగుణంగా నేడు ఉన్న అఖండజ్యోతి ఇల్లు అద్దెకు తీసుకున్నారు. మాతా భగవతి, తాయిజీ, పిల్లలు తన ఆరాధ్యునితో పాటు, అఖండజ్యోతి సంస్థాన్ (నేడు ఘియామండీలో ఉన్న ఇల్లు) ప్రాంగణంలోకి వచ్చి నివసించారు.

☆☆☆

**వ్యక్తులకన్న వాస్తవాలు గొప్పవి.**

# బోధకథ

# దుష్కర్మకు ఫలితం

మహారాజు వీరభద్రుడు రణకుశలుడైన యోధుడేకాక సాహిత్యాభిలాషి కూడా. ఆయన దర్బారులో అనేక విషయాలలో ప్రఖ్యాతులైన గొప్పగొప్ప విద్వాంసు లుండేవారు. సాహిత్యం, దర్శనం, జ్యోతిషం మొదలైన అనేక నిగూఢమైన విషయాల మీద లోతైన చర్చలు జరపడంలో మహారాజు ప్రత్యేకమైన ఆసక్తి కనపరుస్తుండేవాడు. ఒకసారి ఆయన తన దర్బారులోని పండితులను "మనిషి పుట్టినప్పుడే అతడి తలరాత నిశ్చితమై ఉండినట్లయితే ఇక అతడు జీవితంలో చేసే ప్రయత్నాలకి ఔచిత్య మేమున్నది?"- అని అడిగాడు. విద్వాంసులు ఎవరి సామర్థ్యానికి తగినట్లు వారు సమాధానం ఇచ్చారు. కానీ రాజుగారికి సంతృప్తికరమైన సమాధానం లభించలేదు.

ఆయన దర్బారులో చతురసింహుడనే వ్యక్తి ఉన్నాడు. అతడి తెలివితేటల గురించి అందరూ కథలు కథలుగా చెప్పుకుంటారు. అతడి తెలివి గురించి ఎంత గొప్పగా వర్ణిస్తారో అంతకి రెట్టింపు అతని కుటిల స్వార్థబుద్ధి గురించి కూడా చెప్పుకుంటారు. దర్బారులో మహారాజు అడిగిన ప్రశ్న విన్న తర్వాత అతనికి తన చిన్ననాటి స్నేహితుడు విశాలుడు గుర్తుకువచ్చాడు. విశాలుడు చదువుకునే రోజులల్లోనే తన విలక్షణ ప్రతిభతో గురువులను ఆశ్చర్యచకితులను చేస్తుండేవాడు. అతడి మేధస్సు ఎంత పదునైనదో అతడి భావాలు అంత ఉదాత్తమైనవి. రాజుగారి కొలువులో ఎన్ని అవకాశాలు వచ్చినా కాదని అధ్యాపక వృత్తిని ఎన్నుకున్నాడు. రాజధానికి కొద్ది దూరంలోఉన్న అరణ్యంలో ఒక గురుకులాన్ని స్థాపించి సమర్థవంతంగా నడుపుతున్నాడు. రాజ్యంలో ఆ గురుకులానికి మంచి పేరు ఉన్నది.

చతురసింహుడికి చదువుకునే రోజులనుండి విశాలుడి పట్ల అంతులేని అసూయ ఉండేది. ప్రతిదానిలో తనకు ప్రత్యర్థిగా నిలచి ఎందులోనూ తనను గెలవనిచ్చేవాడు కాడు. తాను ఏమీ చేయలేక నోరుమూసుకొని కూర్చోవలసి వచ్చేది. అప్పటి ప్రతీకార జ్వాల ఇప్పటివరకూ ఆరిపోకుండా మండుతూనే ఉన్నది సమయం కోసం ఎదురుచూస్తూ. ఇవేవీ తెలియని విశాలుడు మాత్రం చతురసింహుడి పట్ల అప్పుడూ ఇప్పుడూ ఒకే విధమైన స్నేహభావంతో ఉండేవాడు.

ఇప్పుడు చతురసింహుడి ఆలోచనేమిటంటే- విశాలుడిని పిలిపించి రాజుగారి ప్రశ్నకు సరైన సమాధానం చెప్పించగలిగితే రాజుకి తన పట్ల గౌరవం పెరుగుతుంది. ఒకవేళ విశాలుడు సంతృప్తికరమైన సమాధానం చెప్పలేకపోతే ఇప్పటివరకూ ఉన్న అతడి పేరుప్రఖ్యాతులు మట్టికొట్టుకుపోతాయి. ఎలా జరిగినా తనకే లాభం. తన తెలివితేటలకు తనే మురిసిపోయాడు చతురసింహుడు.

సమయం చూసుకొని మహారాజుతో విశాలుడి విద్వత్తు గురించి గొప్పగా పొగిడాడు. అతడు మీ సందేహాన్ని తీర్చగల సమర్థుడు అని చెప్పాడు. మహారాజు అతడిని పిలిపించడానికి వెంటనే అంగీకరించాడు. రాజదర్బారు నుండి ఆహ్వానం అందుకున్న విశాలుడు కొంచెం కంగారుపడ్డాడు. "రాజుగారు నన్నెందుకు పిలిపించినట్లు?" అని కళవరపడ్డా, రాజుగారి నీతి, నిజాయితీల మీద నమ్మకం ఉన్న విశాలుడు అంతలోనే స్థిమితపడ్డాడు. మరే ఆలోచనా లేకుండా దర్బారుకి వచ్చి తనను పరిచయం చేసుకున్నాడు. మహారాజు అతడిని సాదరంగా ఆహ్వానించి ఆసనం చూపించాడు. తర్వాత తన ప్రశ్న వినిపించాడు.

విశాలుడు ఇలా అన్నాడు- "మహారాజా! ఇక్కడ అనేకమంది మహాపండితులు ఉపస్థితులై ఉన్నారు. నేను సామాన్య అధ్యాపకుడను. వారిముందు నా తెలివితేటలు ప్రదర్శించబోవడం దుస్సాహసమే అవుతుంది. అయినప్పటికీ మీరు అడిగినందున నా అల్పబుద్ధికి తెలిసినంతవరకూ సమాధానం చెప్పడానికి ప్రయత్నిస్తాను. నా ఉద్దేశ్యంలో మనిషి కర్మకు దాసుడు కాదు. ఎలా జరగవలసి ఉందో అదంతా ముందే నిశ్చితమైఉంటే మానవుడి కార్యకలాపాలన్నీ యాంత్రికములై పోతాయి. అతడొక తటస్థప్రాణి లేదా నిమిత్తమాత్రుడు కన్నా అధికుడుగా మనలేకపోతాడు. వస్తు స్థితి అలా లేదు. మనిషి తన అదృష్ట దురదృష్టాలకు తానే నిర్మాత".

సభలోనివారంతా విశాలుడి మాటలను శ్రద్ధగా వినసాగారు. అంతకంతకూ అతని వాణి తీవ్రతను సంతరించుకొనసాగింది - "జీవితంలో ఎదురయ్యే అనేక సంఘటనలలో మనిషి సంఘర్షణకు గురి అవుతున్నాడు. అప్పుడు వ్యక్తి తన ఇచ్ఛానుసారం వివేకంతో ఒక మార్గాన్ని ఎన్నుకొనగల స్వతంత్రుడు. వివేకంతో మంచి నిర్ణయం తీసుకొనుట, మంచి మార్గాన్ని ఎన్నుకొనుట జరిగినప్పుడు దాని ఫలితం

**నమ్రత లేకపోతే విద్య పూర్తిగా సద్వినియోగం కాదు.**

మంగళకరమైనదిగా, ఆనందకరమైనదిగా ఉంటుంది. అవివేకంతో చెడు నిర్ణయం చేసినా, చెడుమార్గం ఎన్నుకున్నా దాని దుష్పరిణామం అనుభవించక తప్పదు. చెడుకు తనదైన ఆకర్షణ ఉంటుంది. వివేకవంతుడు దాని ఉచ్చులో పడకుండా తప్పించుకొని ఉన్నతపథగామి అవుతాడు. ఆ ఆకర్షణకు లోనైనవాడు పతనమనే గోతిలో పడతాడు. అయితే తన తప్పును దాచుకొనడానికై 'నా కర్మలో ఇలా రాసి పెట్టి ఉంది' - అని తప్పంతా కర్మమీదికి నెడతాడు. నిరంతర పరిశ్రమ, పురుషార్థం, వివేకం మొదలైన గుణాలతో మనిషి ఏకార్యమైనా సాధించగలడు.''

తన సందేహానికి చక్కటి సమాధానం దొరికినందుకు మహారాజు సంతోషించాడు. అతడి హృదయం సంతృప్తితో నిండిపోయింది. తన మెడలోని ముత్యాలహారాన్ని తీసి విశాలుడికి కానుకగా ఇచ్చాడు. విశాలుడు సంతోషంగా ఇంటికి వెళ్లాడు. అతడి భార్య ముత్యాలహారం చూసి ఎంతో మురిసిపోయింది.

కానీ చతురసింహుడి మనసు మాత్రం కుతకుతలాడిపోయింది. తను ఆశించిన దానికి పూర్తిగా వ్యతిరేకం జరిగింది. అవమానం పొంది సిగ్గుతో తలవంచుకుపోతాడనుకున్న వాడు అందరి ప్రశంసలూ పొందడమే కాక అమూల్యమైన ముత్యాల హారాన్ని కూడా పొందగలిగాడు. కనీసం ఆ ముత్యాలహారమైనా అతనికి దక్కకుండా చేస్తేగాని తన కడుపుమంట తీరదు - అని తలచి దానికోసం ఉపాయాలు వెదకసాగాడు చతురసింహుడు.

తన పథకం ప్రకారం ఒకరోజు రాత్రి దొంగతనంగా విశాలుడి ఇంట్లో చొరబడ్డాడు చతురసింహుడు. విశాలుడు, అతని భార్యా వసారాలో గాఢ నిద్రలో మునిగి ఉన్నారు. చప్పుడు కాకుండా గొళ్లెంతీసి గదిలోకి వెళ్లాడు. దీపం వెలుగులో అక్కడ బల్ల మీద చిన్న బరిణ కనపడింది. ముత్యాలహారం అందులో పెట్టి ఉంటారని తలచి పెట్టె మూత తీసి అందులో చెయ్యి పెట్టాడో లేదో కెవ్వున కేక వేశాడు. విశాలుడు, అతడి భార్య ఆ కేకకు ఉలిక్కిపడి నిద్రలేచారు. అంత రాత్రివేళ చతురసింహుడు తమ ఇంట్లో ఉండడం చూసి ఆశ్చర్యపడ్డారు.

"చతురసింహా ఇంత అర్ధరాత్రి ఇక్కడున్నావేమిటి? ఆ పెట్టె మూత ఎందుకు తీశావు? బహుశా అందులో ఉన్న ఎర్రతేలు నిన్ను కుట్టి ఉంటుంది. అందుకే అంత కేక పెట్టావు''- అన్నాడు విశాలుడు. విశాలుడు అడిగేదానికి బదులేమీ చెప్పలేక, తేలుకాటు భరించలేక గిలగిలలాడసాగాడు చతురసింహుడు. "పడుకోబోయే ముందు ఈ గదిలో తేలు కనపడింది. తెల్లవారాక అడవిలో వదిలి పెట్టిరావచ్చని కాళీబరిణ కనబడితే అందులో పెట్టి మూతవేశాను''- అని వివరించాడు విశాలుడు.

చతురసింహుడు విశాలుడి కాళ్లమీద పడ్డాడు. "నిన్న దర్బారులో నువ్వు చెప్పింది నిజం. ప్రతి మనిషీ తన అదృష్ట దురదృష్టాలకు తానే నిర్మాత. నా దుష్కర్మకి ఫలితం అనుభవిస్తున్నాను. నన్ను క్షమించు''- అన్నాడు పశ్చాత్తాపంతో. అతడి కళ్లనుండి కన్నీరు కారసాగింది. విశాలుడు అతడిని లేవదీసి "చతురసింహా! ముత్యాలహారం మీద నీకంత మక్కువ ఉంటే నాతో అనలేకపోయావా. సంతోషంగా దాన్ని నీకు బహూకరించి ఉండేవాడిని. రాజమార్గం వదిలిపెట్టి అవివేకంతో అడ్డదారిన నడిచావు. కోరి కష్టాలు తెచ్చుకున్నట్లయింది''- అన్నాడు అనునయిస్తూ.

చతురసింహుడు సిగ్గుతో తల ఎత్తలేకపోయాడు. అతడికి ఇప్పుడు బాగా అర్థం అయింది- మనిషి తన కర్మలను వివేకంతో తానే మార్పుచేసుకోగలడని.

అనువాదం : విజయకుమారి

## దృష్టి దోషం

ఒక బాటసారి కుటీరం వద్దకు వచ్చి మీ గ్రామ ప్రజలు ఎటువంటివారని సాధువుని ప్రశ్నించాడు. సాధువు రెట్టింపు కుతూహలాన్ని ప్రదర్శిస్తూ మీ గ్రామ ప్రజలు ఎటువంటివారని ఎదురు ప్రశ్న వేశాడు. బాటసారి తన గ్రామ ప్రజలు చాలా మంచివాళ్ళని అన్నాడు. అప్పుడు సాధువు మా గ్రామ ప్రజలు కూడా చాలా సజ్జనులని పలికాడు. మరికొంత సేపటికి మరొక బాటసారి వచ్చి ఇదే ప్రశ్న వేయటం, సాధువు తిరిగి అతనిని అలాగే ప్రశ్నించటం జరిగింది. కానీ ఈ బాటసారి తన గ్రామస్థులు చాలా చెడ్డవారని తెలిపాడు. సాధువు తన గ్రామస్థులు కూడా చెడ్డవారేనని తెలియజేశాడు. సాధువు ఇద్దరు బాటసారులకు చెరొక విధంగా తన అభిప్రాయాన్ని చెప్పటం కుటీరంలోని శిష్యులు విని, దీనికి కారణమేమని సాధువుని ప్రశ్నించారు. మన దృష్టికోణమే అంతటా దృష్టిగోచరమవుతుంది. ఈ బాటసారుల దృష్టికోణాన్ని బట్టే వారికి మన గ్రామస్థులు దర్శనమిస్తారు అని వారు తెలిసికోవటానికే వారితో చెరో విధంగా మాట్లాడవలసివచ్చినదని సాధువు శిష్యులకు తెలియచేశాడు.

- ప్రజ్ఞాపురాణం నుండి

**నమ్రతకు ప్రభావం హెచ్చు, ఖర్చు లేదు.**

## గాయత్రి విజ్ఞానం

# గాయత్రి సాకార ప్రతిమ యజ్ఞోపవీతం

యజ్ఞోపవీతాన్ని "బ్రహ్మసూత్రము" అని చెపుతారు. దారమును సూత్రము అంటారు. కాని ఆ సంక్షిప్త శబ్దాని కర్థము చాలా విస్తృతమైనది. వ్యాకరణ, దార్శనిక, ధర్మకాండ మొదలైన అనేక శాస్త్రములందు గ్రంథకర్తలు తమ మనోభావములను చాలా సంక్షిప్తంగా సంస్కృత వాక్యములలో పొందుపరచారు. ఆ సూత్రములపై సుదీర్ఘ విషయములు, టిప్పణులు (అర్థసహిత వ్యాఖ్యలు), విమర్శతో కూడిన భావార్థములు చేయబడినాయి. వీనివలన సూత్రములలో గూఢంగా ఉన్న అర్థము విపులీకరింపబడి ఉంది. బ్రహ్మసూత్రములో అక్షరము లేనప్పటికీ సంకేతము ద్వారా చాలా చెప్పబడినది. మూర్తులు, చిహ్నములు, చిత్రములు, అవశేషములు మొదలైనవాటి ఆధారంగా విస్తృతమైన మహత్తరమైన విజ్ఞానము ప్రాప్తిస్తుంది. వానిలో అక్షరములు లేనప్పటికి అవి చాలా విషయములను ప్రకటిస్తాయి. ఒకరు వేరొకరికి సైగతో తమ మనోభావములను ప్రకటించుకొనవచ్చు. ఆ సైగలో శబ్దముగాని, లిపి గాని ప్రయోగింపబడదు. యజ్ఞోపవీతము బ్రహ్మసూత్రమైనప్పటికీ అందులో మాటగాని, అక్షరలిపిగాని లేదు. అందులో ఒక విపుల వ్యాఖ్యానము నిండి ఉన్నది.

గాయత్రీ మంత్రము గురుమంత్రము. యజ్ఞోపవీత ధారణ సమయమున, వేదాధ్యయనారంభ సమయమున గాయత్రీ మంత్రము పఠించబడుతుంది. ప్రత్యేకంగా ద్విజులకు యజ్ఞోపవీతము ధరించుట ఎంత అవసరమో, గాయత్రీ మంత్రాన్ని తెలుసుకొనుట గూడా అంతే అవసరము, అనివార్యము. ఈ గాయత్రీ యజ్ఞోపవీతముల జత లక్ష్మి నారాయణ, సీతారాములు, రాధే శ్యామ్, ప్రకృతి - బ్రహ్మ, గౌరీ శంకర్, నర నారుల జంట లాంటిది. రెంటి సమ్మిశ్రముతోనే ఒక పూర్ణప్రమాణ మేర్పడుతుంది. స్త్రీ పురుషుల సమ్మేళనమును గార్హస్థ్యమని ఎటుల వ్యాఖ్యానిస్తామో, గాయత్రీ - ఉపవీతముల కలయిక అటులనే ద్విజత్వము. ఉపవీతము సూత్రమైతే, గాయత్రి దాని వ్యాఖ్యానము. రెండిటి ఆత్మలు ఒకదానితో ఒకటి పెనవేసికొని ఉన్నాయి.

యజ్ఞోపవీతములో మూడు దారము లున్నాయి. గాయత్రిలో మూడు చరణము లున్నాయి. 'తత్సవితుర్వరేణ్యం' ప్రథమ చరణము. 'భర్గోదేవస్య ధీమహి' ద్వితీయ చరణము. 'ధియో యోనః ప్రచోదయాత్' తృతీయ చరణము. మూడు తంత్రులకు తాత్పర్యమేమి?

ఉపవీతము (జంధ్యము)లో మూడు ముడులు ప్రథమంగా ఉంటాయి. మరి యొక బ్రహ్మగ్రంధి (ముడి) ఉంటుంది. గాయత్రిలో మూడు వ్యాహృతులు (భూర్భువఃస్వః) ఒక ప్రణవము (ఓం) ఉంటాయి. గాయత్రి ప్రారంభంలో ఉన్న ఓం కారము, భూః ర్భువః, స్వః, లకే తాత్పర్యమున్నదో, అదే యజ్ఞోపవీతమునకున్న మూడు గ్రంథుల సంకేతము.

ఈ మహా విజ్ఞానమును సరళ మొనరించుటకు దీనిని నాలుగు భాగములుగా విభజించవచ్చు.

1. ప్రణవము, ఆ మూడు వ్యాహృతులు అనగా యజ్ఞోపవీతము లోని నాలుగు తంత్రులు.
2. గాయత్రీ ప్రథమచరణము. అనగా యజ్ఞోపవీతపు మొదటి పేట.
3. రెండవ చరణము. అనగా రెండవ పేట.
4. మూడవ చరణము. అనగా మూడవ పేట.

యజ్ఞోపవీతమునకు మూడుపేట లుంటాయి.

**1. ప్రణవమునకు సంకేత మిది :** పరమాత్మ సర్వత్రా, సమస్త ప్రాణులలో ఉన్నాడు. అందువలన లోకసేవకై నిష్కామ భావనతో కర్మచేయవలెను. తన మనస్సును స్థిరంగా, శాంతముగా ఉంచుకొనవలె.

**2. 'భూః' కు తత్వజ్ఞాన మిది :** శరీరము ఎముకలతో తయారుకాబడిన పనిముట్టు మాత్రమే. కావున దానిపై అత్యధిక ఆసక్తి లేకుండా, ఆత్మబలము పెంపొందుటకు శ్రేష్ఠమార్గమైన సత్కర్మల నాశ్రయించవలె.

**3. 'భువః' కు తాత్పర్యము :** పాపకార్యములపట్ల విముఖుడైన వ్యక్తి దైవత్వాన్ని పొందగలడు. పవిత్రాదర్శములను, సాధనలను తనవిగా జేసికొన్న వ్యక్తి వివేకవంతుడు.

**4. 'స్వః' కు ప్రతిధ్వని :** వివేకముతో, నిర్మలమైన బుద్ధితో సత్యపదార్థమును తెలిసికొనుట, సంయమనము, త్యాగరీతులను స్వయంగా ఆచరించి ఇతరులను ప్రేరేపించవలె.

ఈ చతుర్ముఖ నీతిని యజ్ఞోపవీతధారి పాటించవలె. దీని

**అహంకారం దేవతను అసురుణ్ణి చేస్తుంది.**

సారాంశమేమనగా, ఉచిత మార్గంలో పయనించి నీ శక్తిని పెంపొందించుకో. అంతఃకరణమును ఉదారబుద్ధితో వశము కావించుకొని నీ శక్తులలో అధిక భాగమును ప్రజా హితముకొరకు వినియోగించు. ఈ కళ్యాణకరమైన నీతిని అవలంబించినందున మనుజుడు వ్యష్టి రూపంగాను, సమస్త ప్రపంచంలో సమష్టి రూపంలోను సుఖశాంతులను పొందగలడు. యజ్ఞోపవీతము గాయత్రీ ప్రతిమా స్వరూపము. వ్యక్తిగత, సామాజిక సుఖశాంతులు స్థిరంగా ఉండాలంటే, ఈ సందేశముతప్ప మనుష్యజాతికి వేరొకమార్గము లేదు.

దేవలోకములో ఒక కల్పవృక్ష మున్నది. దాని నీడలో విశ్రమించి నపుడు కోరిన కోరికలు వెంటనే తీరుతాయి. కావలసిన వస్తువులు లభిస్తాయి. ఆ కల్పవృక్ష మెవరివద్ద ఉంటుందో వారి సుఖమును, తృప్తిని అంచనా వేయలేము.

ఈ భూమిమీద కూడా ఒక కల్పవృక్ష మున్నది. దేవలోకపు కల్పవృక్షమువలె సమస్త వాంఛలు అందులో నిగూఢంగా ఉన్నాయి. దాని పేరు 'గాయత్రి'. గాయత్రీ మంత్రమును స్థూలదృష్టితో చూచిన యెడల అది 24 అక్షరములు, తొమ్మిది శబ్దముల శృంఖలము మాత్రమే. కాని గంభీరంగా సూక్ష్మదృష్టితో పరిశీలించినట్లయితే, దానిలోని ప్రతి శబ్దంలో, ప్రతి అక్షరములో తత్వములు, కల్పవృక్షము వద్ద ఉన్న అన్ని వాంఛలవలె, అన్నీ నిబిడీ కృతమై ఉన్నవి.

గాయత్రీ కల్పవృక్ష చిత్రములోని 'ఓం' ఈశ్వరుడు. అది భారతీయ ధర్మమునకు మూలమని చెప్పబడినది. దీని నుండి ముందుకు సాగితే, మూడు భాగములున్నవి. అవి 'భూః' 'భువః' 'స్వః'। 'భూః' అనుదాని కర్థము ఆత్మజ్ఞానము. 'భువః' అను పదమున కర్థము కర్మయోగము. 'స్వః' అనుదానికి తాత్పర్యము స్థిరత్వము, సమాధి. ఈ మూడు శాఖలలో నుండి ప్రత్యేకంగా మూడుశాఖలు వెలువడినాయి. వానికి ప్రత్యేకంగా తమతమ అర్థ ములున్నవి. 'తత్' జీవన విజ్ఞానము. 'సవితుః' అనగా శక్తి సంచయము. 'వరేణ్యం' - శ్రేష్ఠత్వము. 'భర్గో' - నిర్మలత్వం. 'దేవస్య' అనగా దివ్యదృష్టి. 'ధీమహి' - సద్గుణములు. 'ధియో' - వివేకము. 'యోనః' - సంయమము. ప్రచోదయాత్ - సేవ, మన మనోభూమిలో 'గాయత్రి' వీటిని నాటుతుంది. ఫలితంగా ఏ క్షేత్రములో అంకురిస్తుందో అది కల్పవృక్షము కన్న ఏ విధంగానూ తక్కువ కాదు.

కల్పవృక్షపు ఆకులు రత్న స్థగితమైనవని ఉల్లేఖింపబడినది. అవి రత్నములవలె సుశోభితమై బహు మూల్యవంతమైనవి. గాయత్రీ కల్పవృక్షములోని పైన పేర్కొనబడిన తొమ్మిది పత్రములు నిస్సందేహంగా నవరత్నములకు సమానంగా విలువగలిగినవి. ఒక్కొక్క పత్రము ఒక్కొక్క గుణము. రత్నము కన్న తక్కువది గాదు. నగలలో 'నవరత్న హారము' ప్రసిద్ధమైనది. తొమ్మిదిలక్షల రూపాయలు వెచ్చించి తయారు జేయబడిన హారమును ధరించిన వారు తాము గొప్ప భాగ్యశాలురమని తలపోస్తారు. ఏకంగా తాత్విక దృష్టితో పరికించితే యజ్ఞోపవీతము గూడా నవరత్న ఖచిత నవలక్ష హారమునకేమీ తీసిపోదు.

గాయత్రి గీత ప్రకారం యజ్ఞోపవీతపు తొమ్మిది దారములు గుణములను ధారణ జేయవలెనని ఆదేశిస్తాయి. నవరత్నములకన్న తొమ్మిది గుణములు అధిక శక్తి గలవని అది సందేశమిస్తుంది.

1. జీవన విజ్ఞానము తెలిసినపుడు జన్మ మరణముల రహస్యము బోధపడుతుంది. అతనికి మృత్యువంటే భయ ముండదు. ఎల్లపుడూ నిర్భయంగా ఉంటాడు. అతనికి సాంసారిక వస్తువులపై లోభ మోహము లుండవు. ఫలితంగా సంసార సాగరములో మునిగి హాని వృద్ధులకొరకై దుఃఖ మనుభవిస్తూ, సుఖ సంతోషముల మదంతో పొంగిపోకుండా రక్షింపబడతాడు.
2. శక్తి సంచయమును తనదిగా జేసుకొనే వ్యక్తి రోజురోజుకు స్వస్థత పొంది, విద్వాంసుడై, బుద్ధిమంతుడై, సహకార సంపన్నుడై, కీర్తి ప్రతిష్ఠలను పొందుతాడు. నిర్బలులపై ప్రకృతి, అటులనే బలవంతులపై దౌర్భాగ్యము ఆక్రమణ చేస్తాయి. వీటినుండి రక్షింపబడుటయేగాక శక్తి సంపన్నుడైనందున జీవితములోని నానా విధములైన ఆనందము లనుభవిస్తాడు. తన శక్తి ద్వారా దుర్బలులకు సహాయం చేసి పుణ్యములో భాగస్వామి అవుతాడు. శక్తి చాలినంత లేనపుడు మాత్రమే అవినీతి ప్రజ్వరిల్లుతుంది. శక్తి సమీకరణ స్వాభిమానపు పరిణామము. అవినీతి అంతరించుట సర్వులకూ కళ్యాణ కారకము.
3. శ్రేష్ఠత్వమునకు అస్తిత్వము పరిస్థితులలో లేదు. ఆలోచనలలో ఉన్నది. సాధన సంపన్నుడై పురోగమించిన వ్యక్తి అయి ఉన్నప్పటికీ లక్ష్యము, సిద్ధాంతము ఆదర్శము, అంతఃకరణల దృష్టిలో పతితుడైతే, అతనిని నికృష్టుడని నుడువవచ్చు. అట్టి నికృష్టుడు తన ఆత్మ దృష్టిలో, పరమాత్మ దృష్టిలో, వివేకవంతులైన వ్యక్తుల గంభీర దృష్టిలో నీచశ్రేణికి జెందినవాడుగా పరిగణింపబడతాడు. తన నీచత్వమునకు శిక్షగా ఆత్మ దండన, ఈశ్వరీయ దండన పొంది, బుద్ధి భ్రమించినందున మానసిక అశాంతిలో మునుగుతాడు. బీదవాడైనప్పటికీ, అతని ఆదర్శము, సిద్ధాంతము, ఉద్దేశ్యము,

**నమ్రత మనిషిని దేవతను చేస్తుంది.**

అంతఃకరణము ఉన్నతంగా ఉదారంగా ఉన్నట్లయితే, అతనిని శ్రేష్ఠుడని చెప్పవచ్చు. ఈ శ్రేష్ఠత్వము అతనికి అంతులేని ఆనందా న్నిస్తుంది. సాంసారిక సంపద ఎంత ఎక్కువ ఉన్నప్పటికీ ఆ ఆనందాన్ని పొందుట దుర్లభము.

4. నిర్మలత్వమునకు అర్థము సౌందర్యము. సౌందర్యమును కేవలము మనుష్యులే కాక, పశుపక్ష్యాదులు, క్రిమికీటకాలు కూడా గాఢంగా వాంఛించుతాయి. కురూపత్వమునకు కారణం మురికి అన్నది నిర్వివాదము. మలినత్వ మున్నచోట అసహ్య రూప ముంటుంది. అచట నుండి దూరంగా ఉండుట కందరూ ఇష్టపడతారు. శరీరం లోపల మలము నిండిఉన్నట్లయిన, వ్యక్తి బలహీనుడై రోగ గ్రస్తుడౌతాడు. వస్త్రములు, భోజనము, చర్మము. వెంట్రుకలు మొదలైన పదార్థములు మలినమైనచో అతడు అస్వస్థుడై, నికృష్టుడై, నిందనీయుడై ఏవగించుకోబడతాడు. మనస్సులో, బుద్ధిలో అంతఃకరణమందు మలినమున్న చెప్పుటకేమున్నది. మానవుని స్వరూపము పశువుకన్నా, పిశాచానికన్నా చెడిపోవడానికి ఆస్కారమున్నది. ఈ వికృత శక్తుల నుండి విముక్తి పొందడానికి ఏకైక మార్గము "సర్వతోముఖ నిర్మలత". అంతఃకరణ నిర్మలత, బాహ్య నైర్మల్యము ఉన్నవారి సంపాదన, ఆలోచనా విధానము, దేహము, వాక్కు, పోషణ, కుటీరము, అవసరమైన సామాగ్రి, నిర్మలంగా స్వచ్ఛంగా, శుద్ధంగా, సర్వసుందరంగా, ప్రసన్నంగా, ప్రఫుల్లంగా, మృదువుగా ఉంటాయి.

5. దివ్యదృష్టితో చూడడమనగా అర్థం - ప్రాపంచిక దివ్యతత్వములతో తాను సంబంధము కల్పించుకొనుట. ప్రతి వస్తువు స్వజాతి పదార్థమును తన వైపు ఆకర్షించుకొంటుంది. ఆ పదార్థము వైపు ఆకర్షింపబడుతుంది. ఒక వ్యక్తి దృక్పథము ప్రపంచంలోని మంచి విషయములను గమనించి, తెలిసికొని, తనవిగా చేసు కొనేందుకైనపుడు, అతడు అన్ని దిశలయందు మంచి వ్యక్తులనే చూస్తాడు. ప్రజోపయోగము కొరకు పెద్దమనిషి తరహాగా, సేవాభావంతో, సహకారము, సత్కార్యములపై మనస్సు హెచ్చుగా లగ్నం జేసినపుడు, ప్రజలలో చెడుకంటె మంచి ఉన్నదని గోచరిస్తుంది. ప్రపంచం మనకు అపకారంకన్న ఉపకారమే అధికంగా చేస్తుందనే భావము కలుగుతుంది. కండ్లకు ధరించిన కండ్లజోడు రంగే ప్రతివస్తువుపై ప్రసరించి, అన్నీ ఆ రంగే అనే భావము కలుగుతుంది. ఎవరి దృష్టి దోష భూయిష్టమో వారికి అందరూ, అంతా చెడుగా కనిపిస్తుంది. ఎవరు దివ్యమైన దృష్టితో పరిశీలించెదరో వారు పరమేశ్వరుని ఈ పరమపునీత ఉద్యానం సర్వతోముఖ ఆనందమే ఆనందము వర్షించడం దర్శిస్తారు.

6. **సద్గుణములు :** తనలో మంచి అలవాట్లను కలిగిఉండడం, ఉత్తమమైన అర్హతలు, ఉదాత్తమైన ఆధిక్యతలు కలిగి ఉండటాన్ని సద్గుణములని అంటారు. వినయము, నమ్రత, శిష్టాచారము, మధుర భాషణము, ఉదారంగా ప్రవర్తించడం, సేవా సహాయ భావములు, నిజాయితీ, పరిశ్రమ, శీలము, క్రమశిక్షణ, మితముగా వ్యయముజేయుట, కర్తవ్య పరాయణత్వము, ప్రసన్న ముఖముద్ర, ధైర్యము, సాహసము, పరాక్రమము, పురుషార్థములు, ఆశ, ఉత్సాహము మొదలైనవన్నీ సద్గుణములు, సంగీతము, సాహిత్యము, కళ, శిల్పము, వ్యాపారము, వక్తృత్వము, వ్యవసాయము, శ్రమించుట, శిక్షణ మొదలైన యోగ్యతలు కలిగి ఉండడం కూడా సద్గుణమే. ఈ సద్గుణములు గలిగిన వ్యక్తి ఆనందమయ జీవితాన్ని గడుపుతాడు. అతని కల్పనలన్నీ సహజంగా అమలు జరుగుతాయి.

7. **వివేకము :** వివేకము ప్రత్యేకమైన ఆత్మిక ప్రకాశము. వివేకమువలన సత్యాసత్యములు, ఉచితానుచితములు, అవశ్య అనావశ్యకములు, హాని లాభములు పరీక్షింపబడతాయి. ప్రపంచంలో అసంఖ్యాకమైన పరస్పర విరుద్ధ యోగ్యతలు, అలవాట్లు, ఆలోచనా విధానములు ప్రచారంలో ఉన్నాయి. ఇందులో ప్రతివాని వెనుక కొంత ఆధారము కొన్ని ఉదాహరణలు ఉన్నాయి. అటులనే కొన్ని గ్రంథములతో మహాపురుషుల నామములు జోడింపబడి ఉంటాయి. అటువంటి సమయాల్లో విరుద్ధమైన విషయములలో గ్రహింప దగిన దేది? విసర్జింప దగినదేది? అని నిర్ణయించుట బహుకఠినము, కష్టము. అదీకాక దేశకాల పరిస్థితులు, ఉపయోగము, ప్రజాహితము మొదలైనవి గుర్తించి సద్బుద్ధిచే నిర్ణయము గావింపవలె. అదియే సర్వులకు గ్రాహ్యము, ప్రమాణము. సరియైన నిర్ణయ మెవరు చేయగల్గుదురో వారు సులభంగా సుఖశాంతుల లక్ష్యమును చేరుకుంటారు. ప్రపంచంలో హెచ్చు కలహ, క్లేశ, పాప, దుఃఖములకు కారణం దుర్బుద్ధి, భ్రమ అజ్ఞానములై ఉన్నవి. వివేకవంతుడీ చిక్కులన్నీ సునాయాసంగా అధిగమించగలడు.

8. **సంయమనము :** జీవన శక్తిని, ఆలోచనా పరిధిని, భోగేచ్ఛను.

**నిన్నటికన్న నేడు మరింతగా నేర్చుకోవడం దినచర్య కావాలి.**

శ్రమను సరిగా నియమించుటయే సంయమనము. వీటిని నిరోధించకూడదు. వీటిని నష్టపరచకుండా నిరుపయోగము కాకుండా, అనుచిత మార్గములో వ్యయము కాకుండా ఉంచటము సంయమనము. మానవ శరీరం ఆశ్చర్యజనక శక్తులకు కేంద్ర స్థానము. ఆ శక్తులను వృధాకాకుండా సవ్యమైన ఉపయోగ దిశలో మళ్లించిన యెడల ఆశ్చర్యకరమైన ఫలితాలు వస్తాయి. జీవితానికొక ప్రత్యేక మార్గంలో అభివృద్ధి కలుగుతుంది.

9. **సేవ :** సహాయం, సహకారం, ప్రేరణ, అభివృద్ధివైపు ముందుకు సాగుట మొదలైనవన్నీ సేవలు. మన శరీరం, మన మస్తిష్కము అన్నిటికన్నా ఎక్కువ సేవా పాత్రమై ఉన్నవి. ఏలనన అవి మనకు చాలా సమీపాన ఉన్నవి. దాన మివ్వడం, సమయదానం చేయడం. ప్రతిఫల మాశించక తన శారీరక, మానసికశక్తుల నెవరికైనా ఉపయోగించడాన్ని 'సేవ' అంటారు. ఈ త్యాగంవల్ల ఇతరులలో క్రియాశక్తి, ఆత్మ నిగ్రహం, స్ఫూర్తి, ప్రేరణ, జాగృతి కలిగాయా లేదా అని ఆలోచించాలి. కొన్ని రకాలైన సేవలు ఇతరులలో సోమరితనం, పరావలంబన, ధన కాంక్ష కలిగించుటవలన అని హానికరమైన సేవలు. కావున మన సేవలు ఇతరులలో ఉత్సాహాన్నీ, ఆత్మవిశ్వాసాన్నీ, క్రియాశీలతనూ ప్రేరేపించి ఉత్తేజితుల నొనరించుటకు దోహదకారులు కావలె. సేవకు ఫలం - ఉన్నతి. సేవద్వారా తనకు, ఇతరులకు సమున్నతి కలుగుట, ప్రపంచము అధిక సుందరము ఆనందమయ మగుట మహా పుణ్యకార్యము. ఈ విధమైన సేవాభావముగల పుణ్యాత్ముడు ఆత్మదృష్టిలో సదా సుఖుడై సంతుష్టుడై ఉంటాడు.

ఈ తొమ్మిది గుణములు నిస్సందేహంగా తొమ్మిది రత్నాలు. మరకత, మాణిక్య, వజ్ర వైడూర్య, ముత్య, గోమేధిక, పుష్యరాగ, నీల, ప్రవాళశములను నవరత్నాలంటారు. ఈ నవరత్నా లెవరివద్ద ఉంటాయో వారు సర్వసుఖులై ఉంటారని నానుడి. కాని భారతీయ ఆధ్యాత్మిక శాస్త్ర ప్రవచనము - 'ఎవరి వద్ద యజ్ఞోపవీతము, గాయత్రీ మిశ్రిత నవరత్నాలుంటాయో అతడు సిరిసంపదలు, భూమి, ఆస్థులు లేనప్పటికీ, వర్తమానకాలపు కుబేరుడు. ఈ నవరత్న మండిత కల్పవృక్ష మెవరి వద్ద ఉన్నదో, ఆ వివేకయుక్త యజ్ఞోపవీతధారి సదా సుర లోకసంపద ననుభవిస్తాడు. అతనికీ భూలోకమే స్వర్గలోకము. ఆ కల్పవృక్షము నాలుగు ఫలములను ప్రసాదించుతుంది. ధర్మ, అర్థ, కామ మోక్షములను నాల్గు సంపదలతో మనలను పరిపూర్ణులను జేస్తుంది.

**గాయత్రీ సాధకులకు యజ్ఞోపవీతం అవసరం, ముఖ్యం.**

యజ్ఞోపవీతమును ధరించుట తమకు సాధ్యముకాదని, నిర్వహించ లేమని అనేకమంది తలుస్తారు. సంయమములను పాటించలేమని భావిస్తారు. ఇది "నా మనస్సులో ఈశ్వరభక్తి లేదు. కావున పూజ చేయను" అని అన్నట్లుగా ఉన్నది. పూజ చేయటం భక్తి కలుగుటకు. భక్తి ఉన్నట్లయితే పూజ చేయటం అనవసరం. ఇది యజ్ఞోపవీతం విషయంలో కూడా వర్తిస్తుంది. ధార్మిక నియమములను పాటించడం సహజంగా కలిగినట్లయిన యజ్ఞోపవీతము ధరించే ఆవశ్యకత ఎందుకు? నియమములు సమయానుకూలంగా నిర్వహించలేనివారు, యజ్ఞోపవీతము ఉన్నందున ఆ నియమములను పాటిస్తారు. నియమములు నిర్వహించలేనివారికి జంధ్యము తప్పక అవసరము. దానిని ధరించవలె. వ్యాధి గ్రస్తునకే ఔషధము అవసరము. వ్యాధి లేనపుడు ఔషధపు ఆవశ్యకత లేదు.

నియమముల నెందుకు అలవాటు కావించుకొనవలె? దీనిని గురించి ప్రజలకు చిత్రమైన ఆలోచన లున్నాయి. భోజన సమయములందు నియమములకు మాత్రమే జంధ్య మవసరమని పలువురు భావిస్తారు. ప్రయాణములో తీసుకువెళ్లిన, రాత్రి మిగిలిన ఆహారము, తమవారు కాక ఇతరులచే వండబడిన ఆహారమును భుజించకుండుట యజ్ఞోపవీత నియమమని పెక్కుమంది అభిప్రాయము. ఇది చాలా అసమంజసము. భ్రమతో కూడిన ఆలోచన. యజ్ఞోపవీత ఉద్దేశ్యము మానవ జీవితమునకు సర్వాంగపూర్ణ ఉన్నతిని కలుగజేయుట. ఈ విశిష్టతలలో సంపూర్ణ ఆరోగ్యముగూడ ఒకటై ఉన్నది. దానికోసం ఇతర నియమములను పాటించడంతో పాటు భోజనానికి సంబంధించిన నియమములను సావధానంగా అవలంబించుట ఉచితము. ఈ దృష్టితో జంధ్యము ధరించిన వ్యక్తి భోజనసంబంధమైన నియమములను పాటించుట మంచిది. కాని కొందరు ద్విజులు తమ జీవనంలో సర్వాంగీకారమైన ఉన్నత నియమములను పాటించుట లేదు. కాని భుజంపై జంధ్యాన్ని మాత్రం ధరిస్తారు. ఒకవేళ భోజనానికి సంబంధించిన విషయాలలో లోట్లు జరిగినంత మాత్రాన, జంధ్యాన్ని ధరించుటకు ఆ పొరపాట్ల వలన అధికారము కోల్పోయామని తలంపరాదు. అసత్య మాడినందువలన, దురాచారదృష్టి గలిగినందున, నిజాయితీ లేనందున, సోమరి అయినందున, వ్యసనగ్రస్తుడైనందున, జంధ్యాన్ని విసర్జించ నవసరము లేనపుడు, కేవలము భోజన నియమములలో అప్పుడప్పుడు కొంచెము ఉల్లంఘన జరుగుతుంది కావున దానిని విసర్జించవలెనని భావించుట సముచితము కాదు.

**జ్ఞాన, కర్మల సమన్వయం సమగ్రతకు సోపానం.**

మలమూత్రములు విసర్జించునపుడు జంధ్యము చెవులపై ఉంచుకొనుట మరచినపుడు భయం కలుగుతుంది. ఈ భయంవలన అనేకులు జంధ్యము ధరించరు. లేదా ధరించుట మానివేస్తారు. ఈ అలవాటు కఠోర నియమంగా పాటించవలెననేది నిజం. కాని, ప్రథమంలో అలవాటుపడేంతవరకు ఈ తొమ్మిది శిఖలకు కొంత సౌకర్యము కలుగవలె. అందువలన ఒక్కొక్కరోజు మూడుసార్లు జంధ్యములను మార్చవలసిన అవసరము కలుగుతుంది. అందువలన జంధ్యాన్ని కంఠానికి చుట్టుకొనవలె. అందువలన అది పైకి వస్తుంది. చెవులకు చుట్టుకొన్నందువలన మలమూత్రముల అశుద్ధ స్పర్శ దానికి కలుగదు. కంఠానికి చుట్టుకొన్నందున జంధ్యము నడుమునుండి పైకి వెళుతుంది. అందువలన ఒకవేళ చెవులకు చుట్టుకోవడం మరచినప్పటికి అశుద్ధ స్పర్శ కలుగదు. కొన్ని రోజులు అలవాటయితే కంఠానికి చుట్టుకోవలసిన అగత్యముకూడ ఉండదు.

చిన్న వయస్సుగల బాలురకోసం, మతిమరుపుగల వ్యక్తులకోసం మూడు పోగుల యజ్ఞోపవీతమును వ్యవస్థీకరించవచ్చు. అందుకనే మూడు మూడుపోగుల పేటలు. కావున ఆచార్యులు ఉపవీతమును 'కంఠీ' శబ్దముతో సంబోధిస్తారు. బాలురకు ఉపనయనము జరిగేటప్పుడు వారికి దీక్షతోపాటు 'కంఠీ' ధరింపచేస్తారు. ఈ రోజున పండితులు మెడకు కంఠీ ధరించి చెవిలో మంత్రము చెప్పి, గురుదీక్ష ఇస్తారు.

మనోపరిపక్వము చెందని వ్యక్తి యజ్ఞోపవీతమును నిత్యమూ శుభ్రపరచడం గురించి పూర్తిగా ధ్యానముంచడం మరచుట కద్దు. కావున శరీరానికున్న మలినం జంధ్యాని కంటుకుంటుంది. ఫలితంగా దుర్వాసన, మలినం, రోగక్రిములు అందులో చేరతాయి. ఆస్థితిలో 'కంఠీ' కంఠమును, శరీరాన్ని తక్కువ స్పృశించేటట్లు ఉపాయములు వెదకవలసి వస్తుంది. దీని నిమిత్తం తులసి పూసలు, రుద్రాక్షలు లేక ఇతర వస్తువుల గింజలు 'కంఠీ' దారానికి చుట్టబడతాయి. ఫలితంగా శరీరాన్ని స్పృశించుతాయి. స్వేదము అంటదు. అందువలననే పూసలున్న కంఠమాల ధరించవలె. ఏలనన ఉపవీతము గాయత్రికి మూర్తిమంతమైన ప్రతీక. దానిని ధరించకుండ 'భగవతి' సాధనమునకు ధార్మికాధికారము కలుగదు. నేడు క్రొత్త ఫాషనులలో ఆభరణములను ధరించడం తగ్గినది. కాని కంఠానికి మాత్రము కంఠమాలలు ఏరూపములోనైనా ధరించడం స్త్రీ పురుషుల కలవాటున్నది. పేద స్త్రీలు కంచు కంటెలు ధరిస్తారు. ఈ భూషణములను హారము, నెక్లెస్, మాల, కంటె మొదలైన పేర్లతో వ్యవహరిస్తారు. కాని వాస్తవంగా ఇవి "కంఠీలు'' మాత్రమే. ఇతర ఆభూషణములు ఉన్నా లేకున్నా, పేదస్త్రీలుకూడా ఏదోరూపంలో కంఠమాలను ధరించడం మాత్రం నిశ్చయము. దీనిద్వారా భారతదేశపు స్త్రీలు తమ సహజ ధార్మిక ప్రేమ ఏదో ఒక రూపంలో జీవించి ఉండే విధంగా ఉపవీతమును ఏదో ఒక రూపంలో ధరిస్తారు.

ఉపవీత ధారణకు అధికారులుకానివారు, ఏవిధమైన దీక్షను గ్రహించనివారు కూడా "మూడుపోగులు'' లేక "తొమ్మిది పోగులు'' ఉపవీతములను నాలుగు ముడులు వేసి ధరిస్తారు. ఈవిధంగా చిహ్నపూజ జరుగుతుంది. పూర్తి యజ్ఞోపవీతంలోని పొడవుగా ఉన్న ముడిని కంఠానికి తగిలించుకోవడం కూడ అక్కడక్కడ రివాజుగానున్నది.

☆ ☆ ☆

## స్వాభిమానానికి స్మారకం

70 సంవత్సరములు వయస్సు కల కుటుంబంలోని పెద్దమనిషిని ఒక చిన్న సాధారణ విషయానికి మిగిలిన కుటుంబ సభ్యులంతా అవమానించారు. నేత్రహీనుడు, స్వాభిమాని అయిన ఆ వ్యక్తి ఆ అవమానాన్ని సహించలేకపోయాడు. ఇల్లు వదలిపెట్టి న్యూజిలెండు లోని ఒక బస్తీలో తన మస్తిష్కంలో నిర్మించి ఉంచుకొన్న ఒక మంచి భవనాన్ని నిర్మించటం ప్రారంభించాడు. మొత్తం పనులన్నిటికి తానే ప్రధాన పాత్ర వహించి రెండున్నర సంవత్సరములు అవిశ్రాంతంగా కృషి చేశాడు. చివరకు అతనిద్వారా ఒక దివ్యమైన, భవ్యమైన భవనం నిర్మించబడింది. పెద్ద పెద్ద ఇంజనీర్లు కూడా ఇంత చక్కగా ప్లాను గీయలేనంతగా చూపరులను అది ఆకట్టుకోసాగింది. ఇప్పటికీ ఆ భవనం చూచి జనం అవాక్కయి విశ్చేష్టులుగా నిలబడిపోతారు. ప్రస్తుతం ఈ భవనం న్యూజిలెండు ప్రభుత్వ సంపదగా పరిగణించబడుతోంది. వారు దీన్ని ప్రదర్శనకు సురక్షితంగా ఉంచివేశారు. ఆ భవనం ముందు నిలబడినవారెవరైనా తమకు తెలియకుండానే ఆ నిర్మాణకర్త చరణాలకు శ్రద్ధాంజలి ఘటించకుండా ఉండలేరు. ఈ మహా కళాకారుని పేరు ఫ్రాన్సిస్ ఎ.పర్డెట్! స్వాభిమానం దెబ్బతినగానే వ్యక్తితో జాగృతమైన మహాశక్తి గొప్ప కళాకారునిగా అతన్ని అమరుణ్ణి చేసింది.

- ప్రజ్ఞాపురాణం నుండి

**దాన గుణంలా - సంస్కరణ మన ఇంటితో మొదలు కావాలి.**

## శతసూత్ర కార్యక్రమం: 31-40

# ధర్మదీక్షను రగిలించే పథకం

జ్ఞానం అమృతమని ఉపనిషత్తులు ఉద్ఘాటించాయి. సక్రమంగా జీవించడానికీ, సరైన దృక్పథాన్ని అవలంబించడానికీ ప్రేరణ ఇస్తూ ఉండడం, శ్రద్ధను స్థిరంగా నిలపడం- ఇదీ జ్ఞానం చేసే పని. జ్ఞానం పొందిన మనిషి జన్మ ధన్యం అవుతుంది. విద్య ప్రయోజనం కూడ జ్ఞానాన్ని పొందడమే. సద్ జ్ఞానాన్ని విద్య అనీ, దీక్ష అనీ పిలుస్తారు. ఈ సంపదను పొందినవారికి మరేదీ పొందవలసిన అవసరం ఉండదు. జీవితంలో జ్ఞానాన్ని ఎలా పొందాలో, ఎలా విస్తృత పరచుకోవాలో తెలిపే కార్యక్రమాలు కొన్నిటిని దిగువ ఇస్తున్నాం.

**ఆస్తికత్వంపై నమ్మకం -** ఆస్తికత్వంపై ప్రగాఢ విశ్వాసాన్ని మనస్సులో స్థిరపరచుకోవడంవల్ల మనిషి అనేక దుష్కర్మలకు దూరం అవుతాడు. అతడి ఆంతరిక ప్రగతి సన్మార్గంవైపు మళ్లుతుంది. పరమాత్మ సర్వవ్యాపి, న్యాయనిర్ణేత అని నమ్మడంవల్ల రహస్యంగా పాపం చేయడం కష్టం అవుతుంది. రాజ్యదండననుండి మనిషి తప్పించుకోవచ్చు. సర్వజ్ఞుడైన పరమేశ్వరుని దండననుండి తప్పించుకోవడం ఎంత జిత్తులమారికి అయినా అసాధ్యం. ఈ నమ్మకం స్థిరంగా ఉంటే, వ్యక్తి పెడదారి పట్టడు. మంచి పనులద్వారా పరమేశ్వరుణ్ణి ప్రసన్నం చేసుకోవడానికీ, ఆయన కృపను పొందడానికీ ప్రయత్నిస్తూ ఉంటాడు. వ్యక్తిగత జీవితాన్నీ, సామాజిక జీవితాన్నీ సుఖ శాంతులతో నింపే మహత్తర సాధనం ఆస్తికత్వం. కనుక దీనిని తన అంతఃకరణ లోతులలో స్థిరపరచుకోవడానికి ప్రతి వ్యక్తీ ప్రయత్నించాలి.

మనకు ఎన్ని ముఖ్య కార్యక్రమాలు ఉన్నప్పటికీ- ఉదయం నిద్ర లేచినపుడూ, రాత్రి నిద్రపోయేముందు కనీసం 15-15 నిమిషాలపాటు సర్వశక్తిమంతుడూ, న్యాయనిర్ణేత అయిన పరమాత్మను మనం ధ్యానం చేయాలి. మంచి ఆలోచనలకూ, మంచి పనులకూ ప్రేరణ ఇవ్వవలసిందిగా ఆయనను ప్రార్థించాలి. ఈ మాత్రం ఉపాసనను ప్రతి వ్యక్తీ తప్పకుండా చేయాలి. మరింతగా సౌకర్యం, శ్రద్ధ ఉన్నవారు ప్రతిరోజూ నియమపూర్వకంగా స్నానం చేసి ఉపాసనా స్థలంలో గాయత్రీ మహామంత్రాన్ని జపించాలి. ఇతర దేవతలను పూజించేవారుకూడ గాయత్రీ మంత్రజపం తప్పకుండా చేయాలి. అందువల్ల ఆత్మిక ప్రగతిలో ఎంతో సహాయం అందుతుంది.

**స్వాధ్యాయ సాధన -** జీవన నిర్మాణానికి తగు ప్రేరణ ఇచ్చే సత్సాహిత్యాన్ని నిత్యం నియమబద్ధంగా చదవాలి. స్వాధ్యాయాన్ని సాధనలో అంతర్భాగంగా పరిగణించాలి. కొంత సమయాన్ని నియమితంగా దానికోసం కేటాయించాలి. చెడు ఆలోచనలను అణచివేయడానికై ప్రతిరోజూ సదాలోచనలతో సత్సంగం చేయడం అవసరం. వ్యక్తులతో సత్సంగం కష్టం. కనుక, సత్సాహిత్యంద్వారా ప్రపంచం అంతటిలోని జీవించి ఉన్న, మరణించిన సత్పురుషులతో సత్సంగం చేయవచ్చు. ఇది జీవితానికి మహత్తర ప్రయోజనం చేకూర్చుతుంది. దీనికి ఎవరూ దూరం కాకూడదు. చదువుకోనివారు ఇతరులచేత సత్సాహిత్యాన్ని చదివించుకుని వినే ఏర్పాటు చేసుకోవాలి.

**సంస్కారం పొందిన జీవితం -** వివిధ సమయాలలో జీవితాన్ని సంస్కరించేందుకై హిందూ ధర్మంలో 16 సంస్కారాల మహత్తర వ్యవస్థ ఉన్నది. ఉత్సాహపూరితమైన కుటుంబ వాతావరణం మధ్య క్రమబద్ధంగా జీవించేందుకు మనీషులు ఈ సంస్కారాలద్వారా శిక్షణ ఇస్తారు. అగ్నిదేవుడు సాక్షిగా, ఇతర దేవతలు సాక్షులుగా ఈ నియమాలను పాటిస్తానని వ్యక్తిచేత ప్రతిజ్ఞ చేయిస్తారు. కనుక దాని ప్రభావం గాఢంగా ఉంటుంది. పుంసవనం, నామకరణం, ముండనం, అన్నప్రాశన, విద్యారంభం, ఉపనయనం, వివాహం, వానప్రస్థం, అంత్యేష్టి మున్నగు సంస్కారాల కర్మకాండ ఎంతో శిక్షణను, ప్రేరణను ఇస్తుంది. ఈ సంస్కారాలను పద్ధతి ప్రకారం జరిపితే, వ్యక్తిపై దాని ప్రభావం అద్భుతంగా ఉంటుంది.

దురదృష్టమేమంటే- ఈ సంస్కారాల కర్మకాండ కేవలం ఒక తంతుగా మిగిలిపోయింది. వీటికోసం ఖర్చు భారీగా చేస్తారు. ప్రేరణ ఏమాత్రం లభించదు. మనం సంస్కారాల ప్రాముఖ్యాన్ని గుర్తించాలి. ఆయాకర్మలు చేసే పద్ధతిని నేర్చుకోవాలి. సంస్కారాలను తిరిగి ప్రసారం చేయాలి. కనీసపు ఖర్చుతో అత్యధిక ప్రేరణ ఇచ్చే విధంగా, అందరికీ అందుబాటులో ఉండేవిధంగా ఈ సంస్కారాల కర్మకాండను రూపొందించాలి.

**పండుగల సందేశం -** సంస్కారాలద్వారా వ్యక్తిగతమైన నైతిక శిక్షణ లభిస్తుంది. అలాగే, పండుగలద్వారా సామాజిక వ్యవస్థను సక్రమంగా నిలిపి ఉంచే శిక్షణ లభిస్తుంది. ప్రతి పండుగలో ఒక మహత్తరమైన ఆదర్శం, సందేశం ఇమిడి ఉన్నాయి. వాటిని హృదయంలో పదిలపరచుకుంటే సామాన్య ప్రజలు తమ సామాజిక బాధ్యతలను సరిగా గుర్తించగలుగుతారు. వీటిని పాటించేందుకు ప్రేరణ లభిస్తుంది.

పండుగలను సామూహికంగా జరిపేందుకు తగు కార్యక్రమాలను రూపొందించాలి. వాటిలో పాల్గొనడానికి ఆకర్షణ, కోరిక జనించేవిధంగా వాటి కర్మకాండను రూపొందించాలి. పండుగ సందర్భంగా ప్రజలంతా సమావేశం కావాలి. ఆ పండుగ సందేశాన్ని

**అపహాస్యం, వ్యతిరేకత సంస్కర్తకు బహుమతులు.**

వివరిస్తూ పురోహితులు ప్రవచనాలు ఇవ్వాలి. ఆ సందేశంలో ఏయే ప్రవృత్తులకు ప్రేరణ ఉన్నదో, ఆయా ప్రవృత్తులకు ఏదో ఒక విధంగా ఆచరణ రూపం ఇవ్వడంకూడ ఆ కర్మకాండలో అంతర్భాగం కావాలి.

సంస్కారాలను ఎలా ఇవ్వాలో, పండుగలను ఎలా జరిపించాలో, వాటిలో పాల్గొన్నవారికి ఏమి నేర్పాలో- ఇదంతా "కర్మకాండ భాస్కర" గ్రంథంలో ఉంది. వాటిని నేర్చుకుని, మన క్షేత్రాలలోని ప్రజలకు ఆ పుణ్య ప్రక్రియల ప్రయోజనాన్ని మనం చేకూర్చవలసి ఉంది.

**జన్మదినోత్సవం -** ప్రతివ్యక్తికీ జన్మదినోత్సవం జరపాలి. ఆ సందర్భంలో బంధువులూ, స్నేహితులూ అతడికి అభినందనలూ, శుభాకాంక్షలూ అందించాలి. ఒక చిన్న జన్మదినోత్సవసభ జరపాలి. ఆ వ్యక్తి ఆత్మపరీక్ష చేసుకుని, శేష జీవితాన్ని మరింత ఆదర్శప్రాయంగా మలచుకునేందుకు ఆ సందర్భంగా అతడు చర్యలు తీసుకోవాలి. అభినందనలు తెలిపే వ్యక్తులు అతడిని అందుకు ప్రోత్సహించాలి. ప్రతి జన్మదినం జీవన శోధనకు ప్రేరణ ఇచ్చే పర్వదినంగా రూపొందేందుకు అనువైన సంప్రదాయాలను అమలు జరపాలి.

**వ్రతశీలతలో శిక్షణ -** ప్రతి వ్యక్తీ వ్రతశీలుడు, వ్రతధారి కావడానికై వ్రత ఉద్యమాన్ని ప్రారంభించాలి. భోజనం, బ్రహ్మచర్యం, ధన సంపాదన, దినచర్య, ఖర్చుకు బడ్జెట్‌ను రూపొందించడం, స్వాధ్యాయం, ఉపాసన, వ్యాయామం, దానం, నిద్రించడం, నిద్రలేవడం- ఇలాంటి ప్రతి పనినీ నిర్ణయించి, దానిని అక్షరాలా పాటించవలసిన అవసరం ప్రతివ్యక్తికీ అనుభవమయ్యే విధంగా ప్రజాశిక్షణ జరగాలి. చెడు అలవాట్లను క్రమంగా తొలగించుకోవడం, సద్గుణాలను నిరంతరం పెంచుకుంటూపోవడంకూడ ఈ ఉద్యమంలో అంతర్భాగం కావాలి. సాధనతో, సంయమనంతో, కట్టుబాట్లతో నిండిన జీవితాన్ని జీవించే కళను ప్రతి వ్యక్తికీ నేర్పాలి. అపుడు వ్యక్తులు ప్రగతిశీలురు అవుతారు.

**ప్రేరణ కేంద్రాలుగా దేవాలయాలు -** నైతిక, ధార్మిక ప్రవృత్తులకు కేంద్రాలుగా దేవాలయాలను, మఠాలను తీర్చిదిద్దాలి. ఆలయాలలో, మఠాలలో వయోజన పాఠశాలలు, రాత్రి పాఠశాలలు, హరికథలు, భజనలు, ప్రవచనాలు, ఉపదేశాలు, పండుగల సామూహిక నిర్వహణ, ఉపనయనం, ముండనంవంటి సంస్కారాలు, ఆసుపత్రి, గ్రంథాలయం, సంగీతం, విద్య, ఆసనాలు, ప్రాణాయామం, వ్యాయమాల ఏర్పాటు, వ్రత ఉద్యమం, యుగ నిర్మాణానికి సంబంధించిన వివిధ కార్యక్రమాలు జరిపించాలి. భగవంతుణ్ణి సేవించే, పూజించే వ్యక్తులు తమ మిగులు సమయాన్ని ఆలయాలను ధార్మిక ప్రవృత్తుల కేంద్రాలుగా చేసి, వాటిని నిర్వహించడానికి వినియోగించాలి. దైవ విగ్రహానికి హారతి, పూజ, నైవేద్యం సమర్పించడంవలె ప్రజాసేవా కార్యక్రమాలనుకూడ యజ్ఞాలుగా పరిగణించాలి. ఆలయాలు ఉపాసనతోపాటు ధర్మసేవకు కేంద్రాలుగా రూపొందాలని ఆలయాల నిర్వాహకులకూ, కార్యకర్తలకూ నచ్చజెప్పాలి.

**యుగనిర్మాణ జ్ఞాన మందిరాలు -** ప్రతిచోటా జ్ఞాన మందిరాలను నిర్మాణం చేయాలి. సద్భావనకూ, సత్ప్రవృత్తికీ ప్రతీక అయిన గాయత్రీమాత భవ్య చిత్రాన్ని ఈ మందిరాలలో స్థాపన చేయాలి. ఈ మందిరాలలో ఉదయం, సాయంత్రం పూజ, హారతి, భజన జరగాలి. ఆ విధంగా దేవాలయాలలోని ధార్మిక వాతావరణం ఈ మందిరాలలో నిర్మాణం కావాలి. ఈ మందిరాలలో గ్రంథాలయాలూ, పఠనాలయాలూ ఉండాలి. సభ్యులు రోజూ కలుసుకోవడానికీ, చదువుకోవడానికీ వ్రాసుకోవడానికీ, ఆలోచనలు పంచుకోవడానికీ, నిర్మాణాత్మక కార్యక్రమాల నిర్వహణకూ ఈ మందిరాలు కేంద్రాలు కావాలి.

**సాధువులు, బ్రాహ్మణుల కర్తవ్య పాలన -** పండితులుగా, పురోహితులుగా, మత గురువులుగా, పూజారులుగా, సాధువులుగా, హరికథకులుగా మతం పేరిట బ్రతుకు దెరువు సాగిస్తున్న వ్యక్తుల సంఖ్య భారతవర్షంలో 80 లక్షలకు మించి ఉన్నది. ప్రజా సేవ చేయడానికీ, ధార్మిక ప్రవృత్తులను వ్యాప్తి చేయడానికీ వీరికి ప్రేరణ ఇవ్వాలి. క్రైస్తవమతంలో సుమారు లక్షమంది పాదరీలు ఉన్నారు. వీరి ప్రయత్నాల ఫలితంగా ప్రపంచ జనాభాలో సుమారు మూడవవంతుమంది క్రైస్తవులుగా మారారు. మన దేశంలో లక్షలాదిగా సాధు సన్యాసులు ఉన్నప్పటికీ, హిందూ మతాన్ని అనుసరించేవారి సంఖ్య, ఉత్కృష్టత రోజురోజుకూ తగ్గిపోతూ ఉండడం విచారకరం. కాలంతోపాటు మారాలనీ, ప్రజలనుండి అందుతూన్న ఆదరాభిమానాలకూ, సాధన సంపత్తులకూ బదులుగా కొంత ప్రత్యుపకారం చేయాలనీ వీరికి నచ్చజెప్పాలి. ఆడంబరాల పేరుతో ఇంత పెద్ద సంఖ్యలో ఉన్న వర్గం సమయాన్నీ, ధనాన్నీ వృధాచేయడం జరగనివ్వకూడదు. ఈ ప్రయత్నం సఫలం కాకపోతే, ధర్మ ప్రసార బాధ్యతను మనం కలసికట్టుగా మన భుజాలపై వేసుకొని ధార్మిక ప్రవృత్తులను అగ్రగాములుగా చేయడానికై మనలో ప్రతిఒక్కరూ కొంత సమయాన్ని నియమితంగా ఇవ్వాలి.

**వానప్రస్థుల నిర్మాణం -** కుటుంబ బాధ్యతలను తీర్చుకున్నవారు, ఉద్యోగ విరమణ చేసినవారు, కుటుంబ నిర్వహణకు తగినంత సాధన సంపత్తి కలిగినవారు తమ సమయంలో అత్యధిక భాగాన్ని సమాజసేవకు, పారమార్థిక కార్యకలాపాలకు వినియోగించేందుకై వారికి తగు ప్రేరణ ఇచ్చే ప్రయత్నం జరగాలి. వానప్రస్థ ఆశ్రమాన్ని పాటించే సంప్రదాయం నేడు లోపించిపోయింది. దానిని తిరిగి నెలకొల్పాలి. వయసుమళ్లిన తర్వాత గృహస్థ బాధ్యతలనుండి విముక్తి పొంది, వ్యక్తులు ఇంటిలో ఉంటూనే ప్రజాసేవకు అధిక సమయం కేటాయించాలి. సాధు సన్యాసుల, బ్రాహ్మణ-పురోహితుల బాధ్యతలను వీరు నిర్వహించగలుగుతారు. యుగ నిర్మాణానికై వానప్రస్థ సంప్రదాయాన్ని పునరుద్ధరించడం అత్యావశ్యకం.

***

**ఆత్మజ్ఞానం కోసం ఇంటిని కాక - ఆసక్తిని వదలాలి.**

# యుగ గీత

## యజ్ఞాల ద్వారా పాపనాశనం

*(గత సంచిక తరువాయి)*

శ్రీకృష్ణ భగవానుడు 12 రకాల యజ్ఞాలను ప్రస్తావించడంద్వారా వివిధ ప్రవృత్తులు కలిగిన మనుషులు పరమసత్తాను చేరుకోవడంకోసమై వివిధ ప్రక్రియలను పేర్కొన్నారు. కొందరు యోగులు దేవతల ప్రీతికోసం యజ్ఞాలు చేస్తారని ఆయన చెపుతున్నారు. దేవ యజ్ఞం అంటే- దేవశక్తులనే ట్రాన్స్‌ఫార్మర్‌ద్వారా పరమాత్మ అనే పవర్‌హౌస్‌కు చేరుకోవడం. దేవతలను సంతృప్తిపరచి పరమాత్మ చేతనతో సంబంధం ఏర్పరచుకోవడం. దేవయజ్ఞం చేసేవారు వివిధ రూపాలుగా, శక్తులుగా భగవంతుణ్ణి భావన చేస్తారు.

మరికొందరు ఆత్మనియంత్రణ, ఆత్మసంయమనాల రూపంలో ఆంతరిక యజ్ఞం చేస్తారు. దానివల్ల ఏకాత్మభావం లభిస్తుంది. ఆత్మజ్ఞానం లభిస్తుంది. (1,2)

కొందరు యోగులు ఇంద్రియ విషయాలను గ్రహిస్తారు. అయితే, ఈ ఇంద్రియ వ్యాపారాలవల్ల మనస్సు క్షోభ చెందకుండా చూస్తారు. అవి మనస్సును ప్రభావితం చేయకుండా చూస్తారు. ఇంద్రియాలనే విశుద్ధమైన యజ్ఞాగ్నిగా చేస్తారు (3,4,5). ఇది ఒక సాధన. దీనిలో ఇంద్రియాలను స్తబ్దంగా ఉంచుతారు. అందువల్ల అంతరాత్మ మనస్సునుండి వెలికివచ్చి, తన విశుద్ధ శాంత స్వరూపంలో తనను తాను వ్యక్తం అవుతుంది.

సిద్ధి సాధకులైన యోగులు ద్రవ్యరూపంలో ఆహుతి ఇవ్వవచ్చు. ద్రవ్య యజ్ఞం అనగా- పారమార్థిక భావంతో చేసే దానం. సత్రాలు నిర్మించడం, గోశాలలు స్థాపించడం, నేత్రదాన యజ్ఞం, బాధానివారణ కార్యాలు, అవిద్యను తొలగించడం, పతనాన్ని అరికట్టడం మున్నగువాటిని పారమార్థిక భావంతో చేయడం ద్రవ్య యజ్ఞం. యజ్ఞ కుండంలో ద్రవ్యాలను ఆహుతులుగా వేయడం ద్రవ్య యజ్ఞమని ఎవరూ భ్రమించకూడదు (6).

యజ్ఞం తపో యజ్ఞంకూడ కావచ్చు. ఒక మహత్తర లక్ష్యం కోసం ఆత్మ సంయమనంతో చేసే యజ్ఞం తపోయజ్ఞం. సంయమనాన్ని పాటించి, చేతనను క్షాళనచేసి, పరమాత్ముని విరాట్ చేతనను తన వ్యక్తిత్వంద్వారా ప్రవహించనివ్వడం తపో యజ్ఞం (7).

మరొకటి యోగ యజ్ఞం. భగవానుడు ఆరవ అధ్యాయం చివరి శ్లోకంలో **"తపస్విభ్యోఽధికో యోగీ...."** అంటూ యోగానికీ, తపస్సుకూ ఉన్న తేడాను అత్యంత సూక్ష్మంగా తెలియజేశారు. యోగ యజ్ఞం అనగా- యోగాగ్నిలో కర్మ సంస్కారాలను దగ్ధం చేయడం. శ్రేష్ఠ యోగులైన సాధకులు తమ కర్మలను మాత్రమే కాక, తమనుకూడ యోగాగ్నిలో భస్మంచేసి, బ్రహ్మలోకాన్ని పొందుతారు. శ్రీరామచంద్రుణ్ణి కలుసుకుని జ్ఞానం పొందిన తర్వాత శబరి తనను యోగాగ్నిలో చేర్చుకుని పరమ చేతనతో తాదాత్మ్యం పొందింది. సతీదేవి యోగాగ్నిలో భస్మంకావడం ప్రసిద్ధమైన విషయమే. జీవించి ఉంటూ యోగి అయి తన కర్మ-వాసనలను, సంస్కారాలను భస్మం చేయడం యోగ యజ్ఞం. యోగంలోని మొదటి పని వ్యక్తి అంతర్ముఖుడు కావడం.ఇంద్రియాలను మనస్సువైపుకు మళ్లించడం. సంయమనం అనే అగ్నిలో హవనం చేయడం. సంయమనం అంటే దమనం కాదు. అణచివేయడం కాదు. సంయమనం అంటే-పూర్తి బుద్ధి జ్ఞానములతో చేసిన కర్మ. పూర్తిగా మెలకువతో ఉండి, మనస్సును చంచలత్వం వైపునుండి లోపలివైపునకు మళ్లించడం (8).

మరొకటి స్వాధ్యాయ యజ్ఞం. తనకుతాను ప్రశిక్షణ పొందడం, అధ్యయన ప్రక్రియ- ఇది స్వాధ్యాయ యజ్ఞం(9).

రాజయోగులు, హఠయోగులు చేసే ప్రాణాయామంవంటి యోగములుకూడ యజ్ఞములే (10,11,12).

పై యజ్ఞముల వివరణను తెలుసుకున్న తర్వాత యోగేశ్వరుడైన శ్రీకృష్ణుని మౌలిక బోధనను తెలుసుకుందాం.

విషయాలను ఇంద్రియాలలో హవనం చేయాలి. ఇంద్రియాలను మనస్సులో, మనస్సును చిత్తంలో. చిత్తంను అహంలో, అహంను ఆత్మలో హవనం చేయాలి. శుద్ధమూ, నిరంజనమూ, శుద్ధ బుద్ధ అయిన ఆత్మలో ఈ విధంగా హవనం కావడంతోనే అశుద్ధులు, మాలిన్యములు కాలిపోవడం ప్రారంభం అవుతుంది. ఊర్ధ్వగమనం (ఎగువకు పయనించడం)

**అందిన బాధ్యతను గౌరవప్రదంగా నిర్వహించడం మనిషికి పరమ కర్తవ్యం.**

ప్రారంభం అవుతుంది. అనంతంతో తాదాత్మ్యం పొందే పరిస్థితులు ఏర్పడతాయి.

ఈ విధంగా యజ్ఞంలోని రహస్యాన్ని తెలుసుకున్న సాధకులందరూ యజ్ఞములద్వారా పాపాలను నాశనం చేస్తారు. (యజ్ఞక్షపిత కల్మషః) అని భగవానుడు 30వ శ్లోకంలో చెపుతున్నారు. మనమంతా యజ్ఞాలు చేస్తూనే ఉన్నాం. కాని యజ్ఞాన్ని గుర్తించడం లేదు. గుర్తించినా అర్థంచేసుకోవడం లేదు. బాహ్య ప్రక్రియనే సర్వస్వంగా పరిగణిస్తే మనకు ఏదీ లభించదు. యజ్ఞంలోని జ్ఞాన విజ్ఞానాలను అర్థం చేసుకోకుండా, దానిలోని జ్ఞానయజ్ఞ రహస్యాన్ని తెలుసుకోకుండా చేసే యజ్ఞం వట్టి అగ్నిహోత్రం అవుతుంది. వాస్తవానికి - యజ్ఞం ప్రతి శ్వాసలో, జీవితంలోని ప్రతి పనిలో, ప్రతి ఆలోచనలో నిర్వహించబడే దివ్య కర్మ.

యజ్ఞంనుండే సృష్టి ఉత్పన్నం అయినదని భగవానుడు మూడవ అధ్యాయంలోని 11-15 శ్లోకాలలో వివరించి ఉన్నారు. **"యజ్ఞో వై శ్రేష్ఠతమం కర్మ"** అని శాస్త్రం (శతపథ బ్రాహ్మణం) చెపుతోంది. అనగా- అత్యంత శ్రేష్ఠంగా చేసే కర్మయే యజ్ఞం.

పరమపూజ్య గురుదేవులు యజ్ఞానికి పునర్ ప్రతిష్ఠ చేశారు. అంతకుముందు యజ్ఞం కర్మకాండకే, పేరు ప్రతిష్ఠలూ, సిరిసంపదలూ కలిగి ఉన్న వ్యక్తులకే పరిమితమై ఉండేది. గురుదేవులు యజ్ఞాన్ని ప్రజలలోకి తీసుకువెళ్లారు. ప్రతి వ్యక్తీ తన సామర్థ్యానికీ, యోగ్యతకూ అనుగుణంగా యజ్ఞం చేయగలిగేవిధంగా దానిని సులభతరం చేశారు. 'యజ్ఞ' ధాతువుకు మూడు అర్థాలు ఉన్నాయి- దానం, దేవపూజనం, సంగతికరణం. గురుదేవులు ఈ మూడింటికీ యుగానికి అనుగుణమైన వ్యాఖ్య చేశారు. ప్రజలలోని యజ్ఞ ప్రవృత్తిని మేలుకొలిపారు. యజ్ఞాల సంప్రదాయానికి పునర్జన్మ ఇచ్చారు. యుగం మొత్తాన్ని యజ్ఞమయం చేశారు. కృతయుగం తిరిగి వచ్చే ప్రక్రియను వేగవంతం చేశారు. ఈ సర్వహుత యజ్ఞంనుండే వేదాలు నాలుగూ ఉదయించాయనీ, అవి జ్ఞానంగా, అందరికీ అందేవిగా విస్తరించాయనీ పురుష సూక్తం చెపుతోంది. పరమపూజ్య గురుదేవుల జీవనం యజ్ఞమయంగా సాగింది. వారీ యజ్ఞంలో ఒక సమిధగా జీవితమంతా జ్వలించారు. తమ కణ కణాన్నీ ఆహుతి ఇచ్చారు. మనిషి ఎలా దివ్యకర్మలు చేయాలో శిక్షణ ఇచ్చారు. వారి జీవనంనుండి మనం ఇదే ప్రేరణ పొంది, శిక్షణ పొంది మన జీవితాలను కూడ యజ్ఞమయం చేసుకోవాలి. శాంతికుంజ్‌లోని యుగసంగీత విభాగం "ఓ ప్రభూ! మా జీవితాలను యజ్ఞమయం చేయండి" అనే గీతాన్ని వినిపిస్తూ ఉంది. ఈ గీతంలోని సారాన్ని అమలుచేయగలిగితే అందరి జీవితాలూ దివ్య జీవితాలుగా రూపొందుతాయి. యజ్ఞ ప్రవృత్తిని అలవరచుకొని, అనగా దిగువకు పోయే ప్రకృతి క్రియలను మన అధీనంలో ఉంచుకోవడంవల్ల- యజ్ఞం ద్వారా, ఆత్మబలిదానంద్వారా, శ్రేష్ఠ లక్ష్యాల కోసం సర్వస్వార్పణ కావడంద్వారా పొందే దివ్యానంద రసాన్ని ఆస్వాదించాలి. దీనినే యజ్ఞశేషాన్ని సేవించడంగా భగవానుడు 31వ శ్లోకంలో వివరించారు.

– (*తరువాయి వచ్చే సంచికలో*)

## ప్రయోగాలన్నీ తనమీదనే

ఇంగ్లండుకు చెందిన ప్రసిద్ధ వైజ్ఞానికుడు డాక్టర్ డాల్టన్ తన ప్రయోగాలన్నిటినీ సాహసంతో తనమీద జరుపుకొని ఒక నిర్ణయానికి వచ్చేవాడు. ఇతర ప్రాణులమీద ప్రయోగాలు చేసి వాటిని బాధించటం మానవత్వానికి విరుద్ధమని అతడు భావించేవాడు. మానవుల ప్రాణం కంటె జంతువుల ప్రాణం చిన్నది అనే సంకుచితమైన ప్రతిపాదనను ఈయన అంగీకరించేవాడు కాదు. అమోనియం క్లోరైడు వంటి హానికరమైన వస్తువుల ప్రయోగాలు కూడా ఈయన స్వయంగా తన శరీరం మీదనే చేసుకొనేవాడు. టిటనస్ వంటి టీకాలు ఈయన ఈ విధంగా కనుక్కొన్నవే. ఎంతో బరువుని చాలా దూరం తానే మోసుకొని వెళ్ళినంత మాత్రానగాని, ఆమాత్రం ప్రయోగాలను స్వయంగా చేసికోవటం వలనగాని మనిషికి ఏమీ హాని జరిగిపోదని ఈయన నిరూపించాడు.

ఈయన మాంసాహారాన్ని విపరీతంగా విరోధించేవాడు. అందువలన ఈయనను హేళన చేసేవారు ఎక్కువయ్యేరు. ఈయన వాటిని లెక్కచేయక ధార్మిక విలువలకు అలవాలమైన భారతదేశానికి వచ్చివేసి, తన ప్రయోగాలన్నీ ఇక్కడే జరిపాడు. వైజ్ఞానికులలో శిఖరాగ్ర స్థానం ఆయనది. ఇలాంటి వ్యక్తులు సిద్ధులను సునాయాసంగా పొందగలుగుతారు.

- ప్రజ్ఞాపురాణం నుండి

**ప్రతి పనికీ ఇతరులను అర్థించేవాడు సాఫల్యాన్ని సాధించలేడు.**

బోధకథ

# లోభగుణమే గ్రుడ్డితనం

అతడికి కంటి చూపు లేదు. అయితేనేం, కంఠస్వరం కోయిలను మరిపిస్తుంది. అతడు పాడుతుంటే, విన్న ప్రజలు మంత్రముగ్ధులౌతారు. మైమరచిపోతారు. అతనికి రాని పాట లేదు. ఎన్నో పాటలు, పద్యాలు, గీతాలు కంఠస్థం చేశాడు. ఏ వీధిలోకి వెళ్లినా అతని చుట్టూ జనం చేరేవారు. గుడ్డిబాబా! అంటూ ఎంతో ఆదరంగా పిలుస్తూ ఉంటారంతా.

ప్రతిరోజూ ఎవరో ఒకరు అతడికి భోజనం పెడుతుండేవారు. ఊరికి కొద్ది దూరంలో ఉన్న తోటలోని దేవాలయం అతడి నివాస స్థానం. ఊరి వారేకాక పొరుగూళ్ల నించి వచ్చే యాత్రికులు కూడా దేవునితో పాటు బాబాజీ దర్శనం చేసుకొని ఏదో ప్రసాదమో, కొంత దక్షిణో ఇచ్చి వెళ్తుండేవారు. నెమ్మది నెమ్మదిగా బాబాదగ్గర చాలా డబ్బు పోగయింది. సమయం దొరికితే చాలు వాటిని లెక్కపెట్టుకుంటూ, తడిమి చూసుకుంటూ ఆనందపడిపోసాగాడు. అంతే కాదు. వాటిని ఇంకా ఇంకా పెంచాలంటే ఏం చెయ్యాలి? అన్న ఆలోచన వచ్చి ఆ డబ్బుతో బంగారు నవరసులను కొన్నాడు. వీటిని ఒక సంచిలో వేసి తన నడుముకు కట్టుకున్నాడు. కూర్చున్నా-లేచినా నిద్రపోతున్నా-మెలకువగా ఉన్నా అతడి ధ్యాసంతా బంగారం మీదే ఉండేది. అసలే గ్రుడ్డివాడిని, వీటిని ఎవరైనా కాజేస్తారేమో- అన్న భయం ఒకటి మనసులో చేరి ముల్లులా అతడిని బాధిస్తుండేది. అదివరకటి సంతోషం ఇప్పుడు మచ్చుకైనా లేదు.

గ్రుడ్డిబాబా దగ్గర బంగారు కాసులున్నాయన్న సంగతి ఇద్దరు మోసగాళ్లు కనిపెట్టారు. వాటిని కాజేయడానికి చక్కటి పథకం వేసుకొని ఇద్దరూ బాబా దగ్గరకి వచ్చారు. బాబాజీకి ప్రణామం చేసుకొని తాము బంగారునగల వ్యాపారులమని తీర్థయాత్రలకు బయలుదేరామనీ చెప్పారు. "బాబా! మీ లాంటి సాధువు దర్శనం లభించి మా జన్మ ధన్యమైంది. మా తృప్తి కోసం ఈ రోజు మా భిక్ష స్వీకరించండి''- అని చెప్పి ఎంతో ప్రేమగా భోజనం పెట్టి దక్షిణగా ఒక బంగారు నాణెం ఇచ్చారు. బంగారు నాణెం శబ్దం చెవుల పడగానే బాబా మనసు ఆనందంతో పొంగిపోయింది. గ్రుడ్డివాడవటం మూలాన నాణాలను వాటి శబ్దాలను బట్టి వెండివా, బంగారువా, లోహపువా అన్న సంగతి గ్రహిస్తూండేవాడు.

ఈ మోసగాళ్లిద్దరూ తోటలోనే మూడురోజులు గడిపారు. ప్రతి రోజూ బాబాకి రుచికరమైన భోజనంతోపాటు ఒక్కో బంగారు నాణెం కూడా ఇస్తుండేవారు. మూడోరోజు వాళ్లు అక్కడనుండి బయలుదేరుతూ బాబాతో ఇలా అన్నారు- "మహాత్మా, మీ దర్శనం వల్లా, మీ సేవ వల్లా మేము చాలా ఆనందం పొందాము. ఒక్కరోజు ఉండిపోదామనుకున్నవాళ్లము మూడు రోజులు ఉన్నామంటే మిమ్మల్ని వదిలిపెట్టి వెళ్లలేకనే. కానీ మేము చాలా యాత్రలు చేయవలసి ఉన్నది. కనుక బయలు దేరక తప్పడం లేదు. అయితే మాదొక విన్నపం.......'' అన్నారు.

"అదేమిటో చెప్పండి నాయనలారా!'' - అన్నాడు బాబా. "యాత్ర చేసినన్నాళ్లు ప్రతిరోజూ ఒక సాధువుకి భోజనం పెట్టి దక్షిణగా బంగారు నాణెం ఇచ్చిన తర్వాతనే అన్నం నీళ్లు ముట్టుకోవాలన్న నియమం పెట్టుకున్నాము మేము. కానీ అసలైన సాధు సత్పురుషులు మాకు ఎక్కడంటే అక్కడ ఎలా లభిస్తారు? మీరు మాతో పాటు యాత్రకు రాగలిగితే మాకు రోజూ మీ దర్శన భాగ్యమూ కలుగుతుంది, మా వ్రతమూ పూర్తి చేసుకోగలుగుతాము'' - అని అన్నారు వారు ఎంతో వినయంగా.

బాబా ఆనందానికి అవధులు లేవు. నా అదృష్టం పండింది. లేకపోతే ఇంతమంచి అవకాశం నన్ను వెతుక్కుంటూవస్తుందా? మంచి భోజనంతో పాటు స్వర్ణముద్రికలు కూడా లభించడమేకాక పైసా ఖర్చులేకుండా యాత్రలన్నీ చేసిరావచ్చు - అని తలచి వెంటనే తన అంగీకారాన్ని తెలియజేశాడు. "దానికేముంది నాయనా! అలాగే మీ వెంట వస్తాను. మీ పవిత్ర కార్యంలో సహాయపడడం కన్నా ఇక్కడ కూర్చొని నేను చేయబోయే రాచకార్యా లేమున్నాయి''- అన్నాడు వైరాగ్యం ప్రదర్శిస్తూ.

అన్నీ అనుకున్నట్లే జరుగుతున్నాయి. ఇక ఆలస్య మెందుకు? ఆ మోసగాళ్లిద్దరూ ఒక రథాన్ని ఏర్పాటు చేశారు. అందరూ అందులో కూర్చొని ప్రయాణం సాగించారు. ప్రతిరోజూ బాబాజీకి రుచికరమైన భోజనం పెట్టి ఒక్కొక్క బంగారు నాణెం బహుమతిగా ఇస్తూవచ్చారు. బాబాజీ వాళ్లను పూర్తిగా నమ్మాడు. అతనికి వాళ్లమీద ఎటువంటి శంకా కలగలేదు.

అలా మూడు రోజులు ప్రయాణించాక దట్టమైన అడవి ఎదురైంది. ఇదే మంచి అవకాశం అని మోసగాళ్లు రథం ఆపి,

**దైవ విశ్వాసం అంటే తన కార్యశూరతపై, ఉజ్వల భవిష్యత్తుపై విశ్వాసం.**

"బాబాజీ, ఇది ఎత్తు పల్లాలతో కూడిన అడవి మార్గం. కొండ చరియన ఉన్న కాలిబాట మీద నడిచి వెళ్లాలి. ఎలాగోలా ఈ రాత్రికి అడవి దాటి ఆ ప్రక్కన ఉన్న ఊరికి చేరాలి. కాలిబాటన రథం పోదు. కాబట్టి చుట్టుతిరిగి ఊళ్లోకి వస్తుంది. గతుకుల దారిలో రథం మీద ప్రయాణం. మీకు చాలా ఇబ్బంది కలుగుతుంది. కాలిబాట సమతలంగా ఉన్నది. మీరు కర్ర సహాయంతో నడిచినా ఒక గంటలో సుఖంగా ఊరు చేరుకుంటారు. మేము రథం తీసుకొని చుట్టుతిరిగి వస్తాము. సాయంత్రానికి అందరం అక్కడ కలుద్దాము"- అని అన్నారు.

బాబాజీకి సమస్య చక్కగా అర్థం అయింది. తన మంచికేగా వాళ్లు అంతగా చెపుతున్నది- అనుకొని రథం మీదనించి క్రిందికి దిగాడు. "బాబాజీ! మీదగ్గర విలువైన వస్తువులేవీ లేవు కదా! అడవితో వ్యవహారం. దొంగలు, మోసకారులు ఎదురవవచ్చు. కీడెంచి మేలెంచాలి కదా. తర్వాత ఏమనుకొనీ లాభం ఉండదు"- అన్నారు మోసగాళ్లు. వాళ్లను పూర్తిగా నమ్మిన బాబా ఎటువంటి అనుమానం లేకుండా నడుముకు కట్టుకున్న సంచీ ఊడదీసి వాళ్ల కిచ్చాడు. వాళ్లిచ్చినదాంతో సహా సంపద మొత్తం సునాయాసంగా వాళ్ల అధీనంలోకి వచ్చేసింది. ఇంకేం కావాలి! రథం తిప్పుకొని వెళుతూ వాళ్లు "బాబాజీ, జాగ్రత్తగా నడవండి. మీకేమీ పర్వాలేదు"- అని చెప్పి వాళ్ల దారిన వాళ్లు పోయారు.

గ్రుడ్డిబాబా కర్ర సహాయంతో ఒంటరిగా నడక సాగించాడు. కొంత దూరం నడిచిన తర్వాత ఒక వ్యక్తి దూరం నుండి బాబాని చూశాడు. అతడు కంగారు పడుతూ "బాబా! అటెక్కడికి వెళుతున్నారు? అటు దారి లేదు. పెద్ద గొయ్యి ఉన్నది. కాలు జారిందంటే అందులో పడిపోతారు. ఆగండి. ముందుకు వెళ్ళొద్దు"- అంటూ కేకలు వేశాడు. బాబాకి అతడి మాటలు నమ్మబుద్ధి కాలేదు. వీడు తప్పకుండా దొంగయి ఉంటాడు. నాదగ్గరేమయినా ఉందేమో కాజెయ్యవచ్చన్న ఉద్దేశ్యంతో నన్ను ఆపుతున్నాడు. పాపం, వాళ్లు ముందే చెప్పారు అడవిలో దొంగలుంటారని"- అనుకుంటూ ఆ బాటసారి ఎంత త్వరగా తనని ఆపాలని వస్తున్నాడో అంతకన్నా వేగంగా ముందుకు నడిచాడు. అంతే. కాలు జారి ముందున్న పెద్ద గోతిలో పడిపోయాడు బాబా.

బాటసారి గబగబా పరుగెత్తుకొని వచ్చి గోతిలోకి దిగి బాబాను పైకి తీసుకువచ్చాడు. బాబా తలకి దెబ్బతగిలి పెద్ద బొప్పి కట్టింది. దెబ్బకు కట్టుకడుతూ బాటసారి చెపుతున్న మాటల ద్వారా విషయం మొత్తం అర్థమైంది బాబాకి. ఇప్పుడు చేయగలిగింది ఏముంది. తనలోని దురాశే తననీ స్థితికి లాక్కువచ్చింది. దెబ్బల బాధవల్ల మూలుగుతూ బాబా అతడితో ఇలా అన్నాడు- "కళ్లు లేకపోవడం వల్ల కాదు మనిషి గ్రుడ్డివాడయేది. అతడిలోని లోభగుణం వల్ల అతడు అంధుడౌతాడు. నాయనా! నీకు కనిపించిన వారికల్లా నాకథ వినిపించి ఇలా చెప్పు - ఎవరినీ ఎవరూ మోసగించలేరు. ప్రతి మనిషీ తనలోని దురాశతోనే మోసగించబడతాడు. లోభగుణం, దురాశ మనిషి సర్వస్వాన్నీ, ఆఖరికి ప్రాణాలని కూడా, హరించివేస్తుంది" అన్నాడు.

బాటసారి బాబా చెప్పిన మాటల గురించి ఆలోచిస్తూ ముందుకు సాగిపోయాడు.

★★★

## అగంతకుని ప్రజ్ఞ

విశ్వవిఖ్యాతి చెందిన ఒక ఇంగ్లీషు రచయితకు బాల్యంలోనే ఒక కాలు విరిగిపోయింది. ప్రజలు అతడి భవిష్యత్తు అంధకార బంధురమని నిర్ధారించి సానుభూతిని ఒలకపోస్తూ అతడి దౌర్భాగ్యాన్ని నిందించేవారు. ఈయన ఎవ్వరి సానుభూతినీ లెక్కచేయలేదు. చుట్టూ లభిస్తున్న సానుభూతి అనే మురికి కూపం నుండి ఎంత త్వరగా బయట పడగలనా అని ఆలోచించసాగేడు. ఆయనలోని తపన, ప్రగతిపథంలో పరుగులు పెట్టాలనే జిజ్ఞాస ఆయనను ఒక సాహితీ వేత్తగా తయారుచేశాయి. హెచ్.జి. వెల్స్ అనే పేరుగల ఈ మహనీయుని లేఖిని ద్వారా వెలువడిన సాహిత్యం విశ్వవిఖ్యాతి చెంది, ఉత్కృష్ట సాహిత్యంగా లెక్కించబడింది.

ఎవరైనా ఊహిస్తారా బాల్యంలోనే కాలు పోగొట్టుకొని, ప్రతికూల పరిస్థితుల మధ్య నలుగుతున్న అంగవిహీనుడైన ఒక వ్యక్తి విస్తృత సాహిత్యాన్ని సృష్టిస్తాడని? వాస్తవం చెప్పాలంటే, సౌభాగ్యం, దౌర్భాగ్యం అనేవి పురుషార్థపు ప్రతిఫలాలే. వర్తమానం ఎంత ఉత్కృష్టంగా కనిపిస్తున్నప్పటికీ పురుషార్థం పట్ల విరక్తి కల్గి మనోబలం క్షీణిస్తే, భవ్యమైన భవిష్యత్తు అంధకార బంధురంగా తయారవుతుంది. ఏ మాత్రం అనుమానం అక్కర్లేదు.

- ప్రజ్ఞాపురాణం నుండి

**ప్రతి క్షణాన్నీ సద్వినియోగపరచడం అదృష్టాన్ని ఆహ్వానించడమే.**

## కృష్ణావతారం-15

# శ్రీకృష్ణుని దినచర్య

భగవానుడు యవన సైన్యము యొక్క ధనమును లాగికొని పోవునప్పుడు మగధరాజగు జరాసంధుడు చాలవేగముగ ఆయనపై దాడిచేసెను.

**విలోక్య వేగరభసం రిపు సైన్యస్య మాధవౌ।**
**మనుష్యచేష్టా మాపన్నౌ రాజన్ దుద్రువతుర్ద్రుతమ్ ॥**

పరీక్షిన్మహారాజా! శత్రుసైన్యము యొక్క ప్రబల వేగమును చూచి శ్రీకృష్ణ బలరాములు మనుష్యులవలె ప్రవర్తించుచు వానియెదుటినుండి వేగముగ పరుగిడసాగిరి.

(1) ఆపద సంభవించినపుడు శీఘ్రనిర్ణయము, చాకచక్యము, చురుకుదనము అవసరము.

పరుగిడుచున్న కృష్ణ బలరాములను చూచి జరాసంధుడు రథము నధిరోహించి సైన్యముతో పాటు వారిని వెంబడించెను. కాని వాడు వారిని పట్టుకొనలేకపోయెను. సోదరులిరువురు అలసిపోయి ఉన్నతమైన ప్రవర్షణ పర్వతము నధిరోహించిరి. ఇరువురు సోదరులు పర్వతమున దాగియుండిరని భావించి కట్టెలను ప్రోగుచేసి నలువైపుల అగ్నిని ముట్టించి పర్వతమును తగులబెట్టసాగెను. ఆ పర్వత ప్రాంతభాగములు దగ్ధమగుచుండగా కృష్ణ బలరాములు జరాసంధుని సైనికుల కన్నుగప్పి వారి ముట్టడినుండి బయటపడిరి. ఇరువురు అగ్నియందు దగ్ధులై మరణించి యుండవచ్చునని భావించి జరాసంధుడు తన రాజధానికి తిరిగి వెళ్లెను.

శ్రీకృష్ణ భగవానుడు ద్వారకకు వెళ్లి సుఖముగ నివసించుచుండెను. అటుతరువాత రేవతితో బలరాముని వివాహమయ్యెను. కృష్ణునకు గూడ విదర్భ రాజపుత్రికయగు రుక్మిణితో వివాహమయ్యెను.

**శ్రియస్తు భాగః సంజజ్ఞే రత్యర్థం పృథివీతలే ।**
**భీష్మకస్యకులే సాధ్వీ రుక్మిణీనామ నామతః ॥**

భీష్మక రాజు యొక్క పుత్రికయగు రుక్మిణి లక్ష్మీదేవి అవతారము. కృష్ణుడు ఆమెనే భార్యగా స్వీకరించెను.

(1) భగవానుని అవతారముతోపాటు ఆయన శక్తులు గూడ అవతరించును.

(2) గుణవంతురాలగు కన్య లక్ష్మితో సమానము, ఆమెను జనులు గొప్పగా గౌరవింతురు.

వివాహము తరువాత సోదరులిరువురు ద్వారకలో ఉండి యదువంశీయులకు మార్గ దర్శనము చేయుచుండిరి. చాలాకాలము గడచిన తరువాత 'నా వంటి తేజస్వియు యోగ్యుడునగు పుత్రుని సమాజమునకు అర్పింతునుగాక' అని కృష్ణుడు తలంచి పుత్రప్రాప్తికై ఘోరమైన తపస్సు చేసెను. ఈ ఘటనను గూర్చి కృష్ణుడిట్లు వివరించెను-

**బ్రహ్మచర్యం మహద్ఘోరం చీర్త్వా ద్వాదశ వార్షికమ్ ।**
**హిమవతః పార్శ్వమభ్యేత్య యో మయా తపసార్జితః ॥**
**సమానవ్రత చారిణ్యాం రుక్మిణ్యాం యో న్వజాయత ।**
**సనత్కుమార తేజస్వీ ప్రద్యుమ్నో నామ మే సుతః ॥**

పన్రెండు సంవత్సరములు బ్రహ్మ చర్యము పాటించి నేను నా భార్యయగు రుక్మిణితో గూడ హిమాలయమున తపస్సు చేసితిని. అతపః ప్రభావముచే నాకు సనత్కుమారుని వంటి తేజస్సు కలిగిన ప్రద్యుమ్నుడను పుత్రుడు కలిగెను.

(1) ఆదర్శ దంపతులే ఉత్తమ సంతానమును కనెదరు.

(2) సంతానమును కనుట గొప్ప బాధ్యత కలిగిన కార్యము. దీనికై తమ శరీరమును మనస్సును తగిన విధముగ చేయవలెను. దానికి కఠిన ప్రయత్నము చేయవలెను.

శ్రీకృష్ణుడు తన సుహృదులగు పాండవుల సమాచారమును ఎప్పటికప్పుడే తెలిసికొనుచుండెను. దుర్యోధనాదుల అవినీతివలన వారు కలతచెందుచుండిరి. శ్రీకృష్ణుడు తీరిక చేసికొని పాండవులను కలిసికొనుటకై ఇంద్రప్రస్థమునకు వెళ్లెను. పాండవులు చాల సంతోషించిరి. వారు నవవివాహితయగు ద్రౌపదితోగూడి ఆయనకు స్వాగతముచెప్పి, ఆయన దివ్యస్నేహమును అనుభవించి తాము ధన్యులైనట్లుగ భావించిరి. శ్రీకృష్ణుడు తన మేనత్తయగు కుంతిదగ్గరకు వెళ్లి ఆమెకు నమస్కరించెను. కుంతీదేవి శ్రీకృష్ణుని అలౌకిక స్వరూపమును గూర్చి తెలిసికొని గద్గదయై ఇట్లు పలికెను.

**న తే స్తి స్వపరభ్రాన్తిర్విశ్వస్య సుహృదాత్మనః ।**
**తథాపి స్మరతాం శశ్వత్ క్లేశాన్ హంసి హృది స్థితః ॥**

నీవు ఈ జగత్తున కంతటికి పరమహితైషివగు మిత్రుడవు ఆత్మవు. నీకు నావారు పరులు అను భ్రాంతి లేదు. అయినను శ్రీకృష్ణా! నిన్ను నిరంతరము స్మరించువారి హృదయమున నివసించుచు వారి క్లేశములను పోగొట్టు చుందువు.

(1) భగవానుడు అందరకు మిత్రుడు.

(2) పరిష్కృతమగు ఆత్మయే పరమాత్మ.

(3) తన ఆత్మస్వరూపమును తెలిసికొనుటయే పరమాత్మ స్మరణయగును.

(4) అంతఃకరణమున పరమాత్మ ప్రకాశము అనుభవములోనికి రాగా క్లేశములన్నియు తొలగిపోవును.

**ధర్మ పథం పూలబాట కాదు, ముళ్లబాట.**

శ్రీకృష్ణ భగవానుడు కుంతిని ఓదార్చెను. కొన్ని నాళ్లు ఇంద్రప్రస్థములో ఉండి పాండవులకు మార్గదర్శనము చేసి పిమ్మట ద్వారకకు తిరిగి వెళ్లెను. ఒకనాడు ద్వారకలోని కొందరు బాలురు క్రీడార్థమై వెళ్లి, చాలాసేపు అక్కడ ఆడిరి. ఇంతలో వారికి దప్పిక అయ్యెను. నీటిని వెదకుచు వారు బావిదగ్గరకు పోయిరి. బావిలో ఒక పెద్ద ఊసరవెల్లిని చూచిరి. బాలురు కృష్ణునకు విషయమునంతటిని చెప్పిరి. కృష్ణుడు వెళ్లి ఆ ఊసరవెల్లిని పైకి తీసెను. ఆయన స్పర్శను పొంది అది దేవపురుషుని రూపమును ధరించెను.

శ్రీకృష్ణుడు అడుగగా అ దివ్యపురుషుడు తన పూర్వజన్మ వృత్తాంతమును వినిపించెను. అతడిట్లు పలికెను. నేను ఇక్ష్వాకుని పుత్రుడను. నేను జీవితమంతయు యోగ్యులైనవారికి గోవులను, వస్త్రములను, విద్యను దానముచేసితిని. కాని ఒకమారు ప్రమాదవశమున తప్పు జరిగినది. ఒక అపరిగ్రహుడగు బ్రాహ్మణుని ఆవు నా ఆవులలో కలిసినది. జగ్రత్తలేకపోవుటవలన నేను దానిని తెలిసికొనలేక మరియొక బ్రాహ్మణునికి దానము చేసితిని. వాస్తవము తెలిసిన పిమ్మట ఇరువురు బ్రాహ్మణులు ఆ గోవును తీసికొనుటకు అంగీకరింపలేదు. వారికి కష్టము కలిగించినందువలన నాకు పాపము కలిగినది. నేను మరణించిన పిమ్మట యముడు నాతో ఇట్లు పలికెను. - పుణ్యమువలన నీకు దివ్యలోకములు కలుగును, కాని పాపఫలమును అనుభవింపక తప్పదు. మొదట నీవు దేనిని అనుభవింపదలంచుచున్నావు?'' నేను మొదట పాపఫలమును అనుభవింపదలచితిని. అందువలన ఊసరవెల్లి రూపమున కొంతకాలము ఉండవలసి వచ్చెను.

**బ్రహ్మణ్యస్య వదాన్యస్య తవ దాసస్య కేశవ ।**
**స్మృతిర్నా ద్యాపి విధ్వస్తా భవత్సందర్శ నార్థినః ॥**

రాజు పలికెను - "కేశవా! నేను బ్రాహ్మణ సేవకుడను, దాతను, నీ భక్తుడను. అందువలన ఈ స్థితిలోగూడ పూర్వజన్మస్మృతి ఉన్నది, నీ దర్శనమును అభిలషించుచున్నవాడను.

(1) బ్రాహ్మణ సేవకుడనగా సదాచారులు పారమార్థికులు నగు వ్యక్తులకు సేవచేయువాడు, సహాయము చేయువాడు.

(2) తాను చేసికొనిన శుభకర్మ విపరీత సమయములో గూడ సహాయము చేయునది అగును.

(3) ఉత్తమ చింతనము హీనస్థితి నుండి యుద్ధరించును.

కృష్ణునకు తన పూర్వజన్మ కథను చెప్పి ఆరోజు అందరు చూచుచుండగనే అతడు స్వర్గమునకు వెళ్లిపోయెను. చాల దినముల గడచిపోగా బలరాముడు వ్రజమునకు పోదలంచెను. వెంటనే రథమునెక్కి వ్రజమునకు వెళ్లెను. ఆయనను కలిసికొని యశోదానందులు ఇతర గోపాలురు చాలా ప్రసన్నులైరి. బలరాముడు ప్రేమతో వ్రజమున నివసింపసాగెను.

బలరాముడు వ్రజమున నివసించుచుండగా పౌండ్రకుడు కృష్ణుని కడకు సందేశమును పంపెను."నీవే వాసుదేవుడవు, భూభారమును తగ్గించుటకే నీవు అవతరించితి''వని ముఖస్తుతి చేయు ఆ పౌండ్రకుని అనుయాయులు వానిని రెచ్చగొట్టిరి. కృష్ణుడు అసత్యమగు అవతారియై తిరుగుచున్నాడనియు చెప్పిరి. ద్వారకకు చేరుకొని పౌండ్రకుని దూత కృష్ణునకు వాని సందేశమును వినిపించెను.

**వాసుదేవో వతీర్ణో హమేక ఏవ న చాపరః ।**
**భూతానా మనకంపార్థం త్వన్తు మిథ్యాభిధాం త్యజ ॥**

నేను మాత్రమే వాసుదేవుడను, మరియెవ్వడును లేడు. ప్రాణులపై దయ చూపుటకై నేనే అవతారమును స్వీకరించితిని. నీవు నిష్కారణముగా వాసుదేవుడవను పేరును పెట్టుకొంటివి. ఇపుడు దానిని వదులుము.

(1) ముఖస్తుతి చేయు అనుయాయులు వ్యక్తిని రెచ్చగొట్టి ఇట్లే ఆకాశమునకు ఎత్తెదరు. అందువలన ముఖస్తుతి చేయువారి నుండి దూరముగా ఉండవలెను.

దూతద్వారా పౌండ్రకుని సందేశమును విని కృష్ణుడు ఇట్లు పలికెను. - 'నేను వానిపై నా అస్త్రమును ప్రయోగింతును. అక్కడే నా పేరును వదలెదను' అని నీప్రభువుతో చెప్పవలసినది. దూత వెళ్లిపోయెను. అప్పుడు కాశీపురముపై దండెత్తెను. ఆయనను ఎదుర్కొనుటకై కృత్రిమ వాసుదేవుడగు పౌండ్రకుడు తన మిత్రుడగు కాశీరాజుతో కలసి యుద్ధభూమికి వచ్చెను. వాడు కృత్రిమ విష్ణువేషమును ధరించియుండెను. వాని వేషమంతయు కల్పితమే. ఒకానొక నటుడు అభినయించుటకు రంగస్థలముపైకి వచ్చినట్లుండెను. వాని రూపము తన రూపమువలె ఉండుట చూచి కృష్ణుడు పెద్దగా నవ్వెను.

శ్రీకృష్ణుడు పౌండ్రకుని సైన్యము నంతటిని నాశనముచేసి పౌండ్రకునితో " నా శస్త్రమును విడిచి పెట్టమని నీవు సందేశమును పంపితివి. కనుక ఇప్పుడు నీ మీదనే నా అస్త్రమును విడిచి పెట్టుచున్నాను'' అని పలికెను.

**ఇతి క్షిప్త్వా శితైర్బాణైర్విరథీకృత్య పౌణ్డ్రకమ్ ।**
**శిరో వృశ్చద్రథాంగేన వ్రజేణేన్ద్రో యథా గిరేః ॥**

శ్రీకృష్ణ భగవానుడు ఇట్లు పౌండ్రకుని తిరస్కరించి తన తీక్ష్ణ బాణములతో వాని రథమును విరుగగొట్టి చక్రముతో వాని శిరస్సును, ఇంద్రుడు తన వజ్రాయుధముతో పర్వత శిఖరమును ఖండించునట్లు ఖండించెను.

(1) ఇతరులవలన పెడదారిపట్టి అనుకరించువారికి ఇదే గతి పట్టును. సత్యమెదుట అసత్యము నిలువజాలదు.

శ్రీకృష్ణుడు పౌండ్రకుని, వాని మిత్రుడగు కాశీరాజును శిక్షించి ద్వారకకు వెళ్లి పోయెను. ఇక్కడ వ్రజములో బలరాముడు ద్వివిదుడను పొగరుబోతు వానరము నుండి వ్రజమును కాపాడెను. ద్వివిదుడు మొదట సుగ్రీవునికి మిత్రుడు. ఇటు భీమాసురునితో వానికి స్నేహము కలిగెను. శ్రీకృష్ణుడు భీమాసురుని సంహరించగా

**మనం ఏమి చేస్తామన్నది కాక, ఏ భావంతో చేస్తామన్నది ముఖ్యం.**

బదులుతీర్చు కొనుటకై వ్రజవాసులను వాడు అనేక విధముల బాధించెను. బలగర్వముచే వీడు అత్యాచారములు చేయుచున్నాడని బలరాముడు గుర్తించి వానిని చంపదలచెను. శుకుడు ఇట్లు పలికెను.

**ఏవం నిహత్య ద్వివిదం జగద్వ్యతికరావహమ్ ।**
**సంస్తూయమానో భగవన్ జనైః స్వపురమావిశత్ ॥**

పరీక్షిన్మహారాజా! జగత్తునకు ఉపద్రవమును కలిగించు ద్వివిదుని సంహరించి బలరాముడు ద్వారకకు వెళ్లెను. అప్పుడు పురజనులందరు బలరాముని ప్రశంసించిరి.

(1) ఆకతాయి శిక్షింపదగినవాడు.
(2) ప్రవర్తనవలన మానవునికి ఉన్నతి పతనము సంభవించును. రామావతార సమయమున ద్వివిదుడు భగవానుని కృపకు పాత్రుడయ్యెను. అప్పుడు వాడు సత్ప్రవర్తన గలవాడు. దుష్ప్రవర్తన వలన ఆ ద్వివిదుడే భగవానునకు శత్రువయ్యెను. అందువలన ఆయన వానిని సంహరించెను.

భగవానుడు శరీరముకంటెను, ఇంద్రియముల కంటెను, గుణములకంటెను పరుడు. ఆయన అవతారరూపమున శరీరధర్మముల నెట్లు పాలించునను విషయమును పరిశీలించుటకై నారదుడు ద్వారకకు వెళ్లెను. భగవానుడు ఆయనకు స్వాగతము పలికి ఇట్లు చెప్పెను. "నేను సర్వ గుణాతీతుడను. కాని దేహము ధరించి మానవులకు ఉత్తమ జీవితమును గడుపుటకు వ్యావహారిక మార్గదర్శనము చేయుదును. నీవు ఈ దృష్టితోనే నా క్రియా కలాపములను పరిశీలించుము." ఆయన ఇట్లు పలికెను.

**బ్రహ్మన్ ధర్మస్య వక్తాహం కర్తా తదను మోదితా ।**
**తచ్ఛిక్షయన్ లోకమిమమాస్థితః పుత్ర మా ఖిదః ॥**

నారద మహర్షీ! నేను ధర్మమును ఉపదేశించువాడను, పాలించువాడను, దానిని అనుష్ఠించు వారిని సమర్థించు వాడను. అందువలన ప్రపంచమునకు ధర్మమును బోధించు నుద్దేశ్యముతోనే ఇట్లు ప్రవర్తించుచున్నాను. పుత్రా ! నీవు నాయీ యోగమాయను చూచి మోహపడవలదు.

(1) ఈశ్వరుడు ధర్మరక్షకుడు. తన ఆచణము ద్వారా జనులకు ఉపదేశించుటకే ఆయన అవతారము.
(2) ఉపదేశించుటకు ముందు మనము ధర్మమును ఆచరించవలెను.
(3) ధర్మము నాచరించువాడే నిజమైన ధర్మ ప్రచారకుడు.

నారదుడు సూక్ష్మముగ శ్రీకృష్ణ భగవానుని దినచర్యను అధ్యయనము చేసెను. భగవానుని దినచర్య ఇట్లున్నది -

**బ్రాహ్మే ముహూర్తే ఉత్థాయ వార్యుపస్పృశ్య మాధవః ।**
**దధౌ ప్రసన్నకరణ ఆత్మానం తమసః పరమ్ ॥**

శ్రీకృష్ణభగవానుడు ప్రతిదినము బ్రాహ్మమూహూర్తమునందే లేచి ముఖమును కడిగికొని మాయాతీతమగు ఆత్మ స్వరూపమును ధ్యానించును, అప్పుడు ఆయన రోమరోమము ఆనందముచే పులకరించును.

(1) ప్రాతఃకాలమున మేల్కాంచుట వలన లాభము.
(2) మనము గూడ మన ఆత్మ స్వరూపమును ధ్యానింపవలెను. దాని వలన మనము కృష్ణుని వంటి వారము కాగలము.
(3) స్వస్వరూపమును మరచుటవలననే మనము దుఃఖితులమగుచున్నాము.

**అథాప్లుతో మ్భస్యమలే యథావిధి**
**క్రియా కలాపం పరిధాయ వాససీ ।**
**చకార సన్ధ్యోపగమాది సత్తమో**
**హుతానలో బ్రహ్మ జజాప వాగ్యతః ॥**

అటు తరువాత ఆయన యథావిధిగ నిర్మలము పవిత్రమునగు జలముతో స్నానము చేయును. పిమ్మట శుద్ధవస్త్రములను ధరించి యథావిధిగ నిత్యకర్మలను సంధ్యావందనమును చేయును. అనంతరము హోమము చేయును. మౌనముగ గాయత్రీజపము చేయును. ఆయన సత్పురుషులకు ఆదర్శుడు.

(1) మనము గూడ మన దిన చర్యలో ఇట్లే నియమింపబడవలెను.
(2) గాయత్రి మరియు యజ్ఞము భారతీయ సంస్కృతికి తల్లి తండ్రి. మన మీ తల్లిదండ్రులను ప్రతిదినము సేవింపవలెను.

**గో విప్ర దేవతా వృద్ధగురూన్ భూతాని సర్వశః ।**
**నమస్కృత్యాత్మసంభూతిర్మంగలాని సమస్పృశత్ ॥**

అనంతరమాయన తన విభూతులగు గోవులకు, బ్రాహ్మణులకు, దేవతలకు, వృద్ధులకు, గురువులకు, సర్వప్రాణులకు ప్రణమిల్లి మాంగలిక ద్రవ్యములను స్పృశించును.

(1) మాంగలిక ద్రవ్యములను స్పృశించుటయనగా వానిని తగిన విధముగ సంరక్షించుట, ఉపయోగించుటకు ఏర్పాటు చేయుట.

**తత్రాహుర్బ్రాహణాః కేచిదాసీనా బ్రహ్మ వాదినః ।**
**పూర్వేషాం పుణ్యయశసాం రాజ్ఞాం చాకథయన్ కథాః ॥**

ఆ సభలో కూర్చుండియున్న కొందరు బ్రాహ్మణులు వేదమంత్రములను వ్యాఖ్యానించు చుండిరి. వాక్చాతుర్యము గల కొందరు పురుషులు ప్రాచీనులైన రాజుల చరితములను చెప్పుచుండిరి.

(1) స్వాధ్యాయము సత్సంగము అవసరము.
(2) ఉత్తమ పురుషుల చరిత్రను వినుటవలన తాముగూడ వారివలె కావలయునను ప్రేరణ లభించును.

ఇట్లు గృహస్థ ధర్మమును పాలించుచు, తన ప్రవర్తనద్వారా జనులకు సదాచారమును గూర్చి ప్రేరణను కలిగించుచు కృష్ణుడు ద్వారకలో నివసింపసాగెను.

★★★

**దృష్టికి అనుగుణంగా సృష్టి జరుగుతుంది.**

## సాధుసంత్‌ల జీవితాలు

# మహాభక్తురాలు కాన్హోపాత్ర

మీరాబాయి, సక్కుబాయి వంటి భక్తురాళ్లవలె కాన్హోపాత్ర మనసా వాచా కర్మణా పాండురంగ విఠల్‌నే వరించి పూజించిన భక్తురాలు. పంకంలో పుట్టిన పద్మంవలె వేశ్యకులంలో పుట్టినా తన మనసును భగవంతునికి అంకితమిచ్చి ఆయనలో ఐక్యం కాగలిగిన దైవాంశ సంభూతురాలు ఆమె.

మంగళవేఢ్యా అనే గ్రామానికి చెందిన శ్యామ అనే వేశ్య కుమార్తె కాన్హోపాత్ర. ఆమె రూప లావణ్యాలు అందరినీ ఆశ్చర్యచకితులను చేసేవి. ఆమె సౌందర్యం చూసి దేవకాంతలు సిగ్గుపడవలసిందే. అందంలోనే కాక కాన్హోపాత్ర సంగీత, నృత్యములలో కూడా ప్రవీణురాలై రంభా, ఊర్వశులను మరిపింపచేసేది. త్రిలోక సుందరివంటి తన కుమార్తెను చూసుకొని గర్వపడేది శ్యామ.

ఒకరోజున శ్యామ తన కుమార్తెతో, "అమ్మాయీ! ఎంతటి మహారాజయినా నీ అందానికి దాసుడు కాకమానడు. మనకు రాజు ప్రాపకం దొరికితే మన దరిద్రం తీరిపోతుంది. అంతులేని భోగభాగ్యాలతో తులతూగవచ్చు. మనంత అదృష్టవంతులు ఇక ఎవరూ ఉండరు. నిన్ను రాజ సభకు తీసుకు వెళతాను. నాతో రా"- అని అన్నది.

అందుకు కాన్హోపాత్ర, "అమ్మా! నాకీ భోగ విలాసాలపై ఆశ లేదు. నాకు తగిన వరుడు ఈ భూలోకంలో ఎక్కడా లేడని అనిపిస్తున్నది. భగవంతుని ముందు ఈ మహారాజులంతా నాకు సూర్యుని ముందు మిణుగురుపురుగుల్లా కనపడుతున్నారు" - అని చెప్పి తల్లి వెంట రాజసభకు వెళ్లడానికి నిరాకరించింది.

చిన్నవయసు వల్ల అనుభవం లేక ఆవిధంగా మాట్లాడుతున్నది, మరి కొద్ది రోజులు ఆగి చూద్దాం - అని తలచి శ్యామ ఆమె మనసు మారడానికి రకరకాల ప్రలోభాలు ఎర చూపిస్తూ నచ్చచెప్పసాగింది. కాన్హోపాత్ర మనసుకు ఇవేవీ పట్టేవి కావు. ఆమె మనసు లౌకిక సుఖాలపట్ల కాక భగవంతునియందే లగ్నమై ఉండేది.

ఒకనాడు కొందరు భక్తులు తంబుర, తాళములు, మృదంగ వాద్యములతో హరినామ సంకీర్తన చేస్తూ పతాకములు పట్టుకొని తన ఇంటి ముందు నుండి వెళ్లడం చూసి కాన్హోపాత్ర కుతూహలంతో, "మీరు ఎక్కడకు వెళుతున్నారు?" - అని వారిని అడిగింది.

అందుకు వారు, "మేము పండరీపుర యాత్రకు వెళుతున్నాము. వైకుంఠాధిపతి అయిన భగవంతుడు పుండరీక భక్తుని కోరిక మీద అక్కడ వెలిశాడు." - అని చెప్పారు.

అది విన్న కాన్హోపాత్ర ఆశ్చర్యపడుతూ, "అలాగయితే ఆయన మహిమా విశేషాలను తెలుపండి." - అని అడిగింది. "అమ్మాయీ! ఆయన మహిమ వర్ణించడం బ్రహ్మాది దేవతలకే సాధ్యం కాదు. ఇక మావల్ల ఏమవుతుంది? సూర్యచంద్ర తారాగణములకు అతడే వెలుగు నిస్తున్నాడని మాత్రం చెప్పగలం" - అని వారు అన్నారు.

అప్పుడు కాన్హోపాత్ర "అయ్యలారా! హీనకులంలో పుట్టిన నేను శరణు కోరితే ఆయన నన్ను స్వీకరిస్తాడా?" - అని ఎంతో ఆశగా అడిగింది.

"పిచ్చిదానా! భగవంతునికి పతితపావనుడు, దీనదయాళుడు అను సార్థక నామము లున్నాయని వినలేదా? మథురానగరంలోని కంసుని దాసి కుబ్జ కురూపి, పేదరాలు అయినా భగవంతుని శరణుపొంది ఉద్ధరింపబడలేదా! అజామిళుడను బ్రాహ్మణుడు పరమ నీచుడయినా అంత్యకాలంలో పుత్రప్రేమను వదలలేక కుమారుని 'నారాయణా' అని పిలిచినంత మాత్రాన అతడికి వైకుంఠప్రాప్తి కలిగించాడు కదా! " - అని వారు చెప్పారు.

కాన్హోపాత్ర మరి ఒక్కక్షణమైనా ఆలస్యం చేయక లోపలికి వెళ్లి తల్లితో చెప్పి భక్తులతో కలసి పండరీపురం వెళ్లింది. చంద్రభాగ నదిలో స్నానం చేసి ఆలయంలోకి వెళ్లింది. సింహాసనం మీద విరాజమానుడైన విఠలనాథుని ఆలింగనం చేసుకొని చేతులు జోడించి, "దేవాధిదేవా! నీవు కరుణామయుడవు. షడైశ్వర్యములు (ఐశ్వర్యం, ధర్మం, యశస్సు, లక్ష్మి, జ్ఞానం, విజ్ఞానం) గలవాడవు. అజామిళుడు, గణిక మొదలైన పతితులను ఉద్ధరించావని భక్తులు చెప్పగా నీ కీర్తి విని నిన్ను శరణు పొందడానికి వచ్చాను. దేహాభిమానం, కామం విడిచి నిన్ను ఆశ్రయిస్తున్నాను. నాకు నీవే శరణు." - అంటూ పాండురంగని పాదాలపై శిరసు ఉంచి వేడుకున్నది.

అప్పటి నుండీ విఠలనాథునే మనసులో నిలుపుకొని హరినామ సంకీర్తన చేసుకుంటూ ఆమె దేవాలయంలోనే ఉండసాగింది.

కాన్హోపాత్ర సౌందర్యం కళ్లారా చూసిన యాత్రికులు కొందరు బహుమానాలకు ఆశపడి బీదర్ నవాబుతో, "పండరీపురంలో ఉన్న కాన్హోపాత్రలాంటి సౌందర్యవతి మీకు భూలోకమంతా వెదికినా కనపడదు. ఆమె మీకెంతో తగినది." - అని చెప్పారు.

నవాబు పరమానందభరితుడై కాన్హోపాత్రను తీసుకురమ్మని భటులను పంపాడు.

**దృష్టి మార్చుకుంటే కొత్త సృష్టిని దర్శించనిర్మిస్తావు.**

భటులు మహాద్వారం దగ్గర తంబుర తాళములతో నామసంకీర్తన చేస్తున్న కాన్హోపాత్ర దగ్గరకు వెళ్లి, "మా నవాబుగారు నిన్ను తీసుకురమ్మని మమ్మల్ని పంపించారు. మర్యాదగా వచ్చావా సరే. లేదా బలవంతానైనా నిన్ను తీసుకుపోగలం." - అని చెప్పారు.

వాళ్లను ఎదిరించి నిలబడడం అసాధ్యమని తెలుసుకున్న కాన్హోపాత్ర "అయ్యా! మీరు ఇక్కడే నిలబడండి. నేను లోపలకు వెళ్లి ఆఖరిసారిగా స్వామిని దర్శించుకొని వస్తాను." - అని చెప్పి గర్భగుడిలోకి వెళ్లింది. స్వామి పాదములపై పడి "ఓ పుండరీకవరదా! నిన్నే శరణుకోరి నీ సన్నిధిలో ఉన్న నన్ను తురుష్కరాజు చెరపట్టవచ్చాడు. గజేంద్రుని కరుణాక్రందన విన్నంతనే అతనిని రక్షించావు. దూర్వాసుడు అంబరీషుణ్ణి అవమానిస్తే అతడిని కాపాడినావు. నీకు అర్పించిన ఈ దేహాన్ని పరులు స్పృశిస్తే భక్తులు నిన్ను నిందించకమానరు. నాకేది దారి?" - అని దుఃఖించసాగింది.

అక్కడ ఉన్న భక్తులు, అర్చకులు చూస్తుండగా, పాండురంగడు ఆమెలోని చైతన్యమును తనలో లీనం చేసుకున్నాడు. కాన్హోపాత్ర జన్మ ధన్యమైందని అందరూ జయజయధ్వానాలు చేస్తూ ఆమె కళేబరాన్ని దేవాలయ ప్రాకారంలోని దక్షిణద్వారానికి కుడిప్రక్కగా సమాధి చేశారు. సమాధి చేసిన మరుక్షణమే కాన్హోపాత్ర తరటీవృక్షంగా మారిపోయింది.

మహాద్వారము దగ్గర వేచి ఉన్న రాజభటులు కాన్హోపాత్ర ఎంతసేపటికీ బయటకు రానందున అర్చకులను పిలిచి అడిగారు. ఆమె భగవంతుని ముందు ప్రాణాలు విడిచిందని, ఆమె శరీరం తరటీ వృక్షంగా మారిపోయిందనీ వారు చెప్పారు.

రాజభటులు వారు చెప్పేది నమ్మక "కాన్హోపాత్రను మరొకదారి నుండి బయటకు పంపి మాకు కట్టు కథలు చెపుతున్నారు. ఈ విషయం నవాబుకు చెప్పి మీ అంతు చూస్తాం" - అంటూ వెళ్లిపోయారు.

దుష్టుడయిన నవాబుతో ఏమి ప్రమాదం వస్తుందోనని భయపడిన అర్చకులు ఆయనకు నచ్చచెప్పిరావడానికి వెళుతూ, దేవుని ప్రసాదం, పువ్వులు తీసుకొని వెళ్లారు.

అర్చకు లిచ్చిన పువ్వులలో పొడవైన తలవెంట్రుక ఉంది. నవాబు కోపంతో "తలలో ముడిచిన పువ్వులు తెచ్చి దేవునివని అబద్ధం చెపుతారా?" - అని మండిపడ్డాడు. ఏమి చెప్పాలో తోచని అర్చకులు చటుక్కున, "అయ్యా అది స్వామివారి తలవెంట్రుక కాని వేరు కాదు."- అన్నారు నమ్మబలుకుతూ.

"ఏమీ, నేను వెర్రివాడినా మీ కాకమ్మ కథలు నమ్మడానికి. రాతి విగ్రహానికి వెంట్రుకలు మొలిచాయా? కాన్హోపాత్ర మరణించి తరటీ వృక్షంగా మారిందా? పదండి, నేనూ మీతో వచ్చి చూస్తాను. ఇందులో ఏది అబద్ధమైనా మీకు మరణదండన తప్పదు." - అని ఆగ్రహంతో చిందులు తొక్కాడు.

"భగవంతుడా! ఒక ఆపద తప్పించుకోవాలని చూస్తే దానికి మరొకటి తోడైందే! ఏమి చేయాలి?" - అని అర్చకులు దారిపొడవునా పాండురంగని వేడుకొనసాగారు. "మాధవా! మధు సూదనా! గోవిందా! ద్రౌపదిని భోజన పంక్తిలో దుర్యోధనుడు అవమానించబోగా ఆమెకు చతుర్భుజములు ఇచ్చి కాపాడినట్లు మమ్మల్ని ఈ ఆపదనుండి రక్షించు" - అంటూ ప్రార్థించసాగారు.

పండరీపురం చేరడంతోనే నవాబు నేరుగా ఆలయానికి వెళ్లాడు. అర్చకులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ఆయనను అనుసరించారు.

ఎదురుగా సింహాసనంపై నవరత్నఖచిత కిరీటంతో, చెవులకు మకరకుండలములతో, మెడలో వైజయంతీ మాలతో, పీతాంబరధారియై కటి ప్రదేశమున చేతులుంచుకొని చిరునవ్వులు చిందుస్తున్న శ్రీవిఠ్ఠలనాథుని దివ్యసుందర విగ్రహం దర్శన మిచ్చింది. ఆ విగ్రహానికున్న దీర్ఘమైన కేశములు గాలికి అల్లల్లాడసాగాయి.

నవాబుతో సహా అందరూ ఆ అద్భుత దృశ్యం చూసి ఆశ్చర్యానందాలలో మునిగిపోయారు. కలా! నిజమా! అని తేల్చుకోలేకపోయారు అర్చకులు. నవాబు స్వామికి సాష్టాంగనమస్కారం చేసి "కాన్హోపాత్ర దృష్టాంతం కూడా చూపండి" - అన్నాడు.

వారు నవాబును దక్షిణద్వారం దగ్గరకు తీసుకువెళ్లి తరటీ వృక్షమును చూపించారు. ఆ వృక్షం నుండి అపురూప సౌందర్యవతి అయిన కాన్హోపాత్ర రూపం లీలగా కనపడగా, నవాబు పశ్చాత్తాపంతో దానికి నమస్కారం చేసి "నావలన కదా ఈమె అకాలమరణం చెందింది" అని విచారించాడు.

అర్చకులు నవాబుతో, "రాజా! సురులంతా తరు రూపాలతో ఈ క్షేత్రంలో ఉన్నారనే నమ్మకం ఉన్నది. అలాగే దైవాంశ సంభూతురాలైన కాన్హోపాత్ర కూడా వృక్ష రూపంలో పండరినాథుని సేవించుకుంటోంది." - అని చెప్పారు.

ఇప్పటికీ పాండురంగ దేవాలయంలో దక్షిణ ద్వారం ప్రక్కగా తరటీ వృక్షం ఉన్నది. యాత్రికులు దానిని దర్శించి కాన్హోపాత్రను స్మరిస్తారు.

- విజయకుమారి.

☆☆☆

**సద్గుణాలు సిల్కు దుస్తులలో ఎంత శోభిస్తాయో సాదా దుస్తులలో అంతే శోభిస్తాయి.**

వ్యక్తి నిర్మాణం

# సాఫల్యానికి పదకొండు సూత్రాలు

ఉరుకులు పరుగులతో నిండిన నేటి జీవనశైలిలో అందరిముందూ ఉన్న లక్ష్యం ఒక్కటే- సాఫల్యం. ఎవరు దేనిని పొందారో దేనిని కోల్పోయారో నిర్ణయించేది సాఫల్యం. సాఫల్యాన్ని సాధించిన వ్యక్తి తనకోసమేకాక ఇతరులకోసం కూడా ఎన్నెన్నో కొత్త అవకాశాలను సృష్టిస్తాడు.

కఠోర పరిశ్రమ, మనసును దోచుకునే వ్యక్తిత్వం, తన పనిపట్ల పూర్తి నిజాయితీ, ఎలాంటి ఎగుడు దిగుడులనైనా తట్టుకుని నిలచే శక్తిని పరిపక్వం చేసుకోవడం సాఫల్యానికి అవసరమైన లక్షణాలని సాఫల్యపు శిఖరాగ్రానికి చేరుకున్న పలువురు ప్రముఖులు వ్యాఖ్యానించారు. పరమేశ్వరుని కృపవల్ల, అదృష్టం కలసిరావడంవల్ల తాము సాఫల్యాన్ని సాధించామని మరి కొందరు పేర్కొన్నారు. అయినా, సాఫల్యాన్ని సాధించిన వ్యక్తులందరూ ఆమోదించే మరికొన్ని సూత్రాలు ఉన్నాయి.

మొదటి సూత్రం లక్ష్యాన్ని నిర్ణయించుకోవడం. సాఫల్యాన్ని కోరేవారిలో పలువురు తాము గొప్పవారుగా ఎదగాలని వాంఛిస్తారు. అయితే తమ లక్ష్యాన్ని ఎలా నిర్ణయించుకోవాలో వారికి తెలియదు. వాస్తవానికి లక్ష్యాన్ని నిర్ణయించుకోవాలంటే వ్యక్తి తన ప్రతిభనూ, తన బలహీనతలనూ సరిగా అంచనా వేసుకోవాలి. లక్ష్యాన్ని నిర్ణయించుకోవడంతోపాటు దాన్ని చేరడానికి అనుసరించే మార్గం ఉత్తమోత్తమంగా, సహజంగా ఉండేటట్లు వ్యక్తి చూడవలసి ఉంటుంది. ఆ మార్గాన్ని సమయానుగుణంగా విజ్ఞతతో సవరించుకుంటూ ఉండాలి.

రెండవ సూత్రం సాధనాల సద్వినియోగం. మనకు జన్మతోనే కొన్ని సాధనాలు లభించి ఉంటాయి. జీవితాన్ని వికసింపజేసుకోవడానికి అవసరమైన సాధనాలన్నీ ఈ సృష్టిలోని కణ కణంలో వెదజల్లబడి ఉన్నాయి. భోజనం, నివాసం, ఆరోగ్యం, విద్యల మౌలిక సౌకర్యాలు మనకు అందే ఉన్నాయి. వాటితోపాటు మన తల్లిదండ్రులు, అధ్యాపకులు మనకు ప్రదానంచేసే అంతర్ దృష్టికూడ ఒక అమూల్యమైన సాధన సంపత్తి. జ్ఞాన విజ్ఞానాల ఖజానా మనకు ముందుతరాలనుండి వారసత్వంగా అందుతుంది. సాఫల్యాన్ని సాధించాలంటే వ్యక్తి ఎంతో సూక్ష్మ వివేచనతో, దూరదృష్టితో, సంయమనంతో ఈ సాధనాలను పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలి. ఈ సాధన సంపత్తిని తప్పుడు లక్ష్యాలకోసం వినియోగిస్తే మాత్రం సాఫల్యం చేజారిపోతుంది.

మూడవ సూత్రం నేర్చుకోవాలనే ఆకాంక్ష. అహంకారి తన లక్ష్యాన్ని సాధించడంలో ఎన్నో ఆటంకాలను ఎదుర్కొనవలసి వస్తుంది. ఎంత గొప్ప అధ్యాపకుడైనా అలాంటి వ్యక్తిలో జ్ఞాన జ్యోతిని వెలిగించలేడు. కనుక, కొత్త ఆలోచనలను, సిద్ధాంతాలను, ప్రక్రియలను నేర్చుకునే లక్షణాన్ని వ్యక్తి తనలో వికసింపజేసుకోవాలి. ఇతరుల విజయాలపట్ల అసూయా ద్వేషాలను పెంచుకోడానికి బదులు-వాటిని అభినందించడం, ఆయా విజయాల రహస్యాలను తెలుసుకుని తనలో జీర్ణించుకోవడం అవసరం.

నాల్గవ సూత్రం భావ వ్యక్తీకరణ కౌశల్యం. మన భావాలను తగువిధంగా, బలంగా, ఎదుటి వ్యక్తికి నచ్చేవిధంగా మనం వ్యక్తం చేయగలగాలి. ఇలా ఎదుటి వ్యక్తితో సదవగాహన పెంచుకునే సామర్థ్యం ఇంటా బయటా కూడ ఉపయోగపడుతుంది. భావ వ్యక్తీకరణలో మూడు లక్షణాలు ఉండాలి-సంక్షిప్తత, సుస్పష్టత, నిరంతరత.

నాల్గవ సూత్రం నాయకత్వం వహించే యోగ్యత. తనలో ఉన్న ప్రతిభనూ, శక్తిసామర్థ్యాలనూ గుర్తించి ముందుకు దూసుకుపోయే వ్యక్తి ఏ రంగంలో అయినా నాయకత్వం వహించగలుగుతాడు. ఆత్మవిశ్వాసం, ఆలోచనలలో స్పష్టత, దృఢ నిశ్చయం కలిగిన వ్యక్తియే నాయకత్వాన్ని వహించడంలో విజయం సాధించగలుగుతాడు. ఈ ప్రక్రియలో వ్యక్తి తన వైఫల్యాలను సాహసంగా ఒప్పుకోవడం అవసరం. మన లక్ష్యాన్ని చేరుకోవడానికి మరింత ఉత్సాహంతో, మరింత పట్టుదలతో కృషి చేయడానికి వైఫల్యం ఒక కొత్త అవకాశాన్ని కల్పిస్తుంది.

ఆరవ సూత్రం నిర్వహణ నైపుణ్యం. ఏ పనిని అయినా సమయానికి పూర్తిచేయాలి. ఎదుటి వ్యక్తిలోని కార్యదక్షతనూ, సద్గుణాలనూ త్వరగా అంచనా వేయగలగాలి.

**వర్తమానాన్ని సద్వినియోగపరచితే భవిష్యత్తు ఉత్తమంగా ఉంటుంది.**

ఏడవ సూత్రం క్షమ, కరుణ, సహకారాల భావన. సాఫల్యపు మార్గంలో ఎన్నో బాధలను ఎదుర్కొనవలసి వస్తుంది. పలు సందర్భాలలో ఇతరుల పొరపాట్లవల్ల మనం వైఫల్యం పొందుతాం. అలాంటి పరిస్థితిలో మనం ఆ వ్యక్తిని కోపగించుకోవడానికి బదులు క్షమించాలి. ప్రశాంతంగా, ప్రసన్నంగా ఉన్న మనస్సుతో చేసే కార్యమే సఫలం అవుతుంది. ఈ గుణాలను వికసింపజేసుకోవడంలో జపం, ధ్యానం సహాయపడతాయి.

ఎనిమిదవ సూత్రం ఆర్థిక వనరులను నిర్దిష్ట పథకం ప్రకారం వినియోగించే నేర్పు. సాఫల్యాన్ని సాధించడంలో ఆర్థిక వనరుల పాత్ర గణనీయమైనది. వ్యక్తి భవిష్యత్తు కోసం కార్య ప్రణాళికలను, విధానాలను రూపొందించుకోవాలి. వృత్తి వ్యవహారాలలో, వ్యక్తిగత వ్యవహారాలలో ఎంతో ఆలోచించి, ముందుచూపుతో ధనాన్ని మదుపుపెట్టాలి.

తొమ్మిదవ సూత్రం భావాత్మకమైన ఆలోచన. భావాత్మకంగా, నిర్మాణాత్మకంగా ఆలోచించే ప్రవృత్తిని అలవరచుకోవడం అంత తేలిక కాదు. అయితే కొద్దిగా శ్రమిస్తే ఆ ప్రవృత్తిని మన శీలంలో అంతర్భాగంగా చేసుకోవచ్చు. ఇందుకోసమై, ముందుగా మన లోపల ఉన్న హీన భావనను ఏరివేయాలి. 'ఇప్పుడు నేను ఏం చేయగలను, ఎలా చేయగలను' - అనే ఆలోచనను మనస్సునుండి మొదలంటా శాశ్వతంగా పెరికివేయాలి. ఆ ఆలోచనకు బదులు- నేను ఏదైనా చేయగలను. ఏదైనా సాధ్యమే. అసాధ్యమనేది లేనేలేదు'- అనే భావనను మన ఆలోచనలో అంతర్భాగంగా చేసుకోవాలి. నిర్మాణాత్మకంగా ఆలోచించే వ్యక్తి ఎన్నడూ అల్పంగా ఆలోచించడు. ఆలోచన ఉన్నతంగా ఉంటేనే మనిషి ఎత్తుకు ఎగరగలుగుతాడు. శిఖరాగ్రాన్ని చేరగలుగుతాడు.

పదవ సూత్రం ఆత్మవిశ్వాసం. ప్రతివ్యక్తిలో ఆత్మవిశ్వాసం నిండి ఉంది. కావలసిందల్లా దాన్ని మేలుకొలపడమే. ఆత్మవిశ్వాసం మేలుకొనగానే అది ఆలోచనగా, భావనగా మారుతుంది. అసాధ్యం అనిపించిన పని సాధ్యం అవుతుంది.

పదకొండవ సూత్రం సరైన సమయంలో సరైన పని. సమయాన్ని సక్రమంగా సంయమనంతో వినియోగించాలి. సమయం పరమేశ్వరుడు ప్రసాదించిన అమూల్య వరం. దాన్ని సార్థకం చేయాలి. తన సమయం గురించి, ఇతర సమయం గురించి శ్రద్ధ వహించే వ్యక్తి సమయానికి సాఫల్య శిఖరాగ్రాన్ని చేరుకుంటాడు.

పరమాత్మ ప్రతి వ్యక్తికీ ప్రగతి పొందడానికి సమాన అవకాశాలను ప్రదానం చేశాడు. ఆ అవకాశాల నుండి తగు ప్రయోజనం పొందడమే మనం చేయవలసిన పని. పై సూత్రాలను అమలుచేస్తే, వ్యక్తి శూన్యంనుండి శిఖరాగ్రానికి చేరుకోగలుగుతాడు.

✪ ✪ ✪

## ఆత్మశక్తి మహిమ

శాంతినికేతన్ విద్యాలయ సంచాలకుడు రవీంద్రనాథ్ టాగూర్‌ని ప్రక్కింటి వ్యక్తి విపరీతంగా ద్వేషించేవాడు. కేవలం ఈర్ష్య తప్పించి ఇద్దరి మధ్య పెద్ద తగాదాలు ఏమీ లేవు. అయినా ఒక రోజు అతడు కిరాయి గూండాకి డబ్బులిచ్చి టాగూర్‌ని హత్య చేయమన్నాడు. అక్కడ ఇదే వృత్తిగా అనేకమంది గూండాలు జీవించేవారు. అందువల్ల గూండా సునాయాసంగా కత్తి చేతపట్టి కవిత వ్రాయడంలో నిమగ్నుడై, తోటలో కూర్చున్న టాగూర్‌ని పథకం ప్రకారం చంపటానికి ప్రయత్నం చేశాడు. హఠాత్తుగా ఆయన తలెత్తి చూచి, విషయాన్ని అర్థం చేసికొన్నాడు. కానీ ఏమాత్రం చలించక నిర్భయంగా, "నోరు మూసికొని ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చో. చూశావు కదా. నీలాగ పనికిరాని పనులలోకాక అతిముఖ్యమైన పనిలో నిమగ్నమైఉన్నాను. కవిత పూర్తి కాగానే నీ పని ఏమిటో ఆలోచిద్దాము. ఈలోగా కదిలేవో, కబడ్దార్!'' అని ఆజ్ఞాపించాడు. ఆయన నిర్భీతికి, ఆ స్థిర గంభీర స్వరానికి గూండా తెలియని బలహీనతకు లోనై, కత్తిని ప్రక్కన పడవేసి పరుగెత్తి పారిపోయాడు.

కొల్లాయి కట్టిన గాంధీ అతి శక్తివంతమైన బ్రిటిష్ పరిపాలనను ఆత్మ శక్తితోనే ఎదుర్కొన్నాడు. ఆత్మశక్తికి మించినదేమీ లేదు. మహనీయులు ఎంతటి విషమ పరిస్థితులలోను తమ ధీరత్వాన్ని, పౌరుషాన్ని విడనాడరు.

- ప్రజ్ఞాపురాణం నుండి

**మురికి బట్టను శుభ్రపరచడానికి సబ్బు, మురికి మనసును శుభ్రపరచడానికి స్వాధ్యాయం అవసరం.**

నావారితో నా మాట

# ఇక పురోగమించు జీవన సాధన పథంలో
# మహాకాలుని సంతానమా! జాగు చేయకు! లే! మేలుకో!

స్వయం వాజిస్తన్వం కల్పయస్వ
స్వయం యజస్వ స్వయం జుషస్వ।
మహిమా తేన్యేన న సన్నశే ॥ - ఋగ్వేదం 23/15

అనగా -

*శక్తిశాలి అయిన ఓ యజ్ఞ పురుషుడా! నీవు స్వయంగా నీ శరీరాన్ని సమర్థవంతంగా తయారు చేసుకో. స్వయంగా యజ్ఞం చేయి. స్వయంగా ధర్మాన్ని ఆచరించు. నీ మహిమను మరెవ్వరూ పొందజాలరు.*

జీవన సాధనకై ముందడుగు వేయండి! ఆగిపోకండి. వంకరలు పోకండి. ఇక్కడే కూర్చుండి పోకండి. యుగదేవత యొక్క వసంత కాలపు ప్రాణ ప్రవాహం మీకు నవ జీవనం ఇవ్వడానికి వచ్చి ఉంది. నవ ప్రాణాన్నీ, నవ స్ఫూర్తినీ, నవ ఉత్సాహాన్నీ, నవ ఉత్తేజాన్నీ మీలో నింపడానికి వచ్చి ఉంది. మీలోపల ఎక్కడ చిన్న నిప్పుకణం ఉన్నా వసంత పవనంతో దానిని రాజేసి రగిల్చి ధగధగ మండే మహాగ్ని జ్వాలగా అది మార్చివేస్తుంది. మీ లోపలి నిప్పు కణంపై పరిస్థితుల నివురు కప్పి ఉంటే - ఈ పవనం తాకగానే ఆ నివురు చూస్తూచూస్తూనే తొలగిపోతుంది. మీలో కొత్త తళుకు, కొత్త వేడి, కొత్త శక్తి ప్రవేశిస్తాయి. మీరు ఇక జీవన సాధనలో ముందడుగు వేయకుండా ఉండలేరు. ఒక కొత్త సాహసం, ఒక కొత్త అగ్ని మీ గుండెల్లో కణకణలాడుతాయి.

మీ లోపలి భావాలలో ఈ అనుభూతులు అంకురిస్తూ ఉంటే - యుగ దేవత ప్రాణాలు మిమ్మల్ని తాకాయని నిశ్చయంగా తెలుసుకోండి. దాని తపస్సు మీ భావాలలో మిళితం అయిందని ఖచ్చితంగా గుర్తించండి. మీరు మేమూ ఈ క్షణాలలో అనుభూతి పొందుతూన్న మేలుకొలుపు ఆ స్పర్శలేనిదే సాధ్యపడేది కాదు. ఈ అనుభూతికి జన్మ స్థలం మన ప్రియతములైన ప్రభువు, మన ఆరాధ్యులు పరమపూజ్య గురుదేవుల పరాచేతనయే. అక్షరాలను ఎవరు కూర్చారు, పదాలను ఎవరు పేర్చారు అనే మీమాంసలో పడకండి. నాలుగైదు రూపాయల కలం, పైసా సిరా ఈ పని చేసి చూపాయి. ఈ పనికి కొన్ని పైసల కాగితం కూడ అవసరమై ఉండవచ్చు. కానీ, ఈ అల్పమైనవన్నీ కలసినా, మీరు ఇప్పుడు పొందుతూన్న అనుభూతిని ఇవ్వలేవు. ఈ అద్భుతం గురుదేవుల ప్రాణ చేతనలో ఉంది.

ప్రభువే ప్రేరణ. ప్రభువే ప్రాణం. మిమ్మల్ని జీవన సాధన పథంలో ముందుకు నడిపించగోరుతున్నది ఆ ప్రభువే. ఈ మహత్తర అవకాశాన్ని మీ చేతుల్లోనుండి జారవిడువకండి. ఎన్నెన్నో పుణ్యాల ఫలితంగా మాకూ, మీకూ ఈ మానవ జీవితం లభించింది. మనం ఎప్పుడు, ఎన్ని జన్మలలో, ఎన్ని వ్రతాలు చేశామో, ఎన్ని ఉపవాసాలు చేశామో, ఎన్ని తపస్సులు చేసి మనల్ని మనం తపింపజేసుకున్నామో! అందుకు ఫలితంగా పూజ్యవరులు మనల్ని, మనందరినీ తనవాళ్లుగా చేసుకున్నారు. దేవగణాలు, మహర్షి గణాలూ ఏ కృపకోసం తహతహలాడతారో ఆ కృప మనకు సహజంగా అందింది. అలాంటి అవకాశాన్ని వదులుకోవడం, క్షుద్రత్వాల రంధ్రాలగుండా జారవిడుచుకోవడం ఎంతవరకు భావ్యం? ఎంతో కాలం నిద్రపోయాం. ఎంతో పోగొట్టుకున్నాం. ఇక మేలుకోవాలి. ఇక పొందే ప్రక్రియను ప్రారంభించాలి. ఇప్పుడు నవ శతాబ్దపు నవ ప్రభాతం కూడ వచ్చేసింది. ప్రభాత సమయం జాగరణ సమయం. ఈ సమయంలో అందరూ మేలుకుంటారు. అందరూ తమ కర్తవ్యాలను నిర్వహించడానికి తయారవుతారు. కొత్త శతాబ్దపు నవ ప్రభాతం మీకోసం, మనలో ప్రతి ఒక్కరి కోసం కొన్ని బాధ్యతలను తీసుకు వచ్చింది.

ఆ బాధ్యతలను నిర్వహించేందుకు యోగ్యులుగా మనలో ప్రతిఒక్కరూ తయారు కావాలి. అలా తయారు కావడానికి ఒకేఒక ప్రక్రియ జీవన సాధన. ఈ ప్రక్రియయే మనల్ని కొత్త తరహాలో సంస్కరిస్తుంది. తీర్చిదిద్దుతుంది. మనకు కొత్త రూపురేఖలు దిద్దుతుంది. మన జీవితాలలో అవకాశాల కొత్త ప్రపంచాన్ని సృష్టిస్తుంది. ఆలోచనల వల్ల వివేకం లభిస్తుంది. వివేకంవల్ల సంకల్పం మేలుకొంటుంది. సంకల్పంవల్ల సాధనాకార్యంపట్ల అంకిత భావం జనిస్తుంది. ఈ అంకిత భావం నిరంతరంగా సాగితే జీవితంలో అద్భుత పరివర్తన వస్తుంది. మీరు, మేమూ, మనమందరమూ ఈ ప్రక్రియను మరోమారు ప్రారంభించాలి. జీవన సాధన మార్గంలో కొత్త ఊపుతో ముందడుగు వేయాలి. ఏదో కారణంవల్ల చేయలేకపోయిన దానిని, చేయాలనుకున్నా పరిస్థితులవల్ల చేయలేకపోయిన దానిని చేసి చూపడానికి మనం నడుం బిగించాలి.

పరిస్థితులు అడ్డుపడుతున్నాయని ఇక సాకు చెప్పకండి.

**ఆత్మజ్ఞాని కష్టాలను వాటి పుట్టిల్లయిన చీకటిలోకి తరిమివేస్తాడు.**

ఎందుకంటే - జీవన సాధనకు సంకల్పం చేసిన వెనువెంటనే, మొదటి అడుగు ముందుకు వేసిన వెనువెంటనే, యుగదేవత స్వయంగా పరిస్థితులను కొత్త మలుపు త్రిప్పుతారు. వాటిని మనకు అనుకూలంగా మార్చుతారు. యుగాన్ని పరివర్తన చేసే వారి సామర్థ్యం, యుగం మొత్తానికి కొత్త రూపాన్ని, కొత్త ఆకారాన్ని, కొత్త భవిష్యత్తును ఇవ్వడంలో నిమగ్నమైన వారి సామర్థ్యం మన మామూలు పరిస్థితిని తారుమారు చేయలేదా? జీవన సాధనకు అనుకూలంగా మన పరిస్థితులు మారితీరుతాయి. అయితే మొదట మనః స్థితి అనుకూలంగా ఉండాలి. పరిస్థితులను అనుకూలంగా మలచే బాధ్యతను మన ఆరాధ్యులైన పూజ్యవరులకు వదిలివేద్దాం. అయితే, మనః స్థితిని అనుకూలంగా మలచుకునే బాధ్యతను మనం స్వయంగా స్వీకరిద్దాం. ఇక ఇందుకు వెనుకాడవద్దు. ఈ సదవకాశం తిరిగి వస్తుందో రాదో ఎవరికి తెలుసు. ఈసారి ఈ అవకాశాన్ని చేజార్చుకుంటే, మళ్లీ ఎంతకాలం, ఎన్ని జన్మలవరకు వేచి ఉండవలసివస్తుందో ఎవరికి తెలుసు.

'ఇప్పుడు జరగకపోతే ఎప్పుడూ జరగదు' - అనే పెను సవాలును స్వీకరించే సాహసం చేయండి. జీవన సాధన కోసం ముందడుగు వేసే ధైర్యాన్ని పుంజుకోండి. ఇలా వాసనల చిమ్మచీకటిలో ఎంత కాలం కొట్టుమిట్టాడుతూ ఉందాం? సోమరితనపు జడత్వం మనల్ని ఎంతకాలం పట్టి పీడిస్తుంది? అహంకారపు క్షుద్రత్వం మనల్ని ఎంతకాలం వేధిస్తుంది? ఎంత కాలం? మరెంత కాలం? చాలు. ఇక చాలు. ఇది సాహసించే తరుణం. ఈ సాహసంతోనే మనం మన పూర్వపు పొరపాట్లను సరిచేసుకోగలుగుతాం. ఇంతవరకు సాగిన గాలి తిరుగుడును ముగించగలుగుతాం. గతంలోని పాపాలను క్షాళన చేసుకోగలుగుతాం. మరవకండి - మహాతపస్వి సంతానం మనం. మనం ఆయన పుత్ర పుత్రికలం. ఆయన జీవన పర్యంతం ఎన్నడూ తన సాధనా పథం నుండి వైదొలగలేదు. మహాసాధకుని సంతానం సాధనా పథాన్ని స్వీకరించకపోవడం అనేది అసలు ఎలా సాధ్యపడుతుంది?

ఈ సాధనా పథమే వ్యక్తిత్వ వికాసానికి రాచబాట. వ్యక్తిత్వ వికాసాన్ని ఉపేక్షించడం ఏ విధంగా చూచినా తగని పనే. లోతులేని మరుగుజ్జు వ్యక్తిత్వాన్ని ఎంతకాలం అంటిపెట్టుకుని ఉంటాం. మన వ్యక్తిత్వాన్ని మహత్తరంగా రూపొందించుకు తీరాలి. ఎందుకంటే - అదే మన వికాసానికీ, వైభవానికీ, సమృద్ధికీ మూలాధారం. కేవలం మనకోసమే అవసరం కాదిది. ఇతరుల కోసమూ ఇది అవసరమే. ఒకసారి నలువైపులా దృష్టి సారించండి. ఉత్తుంగ హిమాలయంవలె శ్రేష్ఠమైన, స్వచ్ఛమైన ఆదర్శాలతో నిండిన వ్యక్తిత్వం ఎక్కడ ఉంది? లేదు. లేనే లేదు. ఎటు చూచినా భోగ విలాసాల నగ్న తాండవం. ఎటు చూచినా పాశవికత చేస్తున్న విలయ తాండవం. ఆర్ద్రమైన సంవేదన, సేవ, సహనశీలత, కరుణల ప్రవాహాలు ఇంకిపోయాయి. ఇలాంటి పరిస్థితిలో భావనల గంగను ఎవరు ప్రవహింపజేస్తారు? దీనికి సమాధానం మరెక్కడో లేదు. కేవలం మనలోనే ఉంది. మన జీవన సాధన ద్వారా మనమే ఈ ప్రశ్నకు పవిత్ర సమాధానం అందించాలి.

మన ఇంటి ఆవరణనుండి గ్రామంలోని రచ్చబండ వరకు, నగర వీధులనుండి అధికార పీఠాలవరకు, దేశాధిపత్యం నుండి ప్రపంచ వాతావరణం వరకు - అంతటా ఒకటే కొరత. వ్యక్తిత్వపు కొరత. యోగ్యతకు కొరత ఎక్కడా లేదు. డిగ్రీలు సంపాదించిన వారినుండి మహానిపుణులవరకు యోగ్యులు కోకొల్లలుగా కనిపిస్తున్నారు. కానీ, ఈ యోగ్యులలో సద్గుణాల సుగంధం లేదు. ధనవంతులు దొరకుతున్నారు. కానీ, గుణవంతులు దొరకడంలేదు. అధికార బలం ఉంది. కానీ, నరునిలో నారాయణుని చూచే భక్తి లేదు. జీవితాల పిలుపు ఒకేఒకటి - మాకు మా ఆదర్శాలను ఇవ్వండి. ఇంటిలోని పిల్లలు, విద్యాలయాలలోని విద్యార్థులు, సమాజంలోని నాయకులు - అందరూ దీనికోసమే అర్రులు చాచుతున్నారు. సమస్య ఒకే ఒకటి. మనం ఎవరిని చూచి నేర్చుకోవాలి? ఈ కొరతను మనమే పూరించాలి. మనమే ఆదర్శాల గౌరీశంకర శిఖరంపై అధిరోహించాలి.

జీవితంలో కొరతలను ప్రతిఒక్కరూ వెదుకుతున్నారు. ఎవరిని చూడు. ఇతరులు మురికివాళ్లనీ, కంపు కొడుతున్నారనీ చెపుతున్నారు. ఇక్కడా చెడు. అక్కడా చెడు. అంతటా చెడు. మరి ఈ చెడును సరిచేసేది ఎవరు? ఆ పని ఎక్కడనుంచి మొదలుపెట్టాలి? ఆ సంగతి ఎవరూ చెప్పడం లేదు. దిన పత్రికల పుటలు, వార, మాస పత్రికల పేజీలు అన్నీ అవినీతి పురాణాలే చూపిస్తున్నాయి. దృశ్య శ్రవణ ప్రసార మాధ్యమాలుకూడ ఈ కథలనే చిత్రిస్తున్నాయి. దీనికి పరిష్కారం ఏమిటో ఎవరూ చెప్పరు. ఎందుకంటే, పరిష్కార మార్గం ఒకే ఒకటి - జీవన సాధన. ఆ మార్గంలో పయనించనిదే తరణోపాయం దొరకదు. ఈ మార్గంలో నడవడానికి ఇతరులు సాహసించినా సాహసించకపోయినా - మనం సాహసించాలి. పరమపూజ్య గురుదేవుల పిల్లలమని పిలువబడుతున్న మనమే సాహసించాలి.

ఇతరుల గురించి చర్చించడంలో కాని, ఇతరులను నిందించడంలో కాని లేదు సార్థకత. స్వ-సృజనలోనే ఉంది సార్థకత. మన చింతననూ, శీలాన్ని, వ్యవహారణనూ సర్వసమగ్రంగా సంస్కరించుకోవడంలో మనం నిమగ్నం కావాలి. ప్రతి ఘడియా, ప్రతి క్షణం మనల్ని మనం క్షాళన చేసుకోవాలి. ఫలితంగా - ఇప్పటివేకాక, జన్మ జన్మాంతరాల మరకలుసైతం చెరిగిపోవాలి. మన

**నరికిన అడవి చిగురిస్తుంది. కటువైన మాట చేసిన గాయం ఎన్నటికీ మానదు.**

జీవన సాధన మన ఆలోచనలనే కాక మన సంస్కారాలను కూడా కడిగివేసేది అయి ఉండాలి. మన ఇళ్లు వాకిళ్లలో ఆడుకునే పిల్లలు మనలో ఆదర్శాన్ని కనుగొనగలగాలి. మన తల్లి దండ్రులవలె, మన అన్నవలె, మన అక్కవలె మనం శ్రమశీలురుగా, నిజాయితీపరులుగా, పరమేశ్వర పరాయణులుగా తయారుకావాలని వాళ్ళు అనుకోవాలి. నేడు మనం పిల్లలకు మంచి విషయాలు నేర్పుతూనే ఉన్నాం. కాని స్వయంగా వాటిని పాటించడం లేదు. కనుకనే, పిల్లలు మన జీవితాలను చూచి ఏవగించుకుంటున్నారు. మన మాట వినడం లేదు. మనలను ఖాతరు చేయడం లేదు. కారణం ఒక్కటే. నిజమైన శిక్షణ ఇచ్చేవి మన ఆలోచనలు కావు, మన క్రియలు.

వ్యక్తిత్వపు మూసలో వ్యక్తిత్వం రూపుదిద్దుకుంటుంది. మనం తల్లి దండ్రులం అయితే, మన పిల్లలను మూస పోయడానికై మన వ్యక్తిత్వపు మూసను తయారుచేసుకోవాలి. మనం అధ్యాపకులం అయితే - మనల్ని అనుకరించడం గౌరవప్రదం అని మన విద్యార్థులూ, విద్యార్థినులూ భావించేలా మనల్ని మనం తీర్చిదిద్దుకోవాలి. మనం సమాజసేవా వ్రతాన్ని స్వీకరిస్తే - మన ఉత్కృష్ట ఆచరణద్వారా ఇతరులకు పాఠాలు నేర్పాలి. నిందించడంవల్ల, విమర్శించడంవల్ల ఎవ్వరూ సంస్కరించబడరనే వాస్తవాన్ని గుర్తించాలి. ప్రేమను పంచడంవల్ల మాత్రమే, ఉదాహరణగా నిలచి జీవించడంవల్ల మాత్రమే ఇతరులను సంస్కరించడం సాధ్యపడుతుంది. జీవన సాధనలోని కీలకం ఒక్కటే - ఉదాహరణగా నిలచి జీవించడం. సజీవమైన ప్రశిక్షణ కేంద్రంగా రూపొందాలి మన జీవితం.

ఇతరులు అలా చేస్తున్నారు కదా, లోకం తీరు అలా ఉంది కదా - అని చెప్పడం పిరికిపందల లక్షణం. వీరుడు రణరంగంలో పరిస్థితుల సవాలును స్వీకరించి తన సత్కర్మలద్వారా నడుము విరిగేలా వాటికి జవాబిస్తాడు. కర్మక్షేత్రాన్ని బలవంతాన మలుపు త్రిప్పలేని వ్యక్తి సాధకుడెలా అవుతాడు? తన తపో బలంతో ప్రతికూల పరిస్థితులను దూదిపింజలలా ఎగిరిపోయేటట్లు చేయలేని వ్యక్తి తపస్వి ఎలా అవుతాడు? ఈ సామర్థ్యం మీలో ఉంది. మనలోని ప్రతి ఒక్కరిలోనూ ఉంది. మహాతపస్వి అయిన గురుదేవుల సంతానం పరిస్థితుల చేతుల్లో ఎన్నడూ ఓటమిని అంగీకరించరని ఎన్నడూ మరవకండి. వారి వజ్ర సంకల్పంవల్ల పరిస్థితులు తమకు తాముగా గజగజా వణికిపోతాయి. వారి కర్మ అనే గండ్రగొడ్డలి వేసే ఒకే ఒక వ్రేటుతో వ్యతిరేకత నడుము విరిగిపోతుంది.

ఓ మహాకాలుని సంతానమా! ఇక జాగు చేయకండి. లేవండి. మేలుకొనండి. ఉరకండి మీ జీవన సాధన పథం మీదకు. ఈ పుణ్య క్షణాలను వ్యర్థం కానివ్వకండి. ఈ మార్గంలో నీవు ఏకాకివి కావు. ప్రభువు శక్తి నీకు అండగా నిలచి ఉంది. గురుదేవుల ఆశీస్సులు నీపై వర్షిస్తున్నాయి. హిమాలయంలోని ఋషి సత్తాలు నీపై శుభాకాంక్షలు కురిపిస్తున్నారు. దివ్యలోకాల దేవగుణాలు నీపై దివ్య వరాలను క్రుమ్మరిస్తున్నారు.

వసంత సమీరపు ఈ శుభ క్షణాలను మనలో ఏఒక్కరూ వృధా కానివ్వకూడదు. యుగ సృజనకర్తల అగ్రశ్రేణి మనకోసం గంపెడు ఆశతో ఎదురుచూస్తోంది. జీవన సాధన ప్రసాదించే అనంత మహిమలూ, నవ యుగం బాధ్యతలూ మనకోసం ఎదురు తెన్నులు చూస్తున్నాయి.

☆☆☆

## ఎలుకలతో తిరిగే పంఖా

విజ్ఞానవేత్త న్యూటన్ తన ఇంట్లోనే, దైనందిన జీవితంలోనే తన తెలివితేటల్ని ఉపయోగించుకొని అన్వేషణలు, ఆవిష్కరణలు చేస్తూ ఉండేవాడు. ఒకరోజు గాలి వీచే పంఖాను తయారుచేశాడు. కానీ దానిని త్రిప్పటానికి శక్తిని ఎవరు సరఫరా చేస్తారనే ప్రశ్న ఉద్భవించింది. పంఖాతో ఒక గిలకను ఏర్పాటు చేసి క్రింద రెండు ఎలుకల్ని కూర్చోపెట్టి పైన గోధుమ గింజల నుంచాడు. గోధుమలను తినటానికి ఎలుకలు గిలక మీదుగా పైకి ఎక్కటానికి ప్రయత్నించేవి. గోధుమలు ఎత్తుమీద ఉండటం వలన అందక ఎలుకలు ఎక్కుతూ, క్రింద పడుతూ తాపత్రయ పడసాగేయి. ఈ విధంగా వాటి శ్రమకు పంఖా తిరుగసాగింది. న్యూటన్ ఆ వీచే గాలి ద్వారా ఆనందం పొందసాగేడు. ఆయన ఈ సాఫల్యం గూర్చి చర్చిస్తూ, మూర్ఖుల శ్రమవల్ల తెలివైన వ్యక్తులు ఏ విధంగా లాభాన్వితులు కాగలరో ఈ సంఘటన తెలియజేస్తోందని, అలాగే దురాశపరులైన వ్యక్తుల నిరర్థక మైన శ్రమను ఈ ఎలుకల ప్రయత్నంతో పోల్చవచ్చునని చెప్పి నవ్వుకోసాగేడు.

ఎలాంటి స్థితిలోను కుకల్పనలు చేయరాదు. మానసిక ప్రసన్నత సర్వకాల సర్వావస్థలయందు వ్యక్తికి అవసరం. అదే జీవితాన్ని నందనవనంగా మార్చగలదు. న్యూటన్ మహాశయుడు తన అన్వేషణల సారాంశాన్ని పై విధంగా తెలియజేసేవాడు.

- ప్రజ్ఞాపురాణం నుండి

**అసత్యంవల్ల డబ్బు రావచ్చు - ఆనందం, పవిత్రతా రావు.**

# శాంతికుంజ్ సమాచారం

## గ్రామతీర్థయోజన అమలుకు సృజనవాహిని యాత్ర

శాంతికుంజ్ వ్యవస్థాపకులు ఆదరణీయ గౌరీశంకర శర్మ నాయకత్వంలో 40 మంది ప్రముఖ కార్యకర్తలతో కూడిన సృజన వాహిని రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రాలలో పర్యటనకు 2003 డిసెంబరు మొదటివారంలో శాంతికుంజ్ నుండి బయలుదేరింది. 32 గ్రామాలలో ఈ వాహిని గ్రామతీర్థ యోజన అమలుకు ఆచరణాత్మక శిక్షణ ఇస్తుంది.

స్థానిక ప్రజల సహకారంతో పారిశుద్ధ్యం, ఆరోగ్య అభివృద్ధి, స్వావలంబనలో శిక్షణ, ప్రమాద నివారణ వాహినుల ఏర్పాటు మున్నగు కార్యక్రమాలను ఈ వాహిని ఆ గ్రామాలలో నిర్వహిస్తుంది.

గాయత్రీ పరివార్ ప్రముఖులు డాక్టర్ ప్రణవ్ పండ్యాజీ వాహిని సభ్యులు ఆయా స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ఎలా పని చేయాలో మార్గదర్శనం చేశారు. సంస్థ ప్రముఖులు శ్రద్ధేయ శైల దీదీ సృజన సేనానులకు మంగళ తిలకం దిద్దారు.

శ్రీ గౌరీశంకర శర్మ ఆ సందర్భంగా ప్రసంగిస్తూ, పారిశుద్ధ్య ఉద్యమం ప్రసిద్ధ తీర్థం పుష్కరరాజ్ నుండి ప్రారంభం అవుతుందనీ, బ్రహ్మసరోవరాన్ని క్షాళన చేస్తారనీ తెలిపారు. సృజన వాహిని 25 రోజులపాటు ఆ రెండు రాష్ట్రాలలో పర్యటిస్తుంది. ప్రతి గ్రామంలో ఆరోగ్య శిబిరాలను నిర్వహిస్తుంది. ఆయా గ్రామాలలో గ్రామ స్వరాజ్యానికి ప్రేరణ కల్పిస్తుంది.

ఈ ఉద్యమాన్ని ఇతర రాష్ట్రాలకు విస్తరించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి.

### గీతా పఠనం మనిషి కర్తవ్యం

శ్రీమద్ భగవద్గీతను సక్రమంగా పఠించడం మనిషికి పరమ కర్తవ్యం. గీతను పఠిస్తే మరో శాస్త్రాన్ని అధ్యయనం చేయనవసరం లేదు. ఎందుకంటే - భగవానుడు స్వయంగా బోధించిన శాస్త్రం అది.

- అని దేవసంస్కృతి విశ్వవిద్యాలయంలో గీతాజయంతి సందర్భంగా ప్రసంగిస్తూ కులాధిపతి డాక్టర్ ప్రణవ్ పండ్యాజీ అన్నారు.

వారింకా ఇలా అన్నారు -

ఆనాడు కురుక్షేత్రంలో మహాభారతయుద్ధానికి ముందు శ్రీకృష్ణ భగవానుడు గీతా సందేశం వినిపించాడు. నేడూ అదే పరిస్థితి ఉన్నది. ఒకవైపున భోగవాదంతో కూడిన విజ్ఞానం, వినియోగవాదంతో కూడిన పాశ్చాత్య భావజాలం మరోవైపున త్యాగవాదంతో కూడిన సంస్కృతి. ఒక వైపున అవరోహణ. మరోవైపున ఆరోహణ. మనిషి దేనిని ఎంపిక చేయాలి? - క్రిందికి దిగజారే ప్రవృత్తి ఆకర్షణీయంగా ఉంటుంది. అది సహజంగా పెరుగుతూనే ఉంటుంది. ఆ స్థితిలో ఆరోహణను మనిషి స్వయంగా చేపట్టాలి. నిండు మనసుతో, మనసా వాచా కర్మణా భగవానుని శరణు పొందడమే ఇందుకు మార్గం. మనం భగవానుని శరణు పొందిన కొలదీ, మనలో సాత్వికత పెరుగుతుంది. మన మనసు తేలికవుతుంది. మన ధ్యానంలో ఏకాగ్రత పెరుగుతుంది.

★★★

# వార్తలు

### గుడివాడలో భారతీయ సంస్కృతి జ్ఞాన పరీక్ష

గుడివాడ గాయత్రీ పరివార్ ఆధ్వర్యంలో నవంబరు 30న భారతీయ సంస్కృతి జ్ఞానపరీక్ష జరిగింది. ప్రశ్నాపత్రాల విడుదల కార్యక్రమంలో ముఖ్య అతిథిగా గుడివాడ డివిజన్ ఉపవిద్యాశాఖాధికారి శ్రీ వి.ప్రేమానందం విచ్చేశారు. గౌరవ అతిథులుగా ట్రాఫిక్ ఎస్.ఐ శ్రీమట్టా రామారావు, ఏ.ఎన్.ఆర్ కళాశాల చీఫ్ లైబ్రేరియన్ శ్రీ పి.శ్రీనివాసరావు, శ్రీ కె.వి.డి. రంగారావు పాల్గొని ప్రశ్నాపత్రాలను విడుదల చేశారు. ఇన్విజిలేటర్లుగా ఎన్.సి.సి. విద్యార్థులు, ఎ.ఎన్.ఆర్. కళాశాల విద్యార్థులు, పోస్టల్, బ్యాంకు అధికారులు వ్యవహరించారు. 25 పరీక్షా కేంద్రాలలో 1480 మంది విద్యార్థులు పరీక్షలో పాల్గొన్నారు. యోగమిత్ర శ్రీ కె.డి.వి.యన్.శ్రీనివాస్ కార్యక్రమానికి ఆధ్వర్యం వహించారు. శ్రీయుతులు కె.హేమసుందర్, ఆర్.వి.సత్యనారాయణ, వై.గుర్నాథం, కె.శ్రీనివాస రెడ్డి, ఎన్.సీతారాములు, సిహెచ్.జగన్నాథ గుప్త, జవ్వాజి నరసింహా రావు, పి.సూర్యనారాయణ, రైల్వే నరసింహారావు, జి.వి.వి. సత్యన్నారాయణ, శ్రీమతి పి.జయలక్ష్మి, కుమారి రేణుక సహకరించారు.

### విజయవాడలో పంచాంగ క్యాలెండరు ఆవిష్కరణ

విజయవాడ సబ్‌జోనల్ కార్యాలయంలో నవంబరు 23న గాయత్రీ మహాయజ్ఞం సందర్భంగా నారాకోడూరులోని గాయత్రి శక్తిపీఠం ప్రచురించిన 2004 సంవత్సరం పంచాంగ క్యాలెండరును శ్రీ తొండెపు హనుమంతరావు ఆవిష్కరించారు. తొలి ప్రతిని డాక్టర్ తుమ్మూరికి అందజేశారు.

యజ్ఞం సందర్భంగా 10మంది కార్యకర్తలు గురుదీక్ష తీసుకున్నారు. డాక్టర్ తుమ్మూరి గురుదీక్ష ఇచ్చారు. నాటి కార్యక్రమంలో 500 మంది పాల్గొన్నారు. శ్రీ ఏ.వి.ఎన్.ఎస్.కుమార్ యజ్ఞాన్ని నిర్వహించారు.

### తిరుపతిలో దీపయజ్ఞం

డిసెంబరు 8న తిరుపతి రాయల్ కాలనీలోని అయ్యప్ప దేవాలయంలో 108 దీపాలతో దీప యజ్ఞం జరిగింది. శ్రీమతి ఎన్.మునిలక్ష్మమ్మ ఆధ్వర్యం వహించారు.

☆☆☆

**దేశ కాల పరిస్థితులవల్ల ప్రభావితంకాని ఆధ్యాత్మిక శక్తి సత్యం.**

# 2004లో లక్షమందికి భారతీయ సంస్కృతి జ్ఞానపరీక్ష
## హైదరాబాదు సమావేశంలో నిర్ణయం

2004లో భారతీయ సంస్కృతి జ్ఞాన పరీక్షలో లక్షమంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొనడం గాయత్రీ పరివార్ నూతన సంవత్సర లక్ష్యాలలో ఒకటి.

జనవరి 1న హైదరాబాదులోని యుగశక్తి గాయత్రి కేంద్రంలో జరిగిన ప్రత్యేక కార్యకర్తల సమావేశంలో నిర్ణయించారు.

2003లో జరిగిన భారతీయ సంస్కృతి జ్ఞాన పరీక్షకు లభించిన స్పందనకు సమావేశంలో సంతోషం వ్యక్తపరచారు.

2006 సంవత్సరంలో కన్యాకుమారిలో జరిగే అశ్వమేధ యజ్ఞ సాఫల్యంకోసం వెయ్యిమంది కార్యకర్తలకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని సమావేశంలో నిర్ణయించారు. దక్షిణ భారతంలోని హైదరాబాదు, విజయవాడ, విశాఖపట్టణం, చెన్నై, బెంగుళూరు, మధుర, నాగపూర్‌లలోని కార్యకర్తలనుండి సమయదానం, అంశదానం, ప్రతిభాదానాలను ఆహ్వానించాలని సమావేశంలో నిర్ణయించారు.

గాయత్రీ పరివార్ ఆధ్వర్యంలో నడుస్తున్న మాసపత్రికల చందాదారుల సంఖ్యను పెంచాలని, ప్రతి గృహంలో గాయత్రీ ఉపాసనను, గాయత్రీ యజ్ఞాన్నీ చేయించాలనీ సమావేశంలో సంకల్పం తీసుకున్నారు.

శ్రీ అశ్విని సుబ్బారావు, శాంతికుంజ్ ప్రతినిధి శ్రీరాకేశ్ జైస్వాల్, శ్రీయుతులు కె.పి.విఠల్, హనుమంతరెడ్డి, లభన్‌భాయ్, గోపాల్‌చంద్ ఉపాధ్యాయ, నరసింహా రావు, శ్రీమతి భారతీ ఖండేల్‌వాల్‌లు సమావేశంలో ప్రసంగించారు.

### విశాఖ ప్రజ్ఞామండలి ఆధ్వర్యంలో గాయత్రీ యజ్ఞాలు, దీప యజ్ఞాలు

విశాఖ గాయత్రీ పరివార్ ప్రజ్ఞామండలి కార్యాలయం ఆవరణలో ప్రతి లక్ష్మివారం ఉదయం గాయత్రీ యజ్ఞం, ప్రతి శనివారం సాయంత్రం దీపయజ్ఞం క్రమబద్ధంగా జరుగుతున్నాయి. ప్రజ్ఞామండలి ఆధ్వర్యంలో ఆయా స్థలాలలో దిగువ కార్యక్రమాలు జరిగాయి.

నవంబరు 3న విశాఖపట్టణంలోని పెద వాల్తేరులో గాయత్రీ యజ్ఞం జరిగింది. శ్రీమతి ఎమ్.లక్ష్మి నిర్వహించారు.

నవంబరు 8న విజయనగరం జిల్లా డెంకాడ మండలం అక్కివరంలోని సాధుమహాత్మా వృద్ధాశ్రమంలో గాయత్రీ యజ్ఞం జరిగింది. యజ్ఞంలో వ్యసన విముక్తి ప్రాధాన్యాన్ని వివరించారు. 500 మంది పాల్గొన్నారు.

నవంబరు 9న విశాఖ చిన్న వాల్తేరులో గాయత్రీ యజ్ఞం జరిగింది. శ్రీ బి.వి.ఎస్.విజయకుమార్, శ్రీమతి శాంతి నిర్వహించారు.

నవంబరు 10న కొత్తవలస సంతపేటలోని కొత్త అమ్మ తల్లివారి గుడి ప్రాంగణంలో అయిదు కుండముల గాయత్రీ యజ్ఞం జరిగింది.

నవంబరు 22న శని త్రయోదశి సందర్భంగా ప్రజ్ఞామండలి కార్యాలయం ఆవరణలో భవ్యంగా దీపయజ్ఞం జరిగింది. శ్రీ చిందక అప్పలరాజు, శ్రీమతి శ్రీదేవి యజ్ఞాన్ని ప్రారంభించారు. శ్రీఆనందకుమార్ కాంచన్ చేసిన ప్రవచనాన్ని శ్రీమతి ఏ.సావిత్రి తెనిగించారు.

డిసెంబరు 6న విశాఖలోని రామకృష్ణా బీచ్ రోడ్డులోని శ్రీ రాధా బీచ్ రెసిడెన్సీ ఆవరణలో శ్రీ ఓ జా దంపతుల గృహంలో 1008 దీపాలతో దీపయజ్ఞం జరిగింది. అంతకుముందు కాళీమాత గుడినుండి 100 మంది మహిళలతో కలశ యాత్ర జరిగింది.

డిసెంబరు 7న పంచకుండీ గాయత్రీ యజ్ఞం జరిగింది. శ్రీ ఆనందకుమార్ కాంచన్ ప్రవచనాన్ని శ్రీమతి సావిత్రి అనువదించారు. యుగ సాహిత్య విక్రయం బాగా జరిగింది.

శ్రీమతులు సావిత్రి, వసంత, గంగాభవాని, సింహాచలం, శ్రీహేమచంద్ర రావు, శ్రీ ఓ జా దంపతులు పైకార్యక్రమాలకోసం విశేషంగా కృషి చేశారు.

### బాలేపల్లిలో నవకుండీయ గాయత్రీ యజ్ఞం

2003 డిసెంబరు 21న జగిత్యాల మండలంలోని బాలేపల్లి గ్రామ ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో నవకుండీయ గాయత్రీ యజ్ఞం జరిగింది. వెయ్యిమంది పాల్గొన్నారు. 200 మంది విద్యార్థులు గాయత్రీ మహాయజ్ఞం చేశారు. 1200 మందికి అన్నదానం జరిగింది.

బాలేపల్లి ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు శ్రీ వేముల రాంరెడ్డి యజ్ఞానికి ఆధ్వర్యం వహించారు. జగిత్యాల నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ జీవన్ రెడ్డి, జడ్.పి.టి.సి సభ్యురాలు శ్రీమతి జంగిలి సత్తమ్మ, ఎమ్.పి.టి.సి సభ్యురాలు శ్రీమతి ముస్కు సత్తమ్మ, గ్రామ సర్పంచ్ శ్రీ పడిగెల భూపతిరెడ్డి యజ్ఞంలో పాల్గొన్నారు. శ్రీ ఆడెపు గంగారాం, మిట్టపెల్లి సోమశేఖర్ యజ్ఞాన్ని నిర్వహించారు. శ్రీయుతులు గడ్డం బుచ్చిరెడ్డి, కాసం అశోక్ కుమార్ గుప్త, పడకంటి లక్ష్మీనారాయణ, రంగశంకర్, పోచమ్మల సంపత్ సహకరించారు. జగిత్యాల మునిసిపల్ కమిషనర్, గాయత్రీ పరివార్ పరిజనులు శ్రీబి.ప్రకాశ్ యజ్ఞంలో పాల్గొన్న ప్రముఖులలో ఉన్నారు.

### కాచాపూర్‌లో త్రికుండి గాయత్రీ యజ్ఞం

గీతాజయంతి సందర్భంగా డిసెంబరు 12న కరీంనగర్ జిల్లా కోహెడ మండలం కాచాపూర్ గ్రామంలో త్రికుండీ గాయత్రీ మహాయజ్ఞం జరిగింది. ఆ సందర్భంగా 12మంది గురుదీక్ష తీసుకున్నారు. కార్యక్రమంలో 50 మంది పాల్గొన్నారు. శ్రీయుతులు వీర్ల సత్యనారాయణ రావు, ఎ.మల్లయ్య సహకరించారు.

★★★

**ఆలోచన, శీలం, ఆచరణలే అదృష్టాన్ని నిర్మిస్తాయి.**

# రాష్ట్రంలో దిగ్విజయంగా భారతీయ సంస్కృతి జ్ఞానపరీక్షలు
## 11 జిల్లాలలో 12,000 మంది పాల్గొన్నారు

గత సంవత్సరం దేశవ్యాప్తంగా వివిధ భాషలలో 36 లక్షలమంది విద్యార్థినీ విద్యార్థులు భారతీయ సంస్కృతి జ్ఞాన పరీక్ష వ్రాశారు. ఆ ప్రేరణతో 2003లో మన రాష్ట్రంలో ఆ పరీక్షలను తెలుగు, ఇంగ్లీషు భాషలలో నిర్వహించడానికి కృషి జరిగింది.

రాష్ట్రంలోని 11 జిల్లాలలో 12,000 మందికి పైగా విద్యార్థినీ విద్యార్థులు 2003 నవంబరు 30న ఈ పరీక్ష వ్రాశారు. ఆవిధంగా ఈ తొలి ప్రయత్నం విజయవంతం అయింది.

అధ్యయన సామగ్రి పంపిణీ, విద్యార్థుల నమోదు, పరీక్షల నిర్వహణ, మూల్యాంకనం మున్నగు పనులన్నీ గాయత్రీ పరివార్ కార్యకర్తలు, ఆయా స్థలాలలోని ప్రముఖుల సహకారంతో జరిగాయి. కొన్ని స్థలాలలో విద్యార్థులు పరీక్షరుసుము చెల్లించలేకపోతే, కార్యకర్తలు దానిని చెల్లించారు. కొందరు కార్యకర్తలు పరీక్షల సన్నాహాలకు అయిన ఖర్చును తామే భరించారు. హైదరాబాదు నగరంలో ఎమ్.ఎన్.ఆర్ విద్యా సంస్థల విద్యార్థులు అత్యధిక సంఖ్యలో పరీక్షలు వ్రాశారు. ఆ విద్యా సంస్థల అధిపతి శ్రీ ఎమ్.ఎన్.రాజు, వారి సోదరుడు శ్రీరాజాజీ, ఆయా సంస్థల ప్రిన్సిపాల్‌లు, ప్రధానోపాధ్యాయులు అందించిన సహకారం ప్రశంసార్హం.

హైదరాబాదును మినహాయిస్తే, మహబూబ్‌నగర్ జిల్లాలో అత్యధిక సంఖ్యలో విద్యార్థులు పరీక్షలు వ్రాశారు. మహబూబ్‌నగర్ పట్టణంలోనే 21 విద్యాలయాలలో ఈ పరీక్షలు జరిగాయి. జిల్లా కన్వీనర్, శాంతినికేతన్ స్కూలు ప్రధానోపాధ్యాయులు, కరస్పాండెంట్ అయిన శ్రీరఘురామి రెడ్డి, కమిటీ సభ్యులు శ్రీరామి రెడ్డి (రామకృష్ణ ఆశ్రమ పాఠశాల), పదవీ విరమణ చేసిన ఎమ్.ఈ.ఓ, శ్రీ బి.సదాశివరెడ్డి, శ్రీఎమ్.చంద్రశేఖర రెడ్డి ఇందుకు ప్రత్యేకంగా కృషి చేశారు. కొత్తకోట, వనపర్తి, ఆత్మకూరు, పెబ్బేరు, పామాపురం మున్నగు స్థలాలలో కూడ ఈ పరీక్షలు జరిగాయి. పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయులు (పామాపురం) శ్రీనరసింహ యాదవ్, శ్రీయుతులు బి.వెంకటచంద్రా రెడ్డి, బి.వేమసుదర్శన్ రెడ్డి ఇందుకు విశేషంగా కృషి చేశారు. ఆత్మకూరులో శ్రీయుతులు దేవి వరప్రసాద్, చంద్రశేఖర రెడ్డి చక్కని కృషి చేశారు.

నారాకోడూరు గాయత్రి శక్తిపీఠం కేంద్రంగా గుంటూరు, కృష్ణా, పశ్చిమగోదావరి, ఖమ్మం జిల్లాలలో 4,000 మందికి పైగా పరీక్షలో పాల్గొన్నారు. శ్రీకొత్తపల్లి సత్యనారాయణ ఇందుకై ప్రత్యేకంగా కృషి చేశారు. గుంటూరు, మంగళగిరి, తెనాలి, చిలకలూరిపేట, రొంపిచర్ల మున్నగు స్థలాలలో పరీక్ష జరిగింది. చిలకలూరిపేట, పిడుగురాళ్ల, మోతడకలలో శ్రీమతులు పి.నాగేశ్వరి, అరుణమ్మ, గౌరిసావిత్రి గణనీయమైన కృషి చేశారు.

కృష్ణాజిల్లా గుడివాడలో గాయత్రీ పరివార్ కార్యకర్త యోగమిత్ర శ్రీ కె.డి.శ్రీనివాస్, వారి సహచరులు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆ సదస్సుకు విద్యాశాఖ జిల్లా అధికారిని, ఇతర అధికారులను, ఉపాధ్యాయులను, విద్యార్థులను ఆహ్వానించి పరీక్ష గురించి చక్కని అవగాహన కలిగించారు. విజయవాడలో శ్రీ కొల్లి నాగేశ్వర రావు, మచిలీపట్నంలో శ్రీమురళీకృష్ణ పరీక్షకు సహకరించారు. పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడులో గాయత్రీ పరివార్ శాఖ విద్యార్థులకు అవసరమయ్యే పుస్తకాల ఖర్చును తానే భరించి, సుమారు 300 మంది చేత పరీక్ష వ్రాయించింది.

ఖమ్మం జిల్లాలో శ్రీమతి కె.సత్యవాణి, శ్రీయుతులు సతీష్ ఖండేల్వాల్, నాగభూషణంలు విశేషంగా కృషిచేసి ఖమ్మం, ఇల్లందులలో పరీక్షలు నిర్వహింపజేశారు.

మెదక్ జిల్లా జహీరాబాదులో మంజీరా బ్యాంకు సీనియర్ మేనేజరు శ్రీ కె.ఎల్.ఎన్.మూర్తి, కరీంనగర్ జిల్లా జగిత్యాలలో శ్రీ ఆదెపు గంగారామ్, వేములవాడలో డా॥ పి.సత్యనారాయణ పరీక్షలకు తమ సహాయ సహకారాలు అందించారు.

ప్రకాశం జిల్లా చీరాలలో శ్రీ డి.వి.ఆర్.మూర్తి, వారి సహచరుల ప్రత్యేక కృషి ఫలితంగా 3627 మంది పరీక్ష వ్రాశారు.

విశాఖపట్టణం, విజయనగరం జిల్లాలలో సుమారు 1600 మంది చేత పరీక్షలు వ్రాయించడానికై శ్రీమతి నాగరాణి, శ్రీయుతులు హేమచంద్ర రావు, ఎస్.నాగేశ్వర రావు గణనీయమైన కృషి చేశారు.

భారతీయ సంస్కృతి జ్ఞాన పరీక్ష రాష్ట్ర కన్వీనర్ శ్రీబి.హనుమంత రెడ్డి (రిటైర్డ్ డి.ఈ.ఓ) రాష్ట్రమంతటా పర్యటించి, పరీక్షల నిర్వహణకు జరుగుతున్న సన్నాహాలను స్వయంగా పర్యవేక్షించారు. విద్యాశాఖలో వారు గడించిన విశేష అనుభవం, విద్యారంగ ప్రముఖులతో వారికి గల పరిచయాలు పరీక్షలు విజయవంతంగా నిర్వహించబడడానికి దోహదం చేశాయి. డాక్టర్ తుమ్మూరి, శ్రీ అశ్విని సుబ్బారావు, శాంతికుంజ్ ప్రతినిధులు ఈ కృషిలో వారికి మార్గదర్శనం చేశారు. గాయత్రీ పరివార్ పరిజనులు శ్రీయుతులు లక్ష్మణరావు, టి.ఎల్.వి.మల్లికార్జున రావు, పుష్యమిత్ర, ఉమేశ్, శ్రీమతి బి.ప్రమీలా హనుమంత రెడ్డి తమ విశేష సహాయ సహకారాలను అందించారు.

శ్రీ బి.హనుమంత రెడ్డి ఒక ప్రకటనలో పరీక్షల నిర్వహణలో సహకరించిన పెద్దలు, ప్రముఖులు అందరికీ హార్దిక కృతజ్ఞతలు తెలిపారు.

✡✡✡

**తన దృష్టిలోనే పతనమైనవాడిని ఎవ్వరూ ఉద్ధరించలేరు.**